ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 183 పేజీలు: 10+4 వెల: 8.00

20వేల డాలర్లు చెల్లిస్తేనే వీసాలు!
5లో

'ఆమె'కు భరణం పొందే వాక్కులేదు: సుప్రీం



శనివారం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీకి బొబ్బిలి వీణను బహూకరిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, గవర్నర్, నజీర్ డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ తదితరులు

# వృద్ధి ఇంజిన్‌గా ఎపి

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి 'భోగాపురం' లాంచ్‌ప్యాడ్

## రూ.18వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

## ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు భేష్: ప్రధాని మోడీ

**విశాఖపట్నం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, స్వర్ణాంధ్ర – వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు నేటి రోజు ఎంతో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి, శ్రీకూర్మం కూర్మనాథస్వామి, పైడితల్లి అమ్మవారికి నమస్కారాలు తెలుపుతూ ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని, విమానాశ్రయం ప్రారంభంతో పాటు రాష్ట్రంలో సుమారు రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్న మోదీ, ఉత్తరాంధ్ర యువతకు ఈ విమానాశ్రయం రన్‌వే, లాంచ్‌ప్యాడ్‌లా మారి అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. గతంలో దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 166కు పెరిగిందని, ఉడాన్ పథకం ద్వారా సామాన్య ప్రజలకు కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కేంద్రం కోస్టల్ ఎకనామిక్ కారిడార్, బ్లూ ఎకానమీ, పోర్టుల ఆధునీకరణ, జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, పీఎం గతిశక్తి మాస్టర్‌ప్లాన్ వంటి కార్యక్రమాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశ అభివృద్ధిలో కీలక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. విశాఖ–రాయపూర్ ఎక్స్‌ప్రెస్‌వే, మూలపేట, రామాయపట్నం పోర్టులు, రూ.1 లక్ష కోట్లతో రైల్వే ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. విశాఖలో సెమీ కండక్టర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడం, గూగుల్ డేటా సెంటర్‌తో పాటు అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం రాష్ట్ర యువతకు భారీ ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. నక్కపల్లిలో దేశంలోనే అతిపెద్ద ఫార్మా పార్కు ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని, రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని రెండింతల వేగంతో ముం దుకు తీసుకెళ్తోందని, >>2



# చెరువులకు మళ్లీ జీవకళ

## రూ.20 కోట్లతో ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు1:** చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న మన హైదరాబాద్‌ను చూడటం నాకెంతో సంతృప్తినిచ్చిందంటూ ముఖ్యమంత్రి ఎ, రేవంత్‌రెడ్డి శనివారం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. హైదరాబాద్ సియుఆర్‌ఈ పరిధిని క్యూర్ చేసుకుంటూ, మన చెరువులకు జీవం పోస్తూ, భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును హైడ్రా అంకితం చేస్తోందని పేర్కొన్నారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షి ంచడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదు భావి తరాల భవి ష్యత్తును భద్రపరచడం కూడా. ప్రతి చెరువును కాపాడుతూ ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షి స్తూ ముందుకు సాగుతాం అని స్పష్టం చేశారు. >>2

20 నుంచి సిఎం విదేశ పర్యటన 2లో



# జలదిగ్బంధం

శనివారం భద్రాచలం ఏజెన్సీ గ్రామాలను చుట్టుముట్టిన గోదావరి వరద

## గోదావరికి 3వ ప్రమాద హెచ్చరిక

## 56 అడుగులవద్ద ఉగ్రరూపం

## భయాందోళనల్లో మునిగిన భద్రాచలం ఏజెన్సీ

## హుటాహుటిన పునరావాస చర్యలు చేపడుతున్న అధికారులు

**భద్రాచలం,ఆగస్టు 1 ప్రభాతవార్త:** గోదావరి మరోసారి తన ఉగ్రరూపాన్ని చూపించింది. భద్రాచలం వద్ద డేంజర్ బెల్ మోగించి, మూడో ప్రమాద హెచ్చరికను దాటి 56.10 అడుగుల నీటిమట్టానికి చేరుకోవడంతో భద్రాద్రి ఏజెన్సీ మొత్తం భయాందోళనలకు గురైంది. 2022 సంవత్సరం పునరావృతం అవుతుందా అనే ఆందోళనలో అధికారులు, ఇటు ప్రజలు భయాందోళనకు గురైయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి 12.15 గంటలకు 53 అడుగుల వద్దకు చేరుకోగానే జిల్లా కలెక్టర్ అంకిత్ మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. సెలవుల్లో ఉన్న సిబ్బందిని సైతం అత్యవసరంగా విధుల్లోకి పిలిపించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. శనివారం ఉదయం 11 గంటలకు గోదావరి 56.10 అడుగులకు చేరి సుమారు 15.96 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహంతో ఉప్పొంగింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు అదే స్థాయిలో నిలకడగా కొనసాగిన వరద, అనంతరం స్వల్పంగా తగ్గి రాత్రి 8.గంటలకు 54.50అడుగులకు చేరుకోని 15,02,258 క్యూసెక్కుల నీరు భద్రాచలం గోదావరి వద్ద ప్రవహిస్తున్నది. ఎగువ ప్రాంతాలైన కాళేశ్వరం, మేడిగడ్డ, ఏటూరునాగారం వైపు వర్షాలు తగ్గడంతో వరద ఉధృతి క్రమంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని అధికారులు >>2


శనివారం బాధితులను ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

# నీటి మునిగిన రహదారులు

## స్తంభించిన రవాణా

**చింతూరు ఆగస్టు 1 ప్రభాతవార్త:** గోదావరి, శబరి నదులు ఉప్పొంగి ఉగ్రరూపం దాల్చాయి. రెండు జాతీయ రహదారులు ఎన్ హెచ్. 30,ఎన్. హెచ్. 320 నీట మునగటంతో ఏపీ, తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్గడ్ మధ్య రాకపోకలు స్తంభించాయి. వరద గోదావరి ముంపు మండలాను చుట్టూ ముట్టింది. రహదారులన్నీ నీటమునిగి రవాణా మొత్తం స్తంభించింది. తెలంగాణలోని భద్రాచలం, ఏ పి సరిహద్దులను కలిపే ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం భద్రాచలం పట్టణాన్ని వరద ముంపు నుంచి కాపాడుకోవటం కోసం కరకట్ట నిర్మించింది. ఒక్క జాతీయ రహదారి తప్ప మొత్తం కరకట్ట పూర్తి అయినా వరద నీరు జాతీయ రహదారిని ముంచెత్తి భద్రాచలం పట్టణంలోకి వరద నీరు ప్రవేసించింది. పసిగట్టిన భద్రాచలం అధికారులు వెంటనే రంగంలోకి దిగి యంత్రాలతో మట్టిని తరలించి జాతీయ రహదారిని మూసివేశారు. భద్రాచలం నుంచి నెల్లిపాక వరకు అనేకచోట్లా జాతీయ రహదారి (ఎన్ హెచ్ 30)మునిగిపోయింది. ఎటపాక పోలీస్ స్టేషన్ సమీపంలో రాజుపేట కాలనీ చివర (భద్రాచలం చర్లరోడ్డు ) మునిగిపోయింది, >>2

# పూడికతీతకు ప్రణాళిక


శనివారం ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, వివేక్

## ఎస్సారెస్పీని సందర్శించిన మంత్రులు ఉత్తమ్, శ్రీధర్, వివేక్

## వరద నీటి చేరికపై ప్రాజెక్టు అధికారులతో సమీక్ష

## కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు చెక్కుచెదరవు..

## బిఆర్ఎస్ ప్రాజెక్టులు మూణ్ణాళ్ల ముచ్చటే: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** శ్రీరాంసాగర్ పూడికతీతపై కార్యచరణ ప్రణాళిక సిద్ధంగా ఉందని గరిష్ట నీటి సామర్థ్యంలో నీటిని నిల్వ చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నామనీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌ను శనివారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐ.టీ, పరిశ్రమలశాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, మైనింగ్, కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంను రిజర్వాయర్లో నీటి మట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టుకు చెందిన అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఎగువనగల గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీ తదితర ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి ద్వారా వచ్చి చేరుతుండటంతో ఎస్సారెస్పీలో నీటి మట్టం పెరిగిందని అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. >>2



# మీసేవ లావాదేవీలు ఒక్కరోజులో రెండు లక్షలుపైనే

## మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు1:** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆన్లైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం (31/07/2026) ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని పరిశ్రమలు, ఐటీ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ఫ్లాట్ ఫామ్‌ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవం తమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు. ప్రతీ రోజు సరాసరి 70 నుంచి 80 వేల >>2


శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో భేటీ అయిన సెలక్ట్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం, సభ్యులు దానం నాగేందర్, కోవ లక్ష్మి తదితరులు

# 'విద్వేషం'పై కొరడా

## బిల్లుపై స్పీకర్ సమక్షంలో సెలెక్ట్ కమిటీ సమావేశం

## ఈ చట్టం భవిష్యత్తులో దేశానికే ఆదర్శం: కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు1:** కులం, మతం, ప్రాంతం, లింగం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, నేరాలను అరికట్టేలా చట్టాన్ని రూపొందించడంపై కమిటీ దృష్టి సారించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ శాసనసభలో తొలిసారిగా ప్రతిపాదించిన 2026 తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేషపూరితమైన నేరాల నివారణ (హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్) బిల్లుపై కీలక ప్రక్రియ ప్రారంభమైంది. బిల్లును మరింత సమగ్రంగా, రాజ్యాంగబద్ధంగా రూపొందించే లక్ష్యంతో ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం శనివారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు సెలెక్ట్ కమిటీ నివేదికను సభకు సమర్పించాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిల్లుపై శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల అభిప్రాయాలు సేకరించాలని కూడా కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ చట్టం భవిష్యత్తులో దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ఉండాలని, అదే సమయంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా సమతుల్యత పాటించాలని కమిటీ స్పష్టం చేసినట్లు వివరించారు. 'తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగం, విద్వేషపూరితమైన నేరాల (నివారణ) బిల్లు 2026' పై ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ ప్రారంభ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. సెలక్ట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, సభ్యులు దానం నాగేందర్, కోవా లక్ష్మీ, గవినోళ్ళ మధుసూదన్ రెడ్డి, తోట లక్ష్మీకాంతా రావు, కవ్వంపల్లి సత్యనారాయణ, మామిడాల యశస్విని, కోనేటి మాణిక్ రావు, కూనంనేని సాంబశివరావు, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఈ బిల్లును సమగ్రంగా పరిశీలించి, తగిన సిఫార్సులతో కూడిన నివేదికను శాసనసభకు సమర్పించే ముఖ్యమైన బాధ్యతను ఈ కమిటీకి సభ అప్పగించిందన్నారు. ఈ బాధ్యతను కమిటీ నిష్పాక్షికంగా, సమగ్ర పరి శీలనతో, నిర్మాణాత్మక చర్చల స్ఫూర్తితో నిర్వహిస్తుందనే పూర్తి విశ్వాసం నాకు >>2

# మూడు రోజుల బిడ్డను అమ్మబోయిన ఓ తల్లి

## పట్టుబడిన మధ్యవర్తి మహిళ, నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, పసికందు శిశువిహార్‌కు తరలింపు

2లో


అమ్మకానికి సరుకైన ఆడ శిశువు

# అసైన్డ్ భూములపై త్వరలో విధాన నిర్ణయం

## ధరణి అక్రమాలపై కఠిన చర్యలు: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు1:** ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. >>2

# లోతట్టు ప్రాంత ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు

## ముంపు ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన, గోదావరి వరద శాంతికి ప్రత్యేక పూజలు

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త ఆగస్టు 1:** గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క తెలిపారు. వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగామని చెప్పారు. శనివారం ఏటూరునాగారం రామన్నగూడెం పుష్కర ఘాట్, మంగపేట, వాజేడు మండలంలలో గోదావరి వరద ప్రవాహాన్ని మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వస్సల్ టొప్పోతో, ఏఎస్పి మనన్ భట్‌తో కలిసి పరిశీలించారు. కరకట్ట నిర్మాణ పనులు శరవేగంగా..రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో


శనివారం ముంపు ప్రాంతవాసులను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

కరకట్ట నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని చెప్పారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, గోదావరి పరివాహక ప్రాంతాలు, వాగులు, ముంపు గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల వల్ల ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రెండు నెలల క్రితమే అధికారులు, ప్రజాప్రతి నిధులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను >>2



శనివారం ఎపిలోని భోగాపురానికి వచ్చిన ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతూ చేసిన థింసా నృత్యం

# 20 నుంచి సిఎం రేవంత్ విదేశ పర్యటన

## 17,18 తేదీల్లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు1:** రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. గతంలోనూ సిఎం దావోస్ పర్యటనకు వెళ్లి లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగా, ప్రస్తుతం, మరోసారి తెలంగాణకు పెట్టుబడులను తీసుకొచ్చేలా సిఎం ప్రణాళికలు రూపొందించినట్టుగా తెలిసింది. గతంలో విదేశీ పర్యటనల సందర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. పారిశ్రామిక రంగంతో పాటు విద్య, వినూత్న ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధికి సంబంధించి విదేశీ సాంకేతికత విధానాలపై సిఎం ప్రత్యేకంగా స్టడీ చేయనున్నట్టుగా తెలిసింది. ఐటీ, ఫార్మా మ్యానూఫ్యాక్చరింగ్ రంగాలు తెలంగాణ వైపు మొగ్గుచూపేలా ఈ పర్యటన సాగనుందని తెలిసింది. ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు వివిధ దేశాల్లో సిఎం పర్యటించనున్నట్టుగా సమాచారం. అమెరికా, యూకే సహా మరికొన్ని దేశాలకు ముఖ్యమంత్రి వెళ్లనున్నట్టుగా సమాచారం. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సిఎం సమావేశం కానున్నట్టుగా తెలిసింది. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ టూర్ కొనసాగనున్నట్టుగా సమాచారం. సిఎం విదేశీ టూర్‌కు వెళ్లేముందు రెండురోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. 17,18వ తేదీల్లో అసెంబ్లీ రెండు రోజుల పాటు సమావేశం అయ్యే అవకాశం ఉందని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే,ఎంపీ ఎన్నికల్లో యువత పోటీ చేసేందుకు వీలుగా అర్హత వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని భావిస్తోంది. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల విస్తరణకు సంబంధించిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశ పెడుతున్న సమయంలోనే ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా యువత వయో పరిమితిని 21 ఏళ్లకు తగ్గించే బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరనున్నారు.

# వివేకానంద ఆశయాల సాధనకు యువత ముందుకు రావాలి: ప్రధాని పిలుపు

**మైసూరు, ఆగస్టు 1:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం కర్ణాటకలోని మైసూరులో స్వామి వివేకానంద సాంస్కృతిక యువజన కేంద్రంవివేక స్మారకను ప్రారంభించారు. రామకృష్ణ మిషన్ బోధనలు తన జీవితంపై ఎంతో ప్రభావం చూపాయని, సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన తన ప్రయాణం నుంచి ప్రధానమంత్రి పదవికి చేరుకునే వరకు రామకృష్ణ మిషన్ విలువలు తనకు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. మైసూరు పవిత్ర భూమిపై అపూర్వమైన ఆధ్యాత్మిక శక్తిని చవిచూస్తున్నానని అన్నారు. మైసూరును భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విలక్షణమైన కేంద్రంగా అభివర్ణించిన ప్రధాని, రాజప్రాసాదాలు, ఉత్సవాలు, చారిత్రక వారసత్వాన్ని ఈ నగరం ఎంతో గొప్పగా పరిరక్షించిందని కొనియాడారు. భారతీయ సంస్కృతి ఈ నగరంలోని ప్రతి అణువులోనూ ప్రతిబింబిస్తోందని అన్నారు.వివేకానందుని మైసూరు మహారాజు అందించిన ప్రోత్సాహం చిరస్మరణీయంస్వామి వివేకానంద జీవితంలోని ఓ చారిత్రక ఘట్టాన్ని ప్రధాని గుర్తు చేశారు.

# అసైన్డ్ భూములపై త్వరలో విధాన నిర్ణయం

>> అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తమ అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఈ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబరుకు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కూకట్ పల్లిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని, మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లకు కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఫైనల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుతుందనే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

# లోతట్టు ప్రాంత ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు

>> పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు.లోతట్టు ప్రాంతాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి హామీ.లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, అవసరమైన పునరావాస చర్యలు చేపడతామని మంత్రి సీతక్క వెల్లడించారు.వాజేడు మండలంలోని ముళ్లకట్ట-పూసూరు వంతెన వద్ద మంత్రి సీతక్క శనివారం గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. వరద పరిస్థితులపై అధికారులకు ఆదేశాలిచ్చారు. అధికారులకు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క హెచ్చరిక.గోదావరి వరద ప్రవాహంపై అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బ్యాక్‌వాటర్ ప్రభావంతో గ్రామాలు, కాలనీలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడితే బాధిత కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి సూచించారు. వరదలు, వాగులు ఉప్పొంగిన సమయంలో వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని ప్రజలకు మంత్రి సూచించారు. వర్షాల సమయంలో అడవుల్లో పశువులను మేపడం, చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు.పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యసౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులను పరామర్శించిన మంత్రి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీవో, ఎస్పీ, సబ్ కలెక్టర్, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, డీపీఓ, కొండా వెంకయ్య, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చెరువులకు మళ్లీ జీవకళ

>> ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండింది. భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఈ చెరువును రూ.20 కోట్లతో హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఈ క్రమంలో వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా, మురుగు నీరు బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది. దీంతో ఎగువనున్న ప్రాంతాలు నీట మునగకుండా వరద నీరు నల్ల చెరువుకు చేరింది. 10 ఎకరాల ఆక్రమణలను తొలగించి 70 ఎకరాల విస్తీర్ణంలో నల్లచెరువును హైడ్రా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతోంది. ఉప్పల్ నల్లచెరువుకు ఎగువున ఉన్న నాచారం చెరువుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరేలా రెండు ఇన్ లెట్లను అభివృద్ధి చేశారు. చెరువు నిండిన తర్వాత వరద నీరు సాఫీగా మూసీకి చేరేలా ఔట్ లెట్లను నిర్మించారు. నీటి నిల్వకే పరిమితం కాకుండా ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యం, వినోదం కల్పించేలా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన మెయిన్ బండ్, పిల్లల కోసం ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

# తెలంగాణ రైజింగ్

## కొత్త శిఖరాలకు రాష్ట్రం :సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు1:** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాది(రూ.3,80,031)లో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ మేరకు శనివారం ట్వీట్ చేశారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, తఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# వృద్ధి ఇంజిన్‌గా ఎపి

>> ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని ప్రధాని కొనియాడారు.గత మూడు సంవత్సరాల పర్యటనల్లో ఆంధ్రప్రదేశ్‌లో రూ.2 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేసిన మోదీ, పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి, ఎగుమతులు, ఉపాధి పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఆసియాలోనే కీలక ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. చివరగా, నేడు ప్రారంభించిన అన్ని ప్రాజెక్టులు స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్ సంకల్ప సాధనలో మైలురాయిగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మూడు రోజుల బిడ్డను అమ్మబోయిన ఓ తల్లి

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఆగస్టు 1 ప్రభాతవార్త:** పుట్టిన మూడు రోజులకే అభం శుభం తెలియని ఆ పసికందు అమ్మకానికి అంగడి సరుకైంది. నవ మాసాలు మోసి కన్న తల్లే డబ్బుల కోసం విక్రయించడానికి మధ్యవర్తి చేతుల్లో పెట్టింది. ఆడ శిశువును ఓ మహిళ అమ్మే ప్రయత్నంలో ఉండగా రంగ ప్రవేశం చేసిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో నిందితులైన మహిళతో పాటు శిశువు తల్లిని రిమాండ్‌కు పంపారు. పసికందును సంరక్షణ నిమిత్తం శిశు విహార్‌కు తరలించారు. ఈ ఘటన హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ కిందకు వచ్చే బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్ రియాసత్‌నగర్‌లోని ఒవైసీనగర్‌కు చెందిన ఆఫ్రీన్ బేగం (26)కు గత బుధవారం మలక్‌పేట్ ఎంఎన్ ఏరియా ఆసుపత్రిలో కాన్పు జరిగి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే అంతకు ముందే నలుగురు పిల్లలు ఉండడం.. ఆర్థిక ఇబ్బందులు తోడు కావడం.. భర్తకు ఆరోగ్యం బాగుండక పోవడమో మరేమో గానీ పుట్టిన పసి బిడ్డను అమ్మాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు మధ్యవర్తి అయిన చాంద్రాయణగుట్ట బార్కాస్ సలాలకు చెందిన గృహిణి వహీదా ఖాటూన్ (46)తో రూ. మూడు లక్షలకు బేరం కుదుర్చుకొని రూ.5 వేలు తీసుకొని శిశువును అప్పగించింది. ఇదిలా ఉండగా బాలాపూర్ షాహిన్‌నగర్‌లోని జెజిఆర్ గార్డెన్ వద్ద శుక్రవారం సాయంత్రం శిశువు విక్రయ ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు బాలాపూర్ పిఎస్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో రంగంలో దిగిన పోలీసులు అక్కడికి చేరుకొని వహీదా ఖాటూన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పసికందుతో సహా నిందితురాలిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ జరపగా విక్రయ గుట్టు వెలుగులోకి వచ్చింది. కేసును ఫైల్ చేసిన పోలీసులు ఆడ శిశువును సంరక్షణ నిమిత్తం మధురానగర్‌లోని శిశు విహార్‌కు తరలించారు. నిందితులైన వహీదా ఖాటూన్‌ను అదే విధంగా శిశువు తల్లి ఆఫ్రీన్ బేగంను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపారు. కేసును బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఒక్క రోజులో రెండు లక్షలుపైనే

>> కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# 'విద్వేషం'పై కొరడా

>> ఉందన్నారు. సెలెక్ట్ కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా, భవిష్యత్తు తరాలకు కూడా మార్గదర్శకంగా ఉండే విధంగా సభ్యుల సహకారంతో నియమాలను రూపొందిస్తామన్నారు. సెలెక్ట్ కమిటీలో అనుభవం ఉన్న సభ్యులు ఉన్నారు. అందరం కలిసి సమిష్టిగా నిర్ణయాలు తీసుకుందాం. రెగ్యులర్ గా సమావేశాలు నిర్వహిస్తూ సాధ్యమైనంత త్వరగా రిపోర్టులను సభాపతికి అందజేస్తామన్నారు. ఇది కేవలం శిక్షలు విధించే చట్టం కాదని, సమాజంలో విద్వేషపూరిత వాతావరణాన్ని నిరోధించి సామాజిక సామరస్యాన్ని కాపాడే దిశగా రూపొందిస్తున్న సమగ్రబిల్లు అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సభలో కానీ, సమాజంలో కానీ విద్వేష పూరిత ప్రసంగాలు, ద్వేషాన్ని ప్రేరేపించే చర్యలకు తావు లేకుండా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. నిర్మాణాత్మక సూచనలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నివేదిక సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సెక్రటరీ డా. వినరసింహా చార్యులు, అసెంబ్లీసెక్రటరీ రేండ్ల తిరుపతి,అధికారులు పాల్గొన్నారు.

# పూడికతీతకు ప్రణాళిక

>>ఇప్పటికిప్పుడు వర్షాలు నిలిచిపోయినా, మరో 48 గంటల వరకు వరద నీరు ప్రాజెక్టులోకి వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం1091.00 అడుగులు, 80 టిఎంసిలకు గాను, ప్రస్తుతం 1072.30 అడుగులు, 27.376 టిఎం సిల వద్ద నీరు నిలువ ఉందని తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువప్రాంతాల నుండి శనివారం మధ్యాహ్నాం సమయానికి85వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను బట్టి ఆయకట్టు పంటలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలని అన్న విషయమై రెండు మూడు రోజులలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయితే, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే ఎస్సారెస్పీలో ఈసారి కొంత తక్కువ మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. గత సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్ లో 38టిఎంసిల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 27 టిఎంసిలకే పరిమితం అయ్యిందన్నారు. నిజానికి 112 టీఎంసీల పూర్తి స్థాయి సామర్థ్యంతో నిర్మించబడిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడిక చేరడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 80 టిఎంసిలకు పడిపోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సారెస్పీ లో పూడిక తొలగింపు ప్రక్రియను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయమై అతి త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ, శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులు దశాబ్దాల కాలంగా చెక్కు చెదరకుండా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వ హయాంలో 2019 లో నిర్మించిన మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలు మాత్రం 2022 నాటికే కూలిపోయాయని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆక్షేపించారు. వీటి అవసరం లేకుండానే ఎల్లంపల్లి రిజర్వాయర్ లోకి 20 టిఎంసి ల నీరు వచ్చి చేరిందని అన్నారు. మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పై బ్యారేజీలలో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారని, అన్ని విషయాలను శాస్త్రీయంగా, సాంకేతికపరంగా సమగ్ర పరిశీలన జరిపి మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇటీవల ఢిల్లీలో అత్యున్నత స్థాయిలో జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, కేంద్ర జల సంఘం సమావేశాల్లోనూ ఏకీభవించడం జరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ప్రజలపై ఎనలేని భారం మోపిందని ఆక్షేపించారు. మేడిగడ్డ పంప్ హౌజ్ ల ద్వారా గత ప్రభుత్వం 60 టిఎంసి నీటిని ఎత్తిపోస్తే ఒక్క కరెంట్ బిల్లు రూపంలోనే 3వేల కోట్ల రూపాయల ఛార్జీలు అయ్యాయని అన్నారు. పంప్ హౌజ్ ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రజాధనం వృధా చేసిన వారే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సిఇ సునితాదేవి తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి ఉధృతి

# జలదిగ్బంధం

>> చెబుతున్నారు. అయినప్పటికీ మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండటంతో ప్రజలు పునరావాస కేంద్రాలనే ఆశ్రయించాలని హెచ్చరిస్తున్నారు. భద్రాచలానికి నలుమూలాల జాతీయ రహదారులపై వరద నీరు చేరడంతో ఏజెన్సీతో సంబంధాలు సంభవించిపోయాయి. గోదావరి ఉధృ తితో భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారితో పాటు పలు లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాద్రి ఏజెన్సీకి రాకపోకలు తీవ్రంగా దెబ్బతి న్నాయి. అనేక గ్రామాలకు రవాణా నిలి చిపోగా, ప్రజలు అత్యవసర సేవల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారు. వేలాది ఎకరాల్లో పత్తి తదితర పంటలు నీటమునిగాయి.

**ప్రజల మధ్య జిల్లా కలెక్టర్ అంకిత్ :** స్వయంగా గోదావరి స్నానఘాట్, కరకట్ట, కూనవరం రహదారులను పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధం, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిం చాలని ఆదేశించారు. వరద నీటిలోకి ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు, చేపల వేట, పడవ ప్రయాణాలకు పూర్తిగా నిషేధం విధించారు. భద్రాద్రి ఏజెన్సీని వరదలు ముంచెత్తి ప్రజలు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని ఆందోళనకు గురువుతున్న వారికి నేనున్నాను అని భరోసా కల్పించాల్సిన జిల్లా మంత్రులు ఎక్కడ కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది

**అప్రమత్తంగానే ఉండాలని హెచ్చరిక:** గోదావరి తగ్గుముఖం పట్టినా ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తిరిగి ఇళ్లకు వెళ్లకుండా, అధికారుల సూచనలు వచ్చే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచిస్తు న్నారు. అదే విధంగా గోదావరి వచ్చి తగ్గిన తర్వాత ముంపు ప్రాంతాలలో అంటువ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉన్నందున పరిసరాలు శుభ్రం చేసుకోని, శుద్ధిచేసిన నీటిని తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# నీటి మునిగిన రహదారులు

>> భద్రాలం నుండి నెల్లిపాక రహదారిలో గుండాల రాయన పేట, చోడవరంనెల్లిపాక, నెల్లిపాక తోటపల్లి, గౌరిదేవిపేట నందిగామ, పోలిపాక మురుమూరు, కూనవరం మండలం ఉదయభాస్కర్ కాలనీ మునిగిపోయింది, బొజ్జరాయి గూడెం, శబరి కొత్తగూడెం గ్రామాలు నీట మునిగాయి. కాచవరంపోలిపాక రోడ్డు మునిగిపోయింది. కూనవరం చింతూరు మధ్య పంద్రాజు పల్లి వద్ద రోడ్డు మునిగిపోయింది. దాంతో పడవలు, ట్రాక్టర్లపై ప్రజలను దాటవేస్తున్నారు. ఇక చింతూరు నుంచి భద్రాచలం వెళ్ళటానికి నెల్లిపాక వద్ద జాతీయ రహదారి మునిగిపోవటంతో, వయా లక్ష్మీపురం, కొర్రాజులగుట్ట రహదారిపై చుక్కలు చూస్తూ వాహనాలు భద్రాచలం చేరుతున్నాయి. చింతూరు నుంచి కుంట ( చత్తీస్గఢ్) కలిపే జాతీయ రహదారిపై రాకపోకలు కొనసాగుతున్నాయి. చింతూరు నుండి ఒరిస్సా ను కలిపే జాతీయ రహదారి ఎన్ హెచ్. 320 నీటిమునిగింది. రవాణా స్తంభించింది. చింతూరు వి. ఆర్. పురం మండలను కలిపే రహదారి మునిగిపోయింది. సోకిలేరు, అత్తకోడల్లా వాగు, రామవరం కాలువ, చింతరేవుపల్లి వద్ద రహదారులు నీటమునిగాయి. సీతంపేట పేట, ఒడ్డుగూడెం, ధర్మాతాళ్ళగూడెం గ్రామల్లో కొన్ని గృహాలు నీట మునిగాయి. శ్రీరామగిరి గ్రామంలో ఇంట్లో కి వరద నీరు రావటంతూ సామాన్లను ఎగువ ప్రాంతానికి తరలించుకునే నేపథ్యంలో గుండెపోటు రాకపోవడంతో నల్లారపు నవీన్ (32) అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. వరద తాకిడితో భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం 56 అడుగుల వద్ద నిలకడగా ఉంది. చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం 40 అడుగులకు చేరుకుంది. రహదారులు నీట మునగటంతో పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ ట్రాక్టర్ల పై వరద నీటిని దాటి సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు పోలవరం జిల్లా చింతూరు డివిజన్లో 618 ఇండ్లు, 26 రోడ్లు నీటముని గినట్టు అధికారులు అంచనా వేశారు. మొత్తం 118 పునఃరావాస కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్టు కలెక్టర్ ప్రకటించారు. ఇది ముంపు మండలాల్లో తాజా పరిస్థితి. వీటితో పాటు ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో అనేక చోట్ల రహదారులు నీటమునికగి రాకపోకలు నిలిచి పోయాయి. ప్రజలు వరద నీటినుండి సామాన్లు సురక్షిత ప్రాంతలకు తరలిస్తున్నారు

## వారం - వర్జ్యం

02-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె
తి.చవితి రా.11.12
న.పూర్వాభాద్ర రా.9.34
వర్జ్యం లేదు.
దు.సా.4.52-సా.5.43
రాహు. సా.4.30-సా.6.00
శుభ సమయం లేదు.

## వార్తాఫలం

**మేషం :** సకుటుంబ సమేతంగా దూర ప్రాంత ప్రయాణాలు చేస్తారు. మొండితనం కన్నా సర్దుకు పోవటమే మేలు.

**వృషభం :** వ్యక్తిగత సమస్యల నుండి బయట పడతారు. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వస్త్ర లాభం.

**మిథునం :** నూతన ప్రయత్నాలు లాభిస్తాయి. ఎదుటివారి విషయంలో జోక్యం వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**కర్కాటకం :** ఉద్యోగంలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం :** రాజకీయ, పారిశ్రామిక రంగాల లోని వారు ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుకుంటారు. ధనలాభం.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు ముమ్మరంగా చేస్తారు. వస్తు కొనుగోలు.

**తుల :** ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**వృశ్చికం :** దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి. జీవిత భాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**ధనుస్సు :** ఉద్యోగులకు పదోన్నతులు, విదేశీ పర్యటనలు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహన సౌఖ్యం.

**మకరం :** నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారి తీస్తాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కుంభం :** చేపట్టిన పనులు సాఫీగా సాగుతాయి. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. సోదరుల కలయిక.

**మీనం :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలంగాణ రైజింగ్-2047లో భాగస్వామ్యం కావాలి

## ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

### సిఎస్ఆర్ ద్వారా కీలకపాత్ర పోషించాలని

### కార్పొరేట్ సంస్థలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 1:** కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమిష్టి కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్‌ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తెలంగాణ రైజింగ్ 2047 అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్‌నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పోరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహాదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




## కామన్వెల్త్ గేమ్స్‌లో అస్మితాదే స్వర్ణం సాధించడం హర్షణీయం: పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కామన్వెల్త్ గేమ్స్‌లో 48 కిలోల మహిళల జూడో విభాగంలో భారత జూడో క్రీడాకారిణి అస్మితాదే స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించడం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, భారత జూడో చరిత్రలో తొలిసారిగా కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అత్యున్నత అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన అస్మితా దేకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె ఈ విజయం దేశ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కఠోర శ్రమ, అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అస్మితా దే మరోసారి నిరూపించారని మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించి దేశ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు CAD విభాగం
పర్యవేక్షక అభియంత కార్యాలయం, నీటిపారుదల వలయం సంఖ్య 1, మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

క్రమ సంఖ్య: 1. టెండర్ నోటీసు సంఖ్య: 25/2026-27, తేది: 23.07.2026 (2వ పిలుపు). పనిపేరు: కోయిలసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం-నాగిరెడ్డిపల్లి గ్రామం, నర్వ మండలంలోని స్టేజ్-I పంపింగ్ స్టేషన్ మరియు తీలేర్ గ్రామం, మారికల్ మండలం, నారాయణపేట జిల్లాలోని స్టేజ్-II, పంపింగ్ స్టేషన్-వరద నీటిపంపుల కొనుగోలు, సరఫరా, ఏర్పాటు మరియు ప్రారంభం-నిర్వహణ మరియు సంరక్షణ. పని విలువ రూ.: 2,05,34,339/-. అప్లోడెడ్ డేట్ మరియు టెండర్‌యాక్సెస్ : 03.08.2026. చివరి తేది : 18.08.2026. చిరునామా మరియు ఫోన్ నెంబర్ : డి.కేశవరావు, పర్యవేక్షక అభియంత, నీటిపారుదల వలయం నెం.1, మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా, ఫోన్ నెం: +7032174654. తదుపరి వివరాలకు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌ను చూడగలరు: www.tender.telangana.gov.in

సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్ నెం.1, మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా.

DIPR.NO. 7115-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 01.08.2026





# ఇదెక్కడి చోద్యం!

### 'కనురెప్ప కూడా కదపకుండా చెత్త పడేసేవాళ్లే విదేశాల్లో చిన్న చాక్లెట్ కాగితాన్ని చెత్తబుట్టలో వేస్తారు

### పౌర స్పృహపై బొంబాయి హైకోర్టు మందలింపు

**ముంబై, ఆగస్టు 1:** పౌర స్పృహపై ఒక అరుదైన పాఠం చెబుతూ, దేశంలో బహిరంగ ప్రదేశాలలో చెత్త పడేస్తూ, విదేశాలలో పరిశుభ్రత నియమాలను పాటించే పౌరులను బొంబాయి హైకోర్టు మందలించింది. పరిశుభ్రతను పాటించాల్సిన ప్రాముఖ్యతను కోర్టు నొక్కిచెప్పడంతో పాటు, నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా పిలుపునిచ్చింది. ముంబైలోని కంజూర్‌మార్గ్ డంపింగ్ గ్రౌండ్ వల్ల కలుగుతున్న కాలుష్యం, దుర్వాసన, వాయు ఉద్గారాలు, తత్ఫలితంగా ఎదురయ్యే ఆరోగ్య ప్రమాదాలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా జస్టిస్‌లు జి.ఎస్. కులకర్ణి, ఆర్తి సాతేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారతదేశంలో "కనురెప్ప కూడా కదపకుండా రోడ్డుపై చెత్త పడేస్తే వారే, విదేశాలలో "ఒక చిన్న చాక్లెట్ కాగితాన్ని కూడా చెత్తబుట్టలో వేస్తారని కోర్టు పేర్కొంది. 'స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి ఇదేనా మూల్యం?' ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం అత్యవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. "ఒక వ్యక్తి పరిశుభ్రమైన వాతావరణాన్ని కోరుకుంటే, సమాజం పట్ల పరిశుభ్రతను కాపాడటం వారి ప్రాథమిక బాధ్యత. చర్యలు తీసుకునేటప్పుడు పౌర అధికారులు కఠినంగా వ్యవహరించాలని తాము కోరుకుంటున్నాము" అని కోర్టు పేర్కొంది. పౌరులలో చైతన్యం కల్గించాలని సూచించింది.

# కేంద్ర పన్నుల వాటా రూ.1.09 లక్షల కోట్లు విడుదల

### తెలంగాణకు రూ. 2,370 కోట్లు.. ఎపికి రూ. 4,597 కోట్లు

### రాష్ట్రాలకు ముందే విడుదల చేసిన ఆర్థిక మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటా కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ఒక్కసారిగా రూ. 1,09,019 కోట్లను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం విడుదల చేసింది. ఇందులో పన్నుల వాటా కింద తెలంగాణ రాష్ట్రానికి రూ. 2,370 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 4,597 కోట్లు విడుదలయ్యాయి. కేంద్రం నుంచి అదనపు వాటా ముందుగానే అందడంతో తెలంగాణ, ఆంధ్రాకు తీవ్ర నిధుల సమస్య నుంచి ఉపశమనం పొందే అవకాశం కలిగినట్లయింది. మూలధన వ్యయం పెంచడానికి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేయడానికి ఈ నిధులు ఎంతగానో దోహద పడతాయని ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

సహజంగా ప్రతీ నెలా 10వ తేదీ నాటికి ఇచ్చే గడువు కంటే ముందే ఈ అదనపు వాటాను విడుదల చేయడం విశేషం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాల వద్ద తగినంత నిధుల లభ్యత పెరిగి, అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం కలుగుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా కేంద్ర పన్నుల వాటా (ట్యాక్స్ డివాల్యూషన్) అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు లభించే నిధుల భాగస్వామ్యం. ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం, పంచుకోదగిన కేంద్ర నికర పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటాను 41 శాతంగా నిర్ణయించింది. ఈ కేంద్ర పన్నుల ఆదాయంలో ఆదాయపు పన్ను, కార్పొరేట్ ట్యాక్స్, జీఎస్టీ, కస్టమ్స్, ఎక్సైజ్ డ్యూటీలు ఇందులో ఉంటాయి. అయితే సెస్సులు, సర్ ఛార్జీలు మాత్రం దీనికి వర్తించవు.

# 19వ తేదీ నుంచి పోలీసు కొలువులకు దరఖాస్తులు

### సెప్టెంబరు 9 దాకా గడువు

### 7,437 పోస్టులకు నియామకాలు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** హోం శాఖ పరిధిలోని పోలీసు, ఎస్పిఎఫ్, జైళ్లు, అగ్నిమాపక శాఖల్లో ఖాళీగా వున్న 7,437 పోస్టుల ఖాళీల భర్తీకి దరఖాస్తు తేదీని పోలీసు నియామక మండలి శనివారం ప్రకటించింది. జులై 29వ తేదీన ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా తాజాగా దరఖాస్తులు చేసుకునేందుకు గడువును ప్రకటిం చింది. ఆగస్టు 19వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సెప్టెంబరు తొమ్మి దవ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పోలీసు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. కాగా దరఖాస్తు చేసుకునేవారు పోలీసు శాఖ, ఎస్పిఎఫ్‌లో ఎస్ఐ, ఆర్ఎస్ఐ పోస్టులకు ఎస్‌సి, ఎస్టిలయితే 750 రూపాయలు, ఇతరులు 1500 రూపాయలు ఫీజుగా నిర్ణయించారు, అగ్నిమాపక విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు, జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్ పో స్టులకు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలో ఏఎస్ఐ పోస్టులకు కూడా ఇదే ఫీజును నిర్ణయించారు. ఇక కానిస్టేబుల్ పోస్టులకు సివిల్, సాయుధ బలగం, సిపిఎల్ విభాగాలతో పాటు ఎస్పిఎఫ్, అగ్నిమాపక విభాగంలో ఫైర్ ఫైటర్, జైళ్ల శాఖలో వార్డర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఎస్‌సి, ఎస్టిలయితే 600 రూపాయలు, ఇతరులు 1200 రూపాయలు ఫీజుగా నిర్ణయించారు. పోలీసు శాఖలో డ్రైవర్, మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఎస్‌సి, ఎస్టిలయితే 600 రూపాయలు, ఇతరులు 1200 రూపా యలు ఫీజుగా నిర్ణయించారు. దరఖాస్తు చేసేవారు అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని నియామక మండలి ఛైర్మన్ కోరారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తరువాత అర్హులైన వారికి దేహదారుఢ్య పరీక్షలతోపాటు క్రీడాంశాలకు సంబంధించిన సెలక్షన్ నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి చివరగా రాత పరీక్ష నిర్వహిస్తారు.


హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
hmda
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్

HMDA చట్టం 2008 యొక్క 15(3) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన

(Lr. No. MED0060018146543/CLU/Plg/TG-iPASS/HMDA/2026 తేది: 02.07.2026.

G.O.Ms.No.33 MA & UD, తేదీ: 24.01.2013 ద్వారా ప్రభుత్వం నోటిఫై చేసిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) యొక్క మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ (MDP) - 2031లో, HMDA చట్టం 2008లోని సెక్షన్ 15, ఉప-సెక్షన్ (3) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, భూ వినియోగంలో ఈ క్రింది మార్పులను ప్రతిపాదించడం జరిగింది.

రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల (మం), కందువాడ (గ్రా)లోని సర్వే నంబర్లు 333A2, 333AA2, 333E2, 333EE2, 333A1, 333AA1 మరియు 333E21 లలో ఉన్న మొత్తం 26165.83 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలం. ఇందులో రోడ్డు కోసం కేటాయించిన 236.68 చదరపు మీటర్లు పోను, నికర స్థల విస్తీర్ణం 25929.15 చదరపు మీటర్లు ప్రస్తుతం G.O.Ms.No.33 MA & UD, తేదీ: 24.01.2013 ప్రకారం గుర్తించిన MDP-2031లో కన్సర్వేషన్ వినియోగ జోన్‌గా కేటాయించబడింది. దీనిని ఇప్పుడు "ఆరెంజ్" కేటగిరీకి చెందిన 'రబ్బర్ కాంపౌండ్' తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా 'తయారీ వినియోగ జోన్' గా మార్చాలని ప్రతిపాదించడమైనది.

పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.

సదరు ప్రతిపాదనలకు ఏ వ్యక్తి లేదా సంస్థ నుండైనా అభ్యంతరాలు/సూచనలు పరిగణింపబడతాయి. వారు అభ్యంతరాలు/సూచనలను లిఖితపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి (7) ఏడు రోజులలోపుగా మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA గానీ లేదా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, MA & UD విభాగం, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి గానీ దాఖలు చేయవలెను.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (PR), HMDA

DIPR.No.7167-PP/CL/Advt/1/2026-27, తేది: 01.08.2026



ఫారం నం.14 [నిబంధన 33(2) చూడండి]
రికవరీ అధికారి యొక్క కార్యాలయం-I/II
రుణాల రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1)
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ - 500001
డిమాండ్ ప్రకటన
1961, ఆదాయపు పన్ను చట్టంకు రెండవ షెడ్యూల్ యొక్క నిబంధన 2 మరియు రుణాల యొక్క రికవరీ మరియు దివాలాచట్టం 1993 యొక్క 25 TO 28 సెక్షన్‌ల క్రింద ప్రకటన

RC/166/2025 తేది: 24.07.2026

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వెర్సస్
M/s అలమేలు మంగా ఇంటర్నేషనల్ బేకర్స్ ప్రై. లిమిటెడ్.,

వీరికి:
(CD-1) M/s. అలమేలు మంగా ఇంటర్నేషనల్ బేకర్స్ ప్రై. లిమిటెడ్., దాని ద్వారా ప్రాతినిధ్యం వహిస్తుంది. మేనేజింగ్ డైరెక్టర్, విల్లా నెం.138, నెం. 7-30, మై విల్లాస్, చెంగిచర్ల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా. - 500 076, తెలంగాణ.
వద్ద కూడా: Sy. నం. 564/A, 564/AA, 564/E, 588, రాఘవపురం గ్రామం, బీబీనగర్ మండి, యాదాద్రి భువనగిరి జిల్లా. - 508 126, తెలంగాణ.
(CD-2) శ్రీ P. రామ్ సుభాష్, S/o P. సుధాకర్ రెడ్డి, వయస్సు 54 సంవత్సరాలు, పురుషుడు, విల్లా నం. 138, నెం.7-30, మై విల్లాస్, చెంగిచర్ల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా.-500076, తెలంగాణ.
(CD-3) శ్రీమతి. పి. రత్న ప్రియ, W/o శ్రీ రామ్ సుభాష్, వయస్సు 52 సంవత్సరాలు, స్త్రీ, విల్లా నం. 138, నం. 7-30, మై విల్లాస్, చెంగిచర్ల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా.-500076, తెలంగాణ.
(CD-4) శ్రీమతి. జి. అరుణ, వయస్సు 21 సంవత్సరాలు., స్త్రీ, విల్లా నం.138, నెం.7-30, మై విల్లాస్, చెంగిచర్ల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా. - 500 076, తెలంగాణ.
(CD-5) నమో బాలాజీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, దాని డైరెక్టర్ ద్వారా ప్రాతినిధ్యంచే, 12-11/1457/1, బౌద్ధనగర్, జామై ఉస్మానియా, వారాసిగూడ, సికింద్రాబాద్ - 500 061.
వద్ద కూడా: Sy.No. 564/A, 564/AA, 564/E, 588, రాఘవపురం గ్రామం, బీబీనగర్ మండి, యాదాద్రి భువనగిరి జిల్లా. - 508 126, తెలంగాణ.

ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా OA No. 432/2022లో రుణాల రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1), ప్రిసైడింగ్ అధికారిచే జారీ అయిన ఉత్తర్వులు అనుసరించి జారీ అయిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం సొమ్ము మొత్తం రూ.7,81,72,486/- (రూపాయలు ఏడు కోట్ల ఎనభై ఒక్క లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల ఎనభై ఆరు మాత్రమే) పెండెంట్ లైట్ మరియు భవిష్యత్ వివిధ వడ్డీ (రికవరీ ప్రకారం) రేట్లతోసహా రిసింపుల్ వడ్డీ చెల్లించబడే వరకు 19.11.2024 నుండి, రియలైజేషన్ వరకు మరియు ధరల యొక్క రూ.1,88,105/- (రూపాయలు ఒక లక్ష ఎనభై ఎనిమిది వేల ఒక వంద ఐదు మాత్రమే) మీకు ఎదురుగా రుణ బకాయి అయివున్నదని ఇందుమూలముగా ప్రకటించడమైనది. (జాయింట్‌గా మరియు వేర్వేరుగా/పూర్తిగా/లిమిటెడ్)
2. పైన పేర్కొనబడిన రుణ మొత్తాన్ని ఈ నోటీస్ స్వీకరించిన 15 రోజులలో చెల్లించవలసినదిగా ఇందుమూలముగా మిమ్మల్ని ఆదేశించడమైనది. మీరు విఫలమైతే బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల చట్టం, 1993 మరియు దాని క్రింద నిబంధనలు రుణాల యొక్క రికవరీతో అనుసరించి రికవరీ చేయబడుతుంది.
3. హియరింగ్ యొక్క తర్వాత తేదీ ముందు లేదా ఆరోజున మీ యొక్క ఆస్తుల వివరాలు ఒక అఫిడవిట్‌పై ప్రకటించవలసినదిగా ఇందుమూలముగా మిమ్మల్ని ఆదేశించడమైనది.
4. తదుపరి ప్రొసీడింగ్స్ నిమిత్తం 08.10.2026న ఉ.10.30 గం. వద్ద మీరు దిగువ సంతకందారుని ఎదుట హాజరు కావలసినదిగా మిమ్మల్ని ఇందుమూలముగా ఆదేశించడమైనది.
5. పైన పేర్కొనబడిన సొమ్ము మొత్తానికి అదనంగా (a) మీరు ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్/ సర్టిఫికెట్ యొక్క ఈ ప్రకటన తర్వాత వెనువెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించవలసిన అటువంటి వడ్డీలు చెల్లించవలసిన బాధ్యత కూడా మీకు ఉన్నది. (b) బకాయి మొత్తం రికవరీ కొరకు తీసుకున్న అన్ని ఇతర ప్రొసీడింగ్స్ మరియు ఇతర ప్రొసెస్‌లు మరియు వారెంట్‌లు మరియు ఈ నోటీస్ సర్వీస్‌కు సంబంధించి అయిన ఖర్చులు మరియు ఛార్జీలు, అన్ని ధరలు.
24.07.2026 ఈ తేదీన, ట్రిబ్యునల్ యొక్క సీల్ మరియు నా స్వహస్తం క్రింద ఇవ్వబడినది.

సం/- రికవరీ ఆఫీసర్
రుణాల రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT 1)


### సిఐడి ఆధ్వర్యంలో నెల రోజులపాటు

# ఆపరేషన్ ముస్కాన్-12 నిర్వహణ

### రాష్ట్రవ్యాప్తంగా 6,307 బాలల సంరక్షణ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** సిఐడి ఆధ్వర్యంలో జులై నెల ఒకటవ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వీధి బాలలు, బా ల కార్మికులు, వెట్టిచాకిరిలో వున్న బాలలను కాపాడేందుకు ఆపరేషన్ ముస్కాన్-12 నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 6307 మంది బాలలను రక్షించారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి డిజి చారు సిన్హా శనివారం మీడియాకు వెల్లడించారు. ఆపరేషన్ ముస్కాన్ 12 కోసం 124 సబ్ డివిజనల్ పరిధిలో 620 మంది పోలీసులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నెల రోజుల పాటు పనిచేశారని ఆమె తెలిపారు.

రక్షించబడ్డ బాలలలో 5892 మంది బాలురు కాగా 415 మంది బాలికలు వున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 3447 మంది, బిహార్, యుపి, ఒడిశా, ఎపి, బెంగాల్, జార్కండ్‌కు చెందిన వారు 2860 మంది పొరుగు దేశం నేపాల్‌కు చెందినవారు 40 మంది ఉన్నారు. వీరిలో బాల కార్మికులుగా పని చేస్తున్న వారు 5041 మంది, వెట్టిచాకిరిలో ఒకరు, వీధిబాలలు 647, యాచక వృత్తిలో వున్న వారు 43, అనాథగా ఒకరు, ఇంట్లో నుంచి పారిపోయినవారు 11 మంది వున్నారు. వీరితోపాటు అక్రమంగా దత్తత తీసుకున్న బాలలు, బాల్య వివాహం చేసుకున్న వారు, పరీక్షల్లో తప్పిపోయి ఇళ్ల నుంచి వెళ్లిపోయిన వారు 563 మంది వున్నారు. ఆపరేషన్ ముస్కాన్ 12లో భాగంగా 1705 ఎ ఫ్ఐఆర్‌లు నమోదు కాగా, 1710 మంది నిందితులను అరెస్టు చేశారు.

1989 మంది బాలలను పలు ప్రాంతాల్లో వున్న కేసుల నుంచి కాపాడారు. బాల కార్మికులకు సంబంధించి 138 మందిపై చర్యలకు కార్మిక శాఖకు లేఖ రాశారు. ఇదే సమయంలో 5737 మంది బాలలను వారి కుటుంబీకులకు అప్పగించగా అనాథలుగా మిగిలిన 570 మందిని బాలల సంరక్షణ హోమ్‌లకు తరలించారు. దీంతో పాటు కార్మిక శాఖ బాల కా ర్మికుల విషయంలో పలు సంస్థలకు 37 లక్షల 95 వేల 356 రూపా యల జరిమానా విధించింది. ఆపరేషన్ ముస్కాన్-12 నిర్వ హణలో పోలీసులకు సహకరించిన స్వచ్ఛంద సంస్థలతోపాటు సాటి సర్కారీ విభాగాలకు సిఐడి డిజి చారు సిన్హా కృతజ్ఞతలు తెలిపారు.



# బ్రిటన్ ప్రధాని బర్న్‌హామ్‌కు ప్రధాని మోడీ ఫోన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బ్రిటన్ కొత్త ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇటీవల ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బర్న్‌హామ్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలియజేస్తూ, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భారత్ - యూకే ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోడీ సోషల్‌మీడియా ఖాతాలోవెల్లడించారు. భారత్, యూకే మధ్య ఇటీవల అమలులోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు మరింత విస్తరించడంతో పాటు ఇరు దేశాల ప్రజలకు కొత్త ఆర్థిక అవకాశాలు లభిస్తాయని మోడీ అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

# నేడు టిజిసిజిటిఎ రాష్ట్ర ఎన్నికలు

### ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహణ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టిజిసిజిటిఏ) రాష్ట్ర ఎన్నికలు నేడు (ఆదివారం) జరగనున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించుకోనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎన్ గోపి, డాక్టర్ కే సురేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కాలేజీ స్థాయిలో, జిల్లాస్థాయిలోనూ ఏకగ్రీవంగా సురేందర్ రెడ్డి ప్యానల్ సభ్యులు విజయం సాధించారని వారు తెలియజేశారు. సమస్యల పరిష్కారంలోను, కళాశాలల పటిష్టత విషయంలోనూ తాము చేసిన కృషికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అధ్యాపక మిత్రులు తమ ప్యానల్ సభ్యులని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# సైబర్ క్రైం డిసిపి అరవింద్‌బాబు ఆకస్మిక బదలీ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాత వార్త:** హైదరాబాద్ సైబర్ క్రైం డిసిపి వి.అరవింద్ బాబు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ప్రధాని నరేంద్ర మో దిపై మెటా ఇండియా అనే సోషల్ మీడియా సంస్థ అనుచితంగా వీడియోలు, ఫోటోలను ఇన్‌స్టాగ్రాం, ఫేస్ బుక్‌లో వుంచడంపై బిజెపి నేతలు శుక్రవారం అరవింద్ బాబును కలిసి దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మెటా ఇండియాపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం లేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆయనపై సర్కారు వేటు వేసిందని తెలిసింది. అరవింద్ బాబును డిజిపి కార్యాలయానికి బదిలీ చేశారు. శుక్రవారం రాత్రి ఈ ఉత్తర్వులు జారీ కాగా శనివారం ఆయన స్థానంలో సిసిఎస్ డిసిపికి ఇంఛార్జి బాధ్యతలు అప్పగించారు. గ్రూప్ వన్ అధికారి అయిన అరవింద్ బాబు ఏడాది క్రితం సైబర్ క్రైం డిసిపిగా ధార కవిత స్థానంలో నియమితులయ్యారు.


బంగారం వేలం నోటీసు
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు, అకుర్డి, పూణె 411035
BAJAJ FINANCE

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందచేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది: 1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు). 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్దం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹ 25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి. వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(10-09-26): అచ్చంపేట - లింగాల ఎక్స్ రోడ్; PJH2SGL32049484. ఆదిలాబాద్ - ద్వారకా నగర్; PEK4SGL32654220. బాన్సువాడ - బస్ స్టాండ్; PCV9SGL30210568. భద్రాచలం - ఆర్‌టీసీ బస్ స్టాండ్; PEK5SGL32033200, 33557440. భైంసా - నిర్మల్ రోడ్; PPA4SGL30093861, 30901414, 30903076, 31232431, 31582580, 31763734, 31754717, 32101095, 32442772, 33345737, 33385184, 33348566, 33350723, 34252019. బోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL34260635, 35096711. భూపాల్‌పల్లి - మెయిన్ రోడ్; PCW2SGL31260021, 33350154, 33875258, 34106075. (11-09-26) గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL18870272, 31019266. గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL17110274, 29627332, 29684644, 32025748, 32639473, 33606521, 34555071. గోదావరిఖని - కల్యాణ్ నగర్; PEK6SGL20678605. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL31630544, 33585890, 34298806, 34850832, 34845952. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PGM7SGL31210508, 33844773. కామారెడ్డి - నిజాంసాగర్ రోడ్; PB6QSGL31226202, 31813187, 33847381. కామారెడ్డి - విద్యా నగర్; PKQ4SGL32065782. (12-09-26) కరీంనగర్ - సీవీఆర్ఎన్ రోడ్; PCW8SGL32085742, 32665928, 33606763, 34076338. కాజీపేట - మెయిన్ రోడ్; POH7SGL34306791, 34826674. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL23002105, 30780151, 32042209, 33643985, 33837729. ఖమ్మం - జమ్మిబండ రోడ్; PGG1SGL17284351, 23557352, 29447658, 29836879, 30899022, 31082425, 32895959, 33459720. ఖమ్మం - ఖానాపురం హవేలీ; POH9SGL22957601. కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PJV4SGL30819555. కోస్గి - శివాజీ చౌక్; PJH6SGL31646098. (15-09-26) మహబూబ్‌నగర్ - తెలంగాణ చౌరస్తా; PMJ9SGL29440918, 33426563. మహబూబ్‌నగర్ - జడ్చెర్ల; POI2SGL29645126, 32256626. మంచిర్యాల - హైదరాబాద్ రోడ్; PCW9SGL31399082, 32695814. మణుగూరు - అశోక్ నగర్; PCX1SGL30074439. మెదక్ - టిపిఎల్ బ్రాహ్మణ్ స్ట్రీట్; PCX2SGL32708593. మెట్‌పల్లి - మెయిన్ రోడ్; PEF7SGL23213261, 32305922, 32519808, 33825086, 34568976, 34839261. మిర్యాలగూడ - బీజేఎల్; PNT9SGL31592673, 32265442, 32484944, 32496306, 32894036, 33341438, 33578105, 34105321, 35160214, 35079179. (16-09-26) ములుగు - గాంధీ చౌక్; PJV5SGL30485973, 32540067, 33324351. నల్గొండ - ఆర్‌పీ రోడ్; PNT8SGL16895281, 34081368. నారాయణపేట - నర్సిరెడ్డి చౌరస్తా; PJH5SGL32058822, 32023623, 32730897, 34043542, 34246214. నర్సంపేట్ - జై శ్రీ థియేటర్; PCX3SGL29491664, 29697372, 30184563, 30431160, 32862447. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PCX4SGL29672355, 29852093, 31027831, 31754193, 32030745, 32103012, 32682976, 33851125, 34552310, 35098907. [illegible]

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# ఇథనాల్ మిక్సింగ్ పెట్రోల్‌పై కేజ్రీవాల్ ఉద్యమం

### ప్రధాని నివాసానికి పాదయాత్ర చేయాలని నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** దేశంలో ఇంధన భద్రత పేరుతో ఇథనాల్ కలిపిన పెట్రోల్ ను తప్పనిసరి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రేపు భారీ ఉద్యమం ప్రారంభం కాబోతోంది. జాతీయ స్థాయిలో ఇ-20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిర్ణయించారు. ఈ మేరకు ఆయన రేపు ఢిల్లీలో ఉద్యమం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో ఇ-20కి వ్యతిరేకంగా ఇప్పటికే నిరసనలు చేస్తున్న సామాజిక కార్యకర్త తెహసీన్ పూనావాలా కూడా పాదయాత్ర, నిరాహారదీక్ష చేపట్టబోతున్నారు.

ఈనెల 3వ తేదీ పీఎం నివాసానికి పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్రం ఇ-20 కార్యక్రమానికి వ్యతిరేకంగా తన జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించడానికి ముందు రోజు, ఒక ప్రముఖ వ్యక్తి ఈ ఆందోళనలో చేరబోతున్నారని కేజ్రీవాల్ ఇవాళ ప్రకటించారు. ఇథనాల్ మిశ్రమం సమస్యపై జులై 5న తొలి క్షేత్రస్థాయి నిరసనకు నాయకత్వం వహించిన పూనావాలా, తాను గాంధీ స్మృతి వరకు పాదయాత్ర చేసి నిరాహార దీక్ష ప్రారంభిస్తానని ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని కేజ్రీవాల్ గుర్తుచేశారు.

రేపు న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవు తుందని, పాల్గొనేవారు ఉదయం 11.30 గంటలకల్లా చేరుకోవాలని కేజ్రీవాల్ తెలిపారు.



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముదురుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశంలో ఇంధన సరఫరాలు, పౌరుల భద్రత, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా ఇంధన ధరల పెరుగుదల,సముద్ర మార్గాల్లో రవాణా నిలిచిపోవడం, విదేశీ మారకద్రవ్యంపై భారం పడటం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. హర్మూజ్ జలసంధి దగ్గరరవాణా నిలిచిపోవడంతో భారత్‌కు వచ్చే చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ముడిచమురు ధరలు పెరగడంవల్ల దేశంలో పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులపై భారంపడుతోంది. ఎలక్ట్రానిక్స్,వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనిక ఎరువుల దిగుమతులపై ప్రభావం పడుతోంది. ఎర్రసముద్రం, సూయజ్ కాలువ మార్గాల్లో దాడులవల్ల నౌకలు ఆఫ్రికా మీదుగా చుట్టూ తిరగాల్సివస్తోంది. దీనివల్ల భారత్‌లో రవాణా ఖర్చులు,సమయం భారీగా పెరుగుతున్నాయి. రవాణా సమస్యల వల్ల ముడి సరుకుల కొరతతో ఎంఎస్ఎంఇ రంగాలుఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నౌకాయాన మార్గాలకు అవాంతరాలు కలగడం వల్ల ఇంధన ధరలు,దిగుమతి ఖర్చులు పెరిగి,భారత్‌వంటి చమురును దిగుమతి చేసుకునే దేశాలపై ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరుగుతోంది. భారత్ తన మొత్తం ముడి చమురు అవసరాలలో ఏకంగా 85శాతం కంటే ఎక్కువ భాగాన్ని ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఇంధన ధరల భారం పెరగడం వల్ల దేశ ద్రవ్యలోటు, కరెంట్ ఖాతాలోటుపై మళీ తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ నిరంతరం క్షీణిస్తోంది. రూపాయి విలువ పడిపోవడం వల్ల దేశంలోకి దిగుమతయ్యే ప్రతి వస్తువుధర భారీగా పెరుగుతోంది. దీనివల్ల దేశీయంగా ద్రవ్యోల్బణం అంటే ధరలపెరుగుదల వేగవంతం అవుతుంది.

# సామాన్యులపై పశ్చిమాసియా దెబ్బ

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా భారత్ ఆర్థిక పరిస్థితులను కుదిపేస్తున్నాయి. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల భారం నలువైపుల నుంచి విరుచుకుపడుతోంది. దీంతో భారత కరెన్సీపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల పెరుగుదలవల్ల రూపాయిపై ఒత్తిడి పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై ఇంధన ధరలు, విదేశీ విద్య, ప్రయాణ ఖర్చులు దాదాపు 20శాతం వరకు పెరిగాయి. వాస్తవానికి రూపాయి విలువ పడిపోవడం వల్ల దేశంలోని ప్రతి సామాన్య కుటుంబంపై, వారి ఇంటి బడ్జెట్ పై, విదేశీ ప్రయాణాలు, పిల్లల చదువుల ఖర్చులపై దీని ప్రత్యక్ష ప్రభావం చాలా తీవ్రంగా పడుతోంది. రవాణా ఛార్జీలు సైతం పెరుగుదల చోటు చేసుకోవడంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్‌సహా అన్ని వస్తువుల ధరలకు రెక్కలొచ్చాయి. ఫోన్లు, ఏసీలు, టీవీల ధరల్లో 15 శాతం నుంచి 20శాతం వరకు పెరిగాయి. పారాసిటమాల్ సహా 760 రకాల మందుల ధరలు అమాంతం పెంపుదల చోటు చేసుకుంది. గ్యాస్ కొరతతో హోటళ్లలో ఇడ్లీ, దోశ వంటి టిఫిన్ల ధరలు ప్రియమయ్యాయి. ఉదయం తినే టిఫిన్ నుంచి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మందుల వరకు అన్నింటి ధరలూ అమాంతం పెరిగిపోయాయి. ఎలక్ట్రానిక్, గృహోపకరణాలు, రాగి,అల్యూమినియం వంటి ముడిసరుకుల ధరలు పెరగడం, సెమీకండక్టర్ చిప్‌ల కొరతతో ఫోన్ల ధరలు 10 నుండి 20 శాతం వరకు పెరిగాయి. గతంలో రూ.15 వేలకు దొరికిన ఫోన్ ఇప్పుడు రూ.18వేలు దాటింది. ఏసీల ధరలు15శాతం, టీవీల ధరలు 10 శాతం, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు 8 నుండి 15 శాతం వరకు భారంగా మారాయి. టెలికం సంస్థలు కూడా టారిఫ్‌లను 20శాతం వరకు పెంచాయి. మరోవైపు, అత్యవసర మందుల ధరలు చుక్కలనంటాయి. ఏప్రిల్ 1 నుంచి జ్వరం, మధుమేహం, బీపీకి వాడే 760 రకాల మందుల ధరలు పెరిగాయి. పారాసిటమాల్‌పై ఏకంగా 92 శాతం ధర పెరిగింది. నిర్మాణ రంగంలోనూ ఉక్కు ధర 35 శాతం, సిమెంట్ ధర 10 శాతం పెరగడంతో సొంతింటి కల మరింత ప్రియంగా మారింది. కాగా యుద్ధం తర్వాత ముడి పదార్థాల రేట్లు పెరగడంతో పలు ఉత్పత్తుల ధరలూ భారీగా పెంచుతూ తాజాగా కంపెనీలునిర్ణయించాయి. మరోసారి శనివారం (ఆగస్టు 1) నుండి ఈ ధరలు అమల్లోకి వచ్చాయి. వీటిలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, దుస్తులు, ప్యాసింజర్ వెహికల్స్, కార్ల ధరలూ పెరిగాయి. కొన్ని రకాల ఎలక్ట్రానిక్స్,



ప్యాక్ చేసిన ఆహార ఉత్పత్తులు, గృహోపకరణాల ధరలు 4 నుండి 8 శాతం వరకు పెరుగుదల చోటు చేసుకుంది. అలాగే ప్యాక్ చేసిన టీపొడి, తల నూనె (హెయిర్‌ఆయిల్), రెడీమేడ్ దుస్తులు ధరల్లోకూడా పెరుగుదల చోటు చేసుకుంది. ఇప్పటికే గత కొన్ని నెలలుగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్ కారణంగా హోటళ్లలో ఆహార పదార్థాల ధరలు పెరిగాయి. ఇడ్లీ,దోశవంటి టిఫిన్ల ధరలు ప్లేటుకు రూ.10 నుంచి రూ.25వరకు పెంచేశారు. ఆన్‌లైన్ ఫుడ్,గ్రాసరీ యాప్‌లలోనూ ధరలు 6నుంచి 9శాతం వరకు పెరగడంతో వినియోగదారులపై తీవ్రప్రభావం పడుతోంది. ఒకదాని ధర పెరగడం గొలుసుకట్టుగా మరోదానిపై ప్రభావం చూపుతూ అన్ని రంగాల్లోనూ ధరలమంట కొనసాగుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు,పెట్రోల్, డీజిల్ ధరలపెంపు ప్రభావం ద్రవ్యోల్బణాన్ని పెంచడంలో కీలకంగా ఉన్నాయి. భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 4.38 శాతానికి పెరిగింది. ఇది 18నెలల గరిష్టస్థాయి కావడం గమనార్హం. ఆహార ద్రవ్యోల్బణం 5.32శాతానికి పెరుగుదల నమోదైంది. తెలంగాణలోనే అత్యధికంగా 6.36 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 6.36 శాతంగా ఉండగా ధరలు ఇక్కడ చాలాఎక్కువగా ఉన్నాయని చెప్పొచ్చు. తెలంగాణలో అధిక ద్రవ్యోల్బణం ఉందంటే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే నిత్యావసర వస్తువులు, సేవల ధరలు చాలావేగంగా పెరిగాయన్నమాట. గతేడాది జూలైలో తెలంగాణలో ఒక సామాన్యుడు తన నెలకు సరిపడా సరకుల కోసం రూ.10 వేలు ఖర్చు చేస్తే ఈ ఏడాది అనే నెలలో అదనంగా 6.36 శాతం అంటే రూ. 636అధికంగా ఖర్చుచేశాడనిచెప్పొచ్చు. ధరలు పెరిగిన వస్తువుల్లో చూస్తేవెండి ఆభరణాల్లో అత్యధికంగా 133.2శాతం వృద్ధి నమోదైంది. అల్లంవార్షిక ప్రాతిపదికన 50.41శాతం పెరిగింది. బంగారం, ప్లాటినం, వజ్రాభరణాల ధరలు 36.82 శాతం పెరిగాయి. టమాటా ధరలు 31.92 శాతం పెరిగాయి.కిస్మిస్ ధరలు 20.52శాతం వరకు పుంజుకున్నాయి. ధరలు తగ్గిన వాటిల్లో బంగాళాదుంపలు (20.3 శాతం), బఠానీలు (9.67 శాతం), జీలకర్ర (జీరా) ధరలు గతేడాదితో పోల్చితే తగ్గాయి. మోటార్ కార్లు, స్కూటర్లు, మోటార్ సైకిల్స్ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. మరోపక్క భారత వ్యవసాయ రంగంపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఆటంకం కలిగిస్తుండగా, దీనికి తోడు ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని అస్తవ్యస్థం చేస్తున్నాయి. ఎరువుల దిగుమతుల్లో 45 శాతం పశ్చిమాసియా నుంచే వస్తోంది. దేశంలో యూరియా నిల్వలు ఉన్నప్పటికీ ఉద్రిక్తతలు కొనసాగడంతో రైతులకు ఎరువుల కొరతతో పాటు, పెరుగుదల కూడా చోటు చేసుకుంది.ప్రధానంగా కాంప్లెక్స్, డిఏపి, సూపర్ ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి.యూరియా యథాతథంగా ఉన్నాకాంప్లెక్స్ ఎరువులపై రూ.300 నుండి రూ.550 వరకు పెంచారు. పరిశ్రమల పైనా కూడా తీవ్ర ఒత్తిడి పెరిగింది. ముడిసరుకుల ధరలు పెరగడం, సరఫరా గొలుసులో అంతరాయాల వల్ల చిన్న,సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దేశంలో 90శాతం మంది ఉపాధి అసంఘటిత రంగంలోనే ఉంది. ఈపరిస్థితుల వల్ల నిర్మాణ రంగం,రత్నాలు,ఆతిథ్య రంగాల్లోని కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. మరోవైపు, సముద్ర మార్గాల్లో ఆటంకాల వల్ల మరోసారి వైద్యపరికరాల ముడిసరుకు ఖర్చులు 50శాతం పెరిగే అవకాశం ఉంది. మందుల ధరలు ఇప్పటికే 10 నుంచి 15 శాతం పెరగ్గా, మళ్లీ పెరుగుతుండటం సామాన్యుడి ఆరోగ్య భద్రతకు పెద్ద ముప్పుగా మారుతోంది. ఇంధన ధరల పెంపు ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాదు. డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు భారీగా పెరిగాయి. దేశంలో కూరగాయలు, పండ్లు,పాలు,ధాన్యాలు వంటి నిత్యావసర వస్తువులన్నీ లారీలు, వ్యాన్ల ద్వారానే రవాణా అవుతాయి. రవాణా భారం పెరగడంతో సహజంగానే ఆ ప్రభావం వస్తువుల ధరలపై పడుతుంది. ఇప్పటికే అమూల్, మదర్ డెయిరీ సంస్థలు పాల ధరలను లీటరుకు రూ. 2 పెంచగా, దానికి ప్రధాన కారణం రవాణా ఖర్చులేనని పేర్కొన్నాయి. ఇది అంతిమంగా సామాన్యుడి వంటగది బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేస్తోంది. పెట్రోల్ ధరల పెంపుతో సొంత వాహనాలు వాడేవారికి నెలవారీ ఖర్చులు పెరుగుతాయి. మరోవైపు డీజిల్ ధరల వల్ల బస్సు ఛార్జీలు, క్యాబ్, ఆటో ధరలు కూడా పెరిగాయి. కేవలం ప్రయాణమే కాదు, స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్, అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి ఈకామర్స్ సంస్థల డెలివరీ చార్జీలు సైతం పెరిగాయి. రైతులు సాగు కోసం వాడే ట్రాక్టర్లు, నీటి పంపులు పూర్తిగా డీజిల్పైనే ఆధారపడి ఉంటాయి. డీజిల్ ధర పెరిగితే వ్యవసాయ పెట్టుబడి వ్యయం పెరిగి, రైతులకు లాభాలు తగ్గడమే కాకుండా ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తోంది. ●

కర్ణాటక

కావేరీ జలాలు మళ్లీ మరుగుతున్నాయి. కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు కత్తులకు పదును పెడుతున్నాయి. ఈరెండు రాష్ట్రాల మధ్య కావేరి నీటిసమస్య ఈనాటిది కాకపోయినా, రెండు మూడేళ్లకోసారి కొత్త రంగు పులుముకొని రంగప్రవేశం చేస్తూంటుంది. రెండు రాష్ట్రాల్లో, ముఖ్యంగా కర్ణాటకలో తాజాగా మొదలైన ఆందోళనలు చూస్తుంటే సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రులు గాని, ఇతర ప్రజాప్రతినిధులు గాని ఎప్పటికీ ప్రయత్నించరేమో! అనే అభిప్రాయమే కలుగుతుంది. తమిళనాడుకు అన్యాయంగా కావేరీ జలాలను విడుదల చేస్తున్నారంటూ కన్నడిగులు రోడ్డెక్కుతూంటే, తమకు రావాల్సిన నీటివాటా దక్కడంలేదంటూ తమిళులు గర్జిస్తున్నారు. ఈవాదనలు ఏ రాష్ట్రం వైపు నుంచి చూస్తే అదే నిజమనిపిస్తుంది. కానీ సమస్య పరిష్కారానికి అసలు బటన్ ఎక్కడున్నదో ఎవరూ పట్టుకోలేకపోతున్నారు. 'మీరు మా రాష్ట్రానికి రాకండి. ఇక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నా' యంటూ కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ తమిళనాడు సిఎం విజయ్‌కి సూచించారంటే పరిస్థితులు ఎంతగా క్షీణించాయో అర్థమవుతుంది. గత శుక్రవారం డికె బహిరంగంగానే విజయ్‌ని అలా కోరిన తర్వాత వివాదం మరింత వేడెక్కింది. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో అప్పటికే ప్రజలు పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. విజయ్ తాజా చిత్రం 'జన నాయగన్'ను థియేటర్లలో ప్రదర్శించకుండా నిలిపివేశారు. కొన్నేళ్ల క్రితం రాజ్ కుమార్ సినిమాలను తమిళనాడులో ప్రదర్శించకుండా ఇదే విధంగా అడ్డుకున్నారు. దానికికూడా కావేరీ వివాదమే కారణం. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఆందోళనకారులు థియేటర్లను ముట్టడించి విజయ్ కటౌట్లను ధ్వంసం చేయడంతో దాదాపు అన్ని థియేటర్లలో ఆ సినిమా ప్రదర్శన నిలిపివేయడం మరిన్ని ఉద్రిక్తతలకు కారణమైంది. కర్ణాటకలోని తమిళులు కూడా ఇదే విధమైన నిరసన ప్రదర్శించడంతో అది శాంతి భద్రతల సమస్యగా మారి పోలీసులకు కొత్త తలనొప్పిని సృష్టిస్తోంది. దీనంతటికి కావేరీ జలాల రెగ్యులేషన్ కమిటీ (సిడబ్ల్యుఆర్ సి) తాజాగా ఇచ్చిన ఆదేశాలు ఒక కారణమైతే, కొద్ది రోజులుగా

# కావేరి ఆవిరి!

**ఎ.వి.వి ప్రసాద్**

కర్ణాటకలో రైతులకు తగినంత సాగునీరు లభించకపోవడం మరో కారణం. వచ్చే రెండు వారాలపాటు రోజూ 3,500 క్యూసెక్కుల కావేరీ జలాలు తమిళనాడుకు విడుదల చేయవలసిందిగా సిడబ్ల్యుఆర్సీ గత గురువారం ఆదేశించింది. అయితే ఈ సంవత్సరం నదిలో నీటి నిల్వలు తగినంతగా లేనందున ఆ ఆదేశాలు అమలు చేయలేమని కర్ణాటక అధికారులు చెప్పడంతో వివాదం ముదిరింది. దానికి కొద్ది రోజుల ముందే రెండు రాష్ట్రాల సరిహద్దులవద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కావేరీ జలాలు విడుదల చేయాలంటూ తమిళనాడులోని కొన్ని ప్రజాసంఘాలు ఆందోళనలు మొదలుపెట్టి అంతర్రాష్ట్ర బస్సులను సరిహద్దులు దాటనివ్వకపోవడంతో తీవ్ర ఉద్రిక్త



సిఎం డికె శివకుమార్

పరిస్థితులు ఏర్పడ్డాయి. వివాదం ముదురుతోందని గమనించిన రెండు రాష్ట్రాల సిఎంలు బెంగళూరులో సమావేశమవ్వాలని తొలుత నిర్ణయించినా, సిడబ్ల్యుఆర్సీ ఆదేశాల తర్వాత వివాదానికి పీటముడి పడడంతో భేటీని వాయిదా వేసుకొన్నారు. అందుకే ప్రస్తుత ఉద్రిక్తతల మధ్య బెంగళూరు రావొద్దంటూ విజయ్‌కి శివకుమార్‌సూచన చేశారు. కానీ వారి భేటీఆగినంత మాత్రాన ఉద్రిక్తతలు చల్లారుతాయా? కన్నడ సంఘాలు 13న రాష్ట్ర బంద్‌కు కూడా పిలుపునివ్వడంతో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పినట్లే కనిపిస్తోంది. నదీ వివాదాల చట్టం కిందఏర్పాటైన ట్రిబ్యునల్స్ దశాబ్దాలు గడుస్తున్నా సమస్యను పరిష్కరించలేకపోతున్నాయంటే లోపం ఎక్కడఉన్నదో కనుగొనవలసి ఉంది. ఎగువ భాగంలో ఉన్నకారణంగా కర్ణాటక తమ నీటి అవసరాల కోసం కొత్త ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టడం కూడా వివాదాస్పదమవుతోంది. తాజాగా మేకెదాటు ప్రాజెక్టుపై చెలరేగుతున్న వివాదం అటువంటిదే. కర్ణాటక నిర్మించదలచిన ఈ ప్రాజెక్టువల్ల తమ రాష్ట్రానికి వచ్చే కావేరీ జలప్రవాహం తగ్గిపోతుందని తమిళనాడు ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే ఈ ప్రాజెక్టు నీటిని మళ్లించేందుకు కాదనీ, కేవలం నిల్వచేయడానికేననీ కర్ణాటక చెబుతోంది. ఈ వివాదంపై చర్చించాలని కూడా ఇద్దరు సిఎంలుభావించారు. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు కర్ణాటకకు పొరుగు రాష్ట్రాల ముందస్తు అనుమతి తప్పనిసరి కాదని కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల రాజ్యసభలో చేసిన ఓ ప్రకటన వివాదం తీవ్రతను మరింత పెంచింది. కర్ణాటకకు అనుకూలంగా కేంద్రం మాట్లాడుతోందనే విమర్శలు తమిళనాడు నుంచి వినిపించాయి. ఇలా అనేక కారణాలు ఒకేసారి ముసరడంతో రెండు రాష్ట్రాల్లోని ప్రజాసంఘాలు ఆందోళనలు ముమ్మరం చేశాయి. చివరికి ఈవివాదం పార్లమెంటును కూడా కుదుపుతోంది. 2013లో మేకెదాటు ప్రణాళికను బహుళార్థ సాధక జలాశయం, తాగునీటి ప్రాజెక్టుగా పునరుద్ధరించినప్పటి నుంచి మొదలైన వివాదం గతపుష్కర కాలం నుంచి రగులుతూనే ఉంది. కన్నడ ఉద్యమాలకు ఎక్కువగా నాయకత్వం వహించే మాజీ ఎమ్మెల్యే వాట్టాళ్ నాగరాజ్ గతనెల 15నుంచి తీవ్రస్థాయిలో ఆందోళనలుజరుపు తూండడంతో ప్రస్తుతం బంద్‌లు, సినిమాప్రదర్శనల బంద్ దాకా వచ్చింది. అటు,ఇటు నాయకులు సవాళ్లు విసురుకోవడంతో రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోయి సాధారణ ప్రజలు స్వేచ్ఛగా సంచరించే అవకాశాన్ని సైతం కోల్పోతున్నట్లుగాకనిపిస్తోంది. సమస్యకు తాత్కాలిక పరిష్కారం మాత్రమే ఎప్పటికప్పుడు లభిస్తున్నది గాని శాశ్వతంగా సరైనదారి కనుగొనే ప్రయత్నం ఏ సిఎం చేయడంలేదనిపిస్తోంది. కేంద్రం,కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు ఒక స్పష్టమైన అవగాహనతో కావేరీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనకపోతే రెండు రాష్ట్రాల ప్రజలకు అన్యాయం జరుగుతుంది. ఇప్పటికైనా కేంద్రం పూర్తి బాధ్యతతో చర్యలు తీసుకోవాల్సి ఉంది. ●

ఇజ్రాయెల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గాజా శాంతి ప్రణాళికపై మధ్యప్రాచ్యదేశం ఇజ్రాయెల్లో రాజకీయ విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. హమాస్ పూర్తి స్థాయిలో నిరాయుధీకరణకు అంగీకరించిన తరువాతే ఇజ్రాయెల్ దళాలుగాజా నుంచి దశలవారీగా ఉపసంహరించుకుంటాయని ట్రంప్ ప్రకటించినప్పటికీ, ఈ ప్రతిపాదన ఇజ్రాయెల్ ప్రభుత్వంలోని కరుడుగట్టిన నేతలకు ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు. ఇజ్రాయెల్‌ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారులే ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రణాళిక ఇజ్రాయెల్ ప్రధాన లక్ష్యాన్ని పూర్తిగా నెరవేర్చలేదని విమర్శిస్తున్నారు. హమాస్ వద్దఉన్న ఆయుధాలను మాత్రమే కాకుండా, గాజా మొత్తం ప్రాంతాన్ని పూర్తిగా నిరాయుధీకరించి, అక్కడి సాయుధ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించిన తరువాతే తదుపరి శాంతి కార్యాచరణ చర్యలు చేపట్టాలన్నదే ఇజ్రాయెల్ ప్రధాన డిమాండ్ అని వారంతా ముక్తకంఠంతో చెపుతుంటే ఇప్పుడు ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఈసవాళ్లను అధిగమించడంతలనొప్పిగానే మారుతోంది. అమెరికా పర్యటనలో ఉన్న నెతన్యాహు గాజాతోపాటు ఇరాన్‌పై మెగా భూతల దాడులకు ట్రంప్‌తో కలిసి సమగ్ర చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. నిజానికి ఇరాన్‌పై కాల్పుల విరమణ అనేది సుతరాము నెతన్యాహుకు ఇష్టంలేదు. ఒకదశలో ట్రంప్‌మందలింపులకు కూడా గురైన నెతన్యాహు చివరకు ఇజ్రాయెల్ ప్రజలకే ఓటువేసారు. ఇప్పుడు గాజా ఒప్పందం నెతన్యాహు పీఠం కదిలించే స్థాయివరకూ వచ్చిందంటే ఇజ్రాయెల్‌లోని సంకీర్ణ ప్రభుత్వం ఎన్నికలకు ముందే రద్దవుతుందా అన్న సందేహాలు చుట్టుముడుతున్నాయి. హమాస్ పూర్తిగా నిర్వీర్యం అయ్యే వరకు ఇజ్రాయెల్ సైన్యం 'యెల్లో లైన్'గా పిలిచే భద్రతా సరిహద్దు నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రక్షణవర్గాలు నెతన్యాహుకు అల్టిమేటమ్ ఇచ్చినట్లు బహుముఖ ప్రచారం జరిగింది,ఈ యెల్లోలైన్ అనేది హమాస్ ఆధీనంలోని గాజా ప్రాంతం,ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణలో ఉన్నప్రాంతాలను వేరుచేసే కీలక సరిహద్దుగా భావిస్తారు. ఈప్రణాళికను వ్యతిరేకిస్తున్న వారిలో జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్‌గ్వీర్ మాత్రమేకాదు, మాజీ రక్షణమంత్రి, ఇస్రాయెల్

# సంకీర్ణం తలనొప్పులు..

**గన్ని మోహన్**

బీటేనూ పార్టీ నాయకుడు అవిగ్డోర్ లీబర్మన్‌లు కూడా ఉన్నారు. హమాస్‌తో ఎలాంటి ఒప్పందమైనా గతంలో జరిగిన తప్పిదాలనుమళ్లీ పునరావృతం చేయడమేనని ఆయన విమర్శించారు. అక్టోబర్ 7దాడులకు దారితీసిన విధానాలకుమళ్లీ అవకాశం కల్పించేలా ఈ ఒప్పందం ఉందని, హమాస్‌తో చర్చలు జరపడం కంటే ఆ సంస్థను పూర్తిగా నిర్మూలించడమే వీరంతా బెంజమిన్‌కు నూరిపోస్తున్నారు. మరోవైపు, హమాస్ కూడా ట్రంప్ ప్రతిపాదించిన క్రమాన్ని అంగీకరించేందుకుసిద్ధంగాలేదు. హమాస్ సీనియర్ నాయకుడు ఘాజీ హమద్ అల్ జజీరాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఇజ్రాయెల్ దళాలు ముందుగా గాజా నుంచి పూర్తిగా వైదొలగితేనే నిరాయుధీకరణ ప్రక్రియపై ఆలోచిస్తామన్నారు. అంటే,ట్రంప్ ప్రతిపాదించినవిధంగా ముందుగా హమాస్ ఆయుధాలు అప్పగించడం కాకుండా, మొదట ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ జరగాలని హమాస్ కోరుతోంది. దీంతో ఇరు పక్షాల మధ్య షరతుల విషయంలో తీవ్ర విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను రాజకీయంగా క్లిష్టపరిస్థితిలోకి నెట్టాయి. ఈఏడాది చివర్లో జరగనున్నపార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ మద్దతు నెతన్యాహూకు అత్యంతకీలకంగా మారింది. అలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన ప్రణాళికను బహిరంగంగా వ్యతిరేకించడం రాజకీయంగా ప్రమాదకరంగా మారే అవకాశంఉందని నెత న్యాహు ముందే పసిగట్టారు. అయితే మరోవైపు, ఆయన ప్రభుత్వ కూటమిలోని కరుడు గట్టిన ఇజ్రాయెలీ నేతలు ట్రంప్ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించాలని



నెతన్యాహు

ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో అమెరికాతో సంబంధాలను కొనసాగించడంతో పాటు, దేశీయ రాజకీయ ఒత్తిడిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెతన్యాహూ ముందున్న ప్రధానసవాలుగామారింది. గాజాపైట్రంప్ ప్రతిపాదనలు నెతన్యాహూసంకీర్ణ ప్రభుత్వంలోని మితవాద నేతలకు ఎంతమాత్రం ఇష్టంలేదు. ఇజ్రాయెల్ జాతీయ భద్రతా మంత్రి ఇటామార్ బెన్‌గ్వీర్ ఈ ఒప్పందాన్ని పూర్తిగా విరమించుకోవాలని నెతన్యాహూకుబహిరంగంగా సూచించారు. సామాజిక మాధ్యమంలో స్పందించిన మంత్రి బెన్‌గ్వీర్‌హమాస్ వంటి సంస్థలతో చర్చలు జరపడం సరైనమార్గం కాదని, వారితో వ్యవహరించాల్సింది కేవలం సైనిక చర్యలతోనేనని చెప్పారు. 2023అక్టోబర్ 7న జరిగిన ఘోర దాడుల అనంతరం గాజాపై ఇజ్రాయెల్ వైఖరి మరింత కఠినంగా ఉండాలన్నారు.గాజాలో హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడం,అక్కడి పరిస్థితులను పూర్తిగా మార్చడం మాత్రమేఇజ్రాయెల్ అంగీకరించే పరిష్కారమని తెగేసి చెప్పారు. ఈ అంశాన్ని తమ అత్యంత సన్నిహిత మిత్రదేశాలకూ నెత న్యాహూ స్పష్టంగా తెలియజేయాలని బెన్‌గ్వీర్ డిమాండ్ చేశారు. అయితే ట్రంప్‌చేసిన తాజా ప్రకటనపై ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఇప్పటివరకు బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. హమాస్‌తో సంబంధం ఉన్న ఏ ఒప్పందమైనా దేశీయ రాజకీయంగా అత్యంత సున్నితమైన అంశంగా మారిన నేపథ్యంలో ఆయన మౌనం ప్రాధాన్యత సంతరించుకుంది. గాజాయుద్ధం కొనసాగుతున్నవేళట్రంప్ ప్రకటించిన ఈశాంతి ప్రతిపాదనపై ఇజ్రాయెల్లో రాజకీయ విభేదాలు మరింత తీవ్రరూపందాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు హమాస్ నిరాయుధీకరణను ముందుకు తీసుకెళ్లాలన్న అంతర్జాతీయ ప్రయత్నాలు కొనసాగుతుండగా, మరోవైపు ఇజ్రాయెల్ ప్రభుత్వంలోనికరుడుగట్టిన ఇజ్రాయెల్ జాతీయవాదులు సైనికచర్యలే శాశ్వత పరిష్కారమని పట్టుబడుతుండటంతో ప్రధాని బెంజమిన్‌కు ఎటు వెళ్లాలనేది ఆయన మౌనం వీడితేకానీ ఆదేశ ప్రజలకు తెలిసేటట్లు లేదు. ●

# సామాజిక, ఆర్థిక అసమానతలు పెంచుతున్న 'ఎఐ'


**మేకిరి దామోదర్**

అగ్ని మనిషికి నాగరికతను ఇచ్చింది..అదే అగ్ని విధ్వంసానికీ కారణమైంది. అణుశక్తి విద్యుత్‌ను ఇచ్చింది. అణుబాంబునూ సృష్టించింది. ఇప్పుడు కృత్రిమ మేధ కూడా అదే కూడలిలో నిలిచింది. అది మానవాళిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందా? లేక నియంత్రణ లేకుంటే కొత్త అసమానతలు, కొత్త ప్రమాదాలకు కారణం అవుతుందా? అనే ప్రశ్నకు సమాధానం మన చేతుల్లోనే ఉంది. 'ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ విప్లవం వేగంగా విస్తరిస్తోంది. ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు, విద్య నుంచి న్యాయవ్యవస్థ వరకు, పరిశ్రమల నుంచి ప్రభుత్వ పాలన వరకు ప్రతి రంగంలోనూ ఏఐ ప్రభావం పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యధిక యువ సాంకేతిక నిపుణులున్న దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచ ఏఐ నైపుణ్య మానవ వనరుల్లో భారతీయుల వాటా గణనీయంగా ఉందని పలు అంతర్జాతీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం దేశంలోని అధిక శాతం ఐటీ,తయారీ, బ్యాంకింగ్, ఆరోగ్య, ఈకామర్స్ సంస్థలు ఏదో ఒక రూపంలో ఏఐ సేవలను వినియోగిస్తున్నాయి. భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏఐ పాత్ర ప్రతి ఏడాది మరింత విస్తరిస్తోంది. అయితే ఏఐ అభివృద్ధి ఎంత వేగంగా జరుగుతుందో, దానికి సంబంధించిన చట్టాలు, నియంత్రణ వ్యవస్థలు అంత వేగంగా అభివృద్ధి చెందడం లేదు. ఈ అంతరమే భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారే అవకాశం ఉంది. ఏఐవల్ల పరిశ్రమల్లో ఉత్పాదకత పెరుగుతోంది. యంత్రాల లోపాలను ముందుగానే గుర్తించడం, నాణ్యత నియంత్రణ, సరఫరా గొలుసు నిర్వహణ, ఆరోగ్య నిర్ధారణ, పంటల అంచనా, ఆర్థిక మోసాల గుర్తింపు, భాషా అనువాదం వంటి అనేక రంగాల్లో అద్భుత ఫలితాలు కనిపిస్తున్నాయి. విద్యార్థులకు వ్యక్తిగత అభ్యాసం, రైతులకు వాతావరణ సూచనలు, వైద్యులకు వేగవంతమైన రోగ నిర్ధారణ, ప్రభుత్వానికి మెరుగైన సేవలందించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం 2030నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏఐ సుమారు 15 ట్రిలియన్ డాలర్లకు పైగా అదనపు విలువను సృష్టించే అవకాశముంది. భారతదేశంలో కూడా వచ్చే దశాబ్దంలో లక్షలాది కొత్త సాంకేతిక ఉద్యోగాలకు ఏఐ దోహదం చేస్తుందని నిపుణులు అంచనావేస్తున్నారు.అయితే అదే సమయంలో కొన్ని కీలక ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. ఏఐతీసుకునే నిర్ణయాలకుబాధ్యత వహించేది ఎవరు? తప్పు వైద్యసలహా ఇచ్చినా, నిర్దోషిని నేరస్థుడిగా గుర్తించినా, ఉద్యోగ నియామకంలో వివక్ష చూపినా బాధ్యత ఎవరిది? ఆల్గారిథమ్ ఎలా పనిచేసిందో ప్రజలకు తెలియకపోతే పారదర్శకత ఎలా సాధ్యం? ఇవన్నీ సమాధానం కోరుతున్న ప్రశ్నలే. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకే తిక చట్టాలు, వ్యక్తిగత డేటా రక్షణ చట్టాలుమాత్రమే ఈ సవాళ్లన్నింటికీ సరిపోవు. అందుకే సమకాలీన అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ఏఐ విధానం, సమగ్రచట్టాలు, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.ఏఐ వినియోగం పెరు గుతున్నకొద్దీ సంస్థలు కొత్త ప్రమాదాలను ఎదు ర్కొంటున్నాయి. ఉద్యోగులు తెలియకుండానే కంపెనీకి సం బంధించిన రహస్య సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉన్న ఏఐ వ్యవస్థల్లో నమోదు చేయడం ద్వారా విలువైన మేధో సంపత్తి బయటకు వెళ్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారులు ఇచ్చే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అనేక ఏఐనమూనాలు మరింత మెరుగవుతుంటాయి. అంటేసంస్థల అనుభవం,వ్యాపార వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం పరోక్షంగా ఇతరులకు చేరే అవకాశం ఉంటుంది.అందుకే ప్రతిసంస్థ తమకు ప్రత్యేకమైన సురక్షిత ఏఐ వాతావరణాన్ని రూపొందించుకోవాలి.ఉద్యోగులకు డేటా భద్రతపై శిక్షణ ఇవ్వాలి. ఏ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉన్న ఏఐలో నమోదు చేయవచ్చో, ఏది చేయకూడదో స్పష్టమైన విధానాలు ఉండాలి. మరోవైపు డీప్‌ఫేక్ సాంకేతికత పెద్ద సామాజిక సమస్యగా మారుతోంది. నకిలీ వీడియోలు, తప్పుడు ఆడియోలు, అసత్య ప్రచారం, ఆర్థిక మోసాలు, ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి.ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకున్న డీప్‌ఫేక్ కంటెంట్ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది వ్యక్తిగత గౌరవానికే కాక ప్రజాస్వామ్యానికి కూడా ప్రమాదకరం. అందుకే ఏఐ సంస్థలు, ప్రభుత్వాలు, సామాజిక మాధ్యమ సంస్థలు కలిసి బాధ్యతాయుతమైన నియం త్రణ వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధ తటస్థమని చాలా మంది భావిస్తారు. కానీ అది శిక్షణ పొందే డేటాలోనే వివక్ష ఉంటే, అదే వివక్షను మరింత బలపరు స్తుందని ఐక్యరాజ్య సమితి, యునెస్కో తది తర సంస్థల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఉద్యోగ నియామకాలలో ఉపయోగించే కొన్ని ఏఐ వ్యవస్థలు పురుషులను నాయకత్వ పాత్రలకు, మహిళలను సంరక్షణ, గృహ బాధ్యతలకు ఎక్కువగా అనుసం ధానించే ధోరణి కనబరుస్తున్నాయని పరిశోధనలు వెల్లడించాయి. గతంలో సమాజంలో ఉన్న పక్ష పాతాలు డేటా రూపంలో ఏఐలోకి ప్రవేశిస్తే, అవే భవిష్యత్ నిర్ణ యాల్లోనూ ప్రతిబింబించే ప్రమాదం ఉంది. అలాగే మహి ళలపై డీప్‌ఫేక్‌ల దుర్వినియోగం తీవ్రమవుతోంది. దీనివల్ల వారి వ్యక్తిగత గౌరవం, ఉపాధి అవకాశాలు, మానసిక ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే ఏఐ వ్యవస్థలు రూపొందించే సంస్థలు పారదర్శకత, నిష్పాక్షికత, మానవ హక్కుల పరిరక్షణను తప్పనిసరి ప్రమాణా లుగా పాటించాలి. ఆల్గారిథమ్‌లను స్వతంత్రంగా పరీక్షించే విధానాలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, బాధితులకు న్యాయం చేసే చట్టబద్ధ వ్యవస్థలు ఏర్పడాలి. భారతదేశం ఇప్పటికే ఇండియా ఎఐ మిషన్ ద్వారా దేశీయ ఏఐ సామర్థ్యాల అభివృద్ధికి చర్యలు ప్రారంభించింది. ఇప్పుడు తదుపరి దశగా బాధ్యతాయుతమైన ఏఐ పాలనకు చట్టబద్ధమైన రూపురేఖలు రూపొందించడం అత్యంత అవసరం. కృత్రిమ మేధ మనిషిని భర్తీ చేయడానికి కాదు, అతని సామర్థ్యాన్ని విస్తరించడానికి వచ్చిన సాంకేతిక విప్లవం. కానీ దానికి నైతికత, పారదర్శకత, జవాబుదారీతనం, మానవ హక్కుల పరిరక్షణ అనే నాలుగు స్తంభాలు లేకపోతే అదే సాంకేతికత అసమానతలకు, అన్యాయాలకు, సామాజిక విభేదాలకు కారణమవుతుంది. ఆవిష్కరణలను అడ్డుకోవడం పరిష్కారం కాదు. నియంత్రణలేని ఆవిష్కరణలు కూడా శ్రేయస్కరం కావు. అందువల్ల భారతదేశం సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూనే బాధ్యతాయుతమైన ఏఐ చట్టాలు, స్వతంత్ర నియంత్రణ వ్యవస్థ, డేటా భద్రత, డీప్‌ఫేక్ నిరోధక విధానాలు, ఆల్గారిథమ్ పార దర్శకత, పౌర హక్కుల పరిరక్షణను సమన్వయం చేసే సమగ్ర విధానాన్ని రూపొందించాలి. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, వ్యక్తిగౌరవం అనే భారత రాజ్యాంగ మూల్యా లను మరింత బలోపేతం చేసే సాధనంగా ఏఐ నిలవాలి తప్ప, సామాజిక- ఆర్థిక అసమానతలను మరింత పెంచే ఆయుధంగా ఎప్పటికీ మారకూడదు. సాంకేతికతకు మనిషి యజమానిగా ఉండాలి. బానిసగా కాదు. అదే నిజమైన డిజిటల్ భారత నిర్మాణానికి మార్గం. ●



*భారతదేశం సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూనే బాధ్యతాయుతమైన ఏఐ చట్టాలు, స్వతంత్ర నియంత్రణ వ్యవస్థ, డేటా భద్రత, డీప్‌ఫేక్ నిరోధక విధానాలు, ఆల్గారిథమ్ పార దర్శకత, పౌర హక్కుల పరిరక్షణను సమన్వయం చేసే సమగ్ర విధానాన్ని రూపొందించాలి. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, వ్యక్తిగౌరవం అనే భారత రాజ్యాంగ మూల్యా లను మరింత బలోపేతం చేసే సాధనంగా ఏఐ నిలవాలి తప్ప, సామాజిక- ఆర్థిక అసమానతలను మరింత పెంచే ఆయుధంగా ఎప్పటికీ మారకూడదు. సాంకేతికతకు మనిషి యజమానిగా ఉండాలి. బానిసగా కాదు. అదే నిజమైన డిజిటల్ భారత నిర్మాణానికి మార్గం.*

# ఇంట్లో మంటపెడుతున్న ఎల్‌నినో!



ఆగస్టులో సాధారణం కంటే తక్కువ వర్షపాతం

అసాధారణంగా వేడెక్కిన మహాసముద్రాలు

కొన్ని ప్రాంతాల్లో కరవు, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు

ఐరాస వాతావరణ సంస్థ, భారత్ వాతావరణ సంస్థల అంచనా

**న్యూఢిల్లీ, ఆగస్టు1:**భారత్‌లో నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది తీవ్రమైన వర్షపాత లోటు నుంచి భారీ వర్షాల వరకు హెచ్చుతగ్గులను ఎదుర్కొంటున్న తరుణంలో, మరో కొత్త ముప్పు రాబోతోంది. రాబోయే కొద్ది నెలల్లో ఎల్ నినో మరింత బలపడి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి (యుఎన్) వాతావరణ సంస్థ హెచ్చరించింది. ప్రపంచ వాతావరణ సంస్థ చేసిన ఈ హెచ్చరికల నేపథ్యంలో, భారత వాతావరణ శాఖ ఇప్పటికే ఆగస్టు నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఇది రుతుపవనాల రెండో అర్ధభాగం సాధారణం కంటే బలహీనంగా ఉండే అవకాశం ఉందనే ఆందోళనలను రేకెత్తిస్తోంది. డబ్ల్యుఎంఒ అంచనా ప్రకారం, ఈ 'సూపర్ ఎల్ నినో' ఆగస్టు-అక్టోబర్ 2026 కాలంలో మరింత బలపడనుంది. అసాధారణంగా వేడెక్కిన మహాసముద్రాలు, సానుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. అలాగే, ఇది వర్షపాత సరళిని గణనీయంగా మార్చివేస్తుందని, కొన్ని ప్రాంతాలలో అధిక వర్షాలు కురిస్తే, మరికొన్ని ప్రాంతాలు కరువు ముప్పును ఎదుర్కొనే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డబ్ల్యుఎంఒ తాజా నివేదిక ప్రకారం ఆగస్టు నుండి అక్టోబర్ 2026 మధ్యకాలంలో ఎల్ నినో అత్యంత తీవ్రరూపం దాల్చనుంది. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.9డిగ్రీల కంటే ఎక్కువగా పెరిగే అవకాశం ఉండటమే దీనికి ప్రధాన కారణం. దక్షిణ ఆసియా ముఖ్యంగా భారత ఉపఖండంలో ఈ కాలంలో వర్షపాతం బాగా తగ్గిపోనుంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా నమోదు కావడం వల్ల తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగాలు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. ఈ ఏడాది భారతదేశ రుతుపవనాల గమనం అసమానంగా సాగింది. రుతుపవనాల పురోగతి దేశవ్యాప్తంగా వారాల తరబడి నిలిచిపోవడంతో, జూన్ నెల ముగిసేసరికి 39.8శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఇది గత శతాబ్ద కాలంలో అత్యంత పొడిగా మారిన జూన్ నెలల్లో ఒకటిగా నిలిచింది.

అయితే, జులై నెలలో అనేక అల్పపీడన వ్యవస్థలు సక్రియంగా మారడంతో వర్షాలు బాగా పుంజుకుని, మధ్య, పశ్చిమ, ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలలో విస్తారంగా కురిశాయి. వర్షపాతం పుంజుకున్నప్పటికీ, కొన్ని ప్రాంతాలలో అధిక వర్షాలు కురిస్తే, మరికొన్ని ప్రాంతాలు ఇంకా లోటును ఎదుర్కొంటూనే ఉన్నాయి. జులైలో మెరుగుదల కనిపించినప్పటికీ, ఆగస్టులో వర్షపాతం సాధారణ స్థాయికి దిగువన, అంటే లాంగ్ పీరియడ్ వరేజ్ (ఎల్‌పిఎ)లో సుమారు 94శాతం మాత్రమే ఉండే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. రుతుపవనాల ద్వితీయార్థంలో ఎల్ నినో మితమైన నుంచి బలమైన స్థాయికి చేరుకోవచ్చని, ఇది వర్షపాత పంపిణీలో అనిశ్చితిని పెంచుతుందని వాతావరణ శాఖ పేర్కొంది.

ఆగస్టు- అక్టోబర్ మధ్య కీలక ప్రాంతాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత క్రమరాహిత్యాలు 2.9 డిగ్రీల సెల్సియస్‌ను దాటవచ్చని, ఇది బలమైన ఎల్ నినోను సూచిస్తున్నట్లు డబ్ల్యుఎంఒ తెలిపింది.

అతి తీవ్రమైన ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు, రికార్డు స్థాయి సముద్రపు ఉష్ణోగ్రతలతో ఇప్పటికే సతమతమవుతున్న భూమికి ఈ వాతావరణ దృగ్విషయం మరింత ఆందోళన కలిగిస్తోందని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించారు. 'ఎల్ నినో కేవలం తలుపు తట్టడం లేదు. నేరుగా ఇంట్లోకి వచ్చేసి మంటలు పెంచుతోంది. ఇది కేవలం ట్రైలర్ మాత్రమే, రాబోయే రోజుల్లో మానవాళి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత భయానకంగా మారనుంది' అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ హెచ్చరించారు.

సాధారణంగా ఎల్ నినో ప్రతి 2 నుండి 7 సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. ఇది దాదాపు ఒక సంవత్సరం పాటు కొనసాగుతుంది. వాతావరణ సమాచారాన్ని కేవలం వినడమే కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యం అని డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్టే సౌలో తెలిపారు. 'వాతావరణ మార్పుల నుంచి ఉపద్రవాలను నివారించాల్సింది మనుషులే. ప్రభుత్వాలు, ప్రజలు ఇప్పుడే తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి' అని ఆమె సూచించారు.

## 20వేల డాలర్లు చెల్లిస్తేనే వీసాలు

### 50 దేశాలపై అమెరికా 'బాండ్' బాంబ్




**వాషింగ్టన్, ఆగస్టు 1 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏ విషయంలో పిడుగులాంటి వార్త చెప్తారో తెలియని పరిస్థితి నెలకొంది. తాజాగా ఆయన యంత్రాంగం 50 దేశాలపై వీసా బాండ్ బాంబ్ వేసింది. బి-1 (వ్యాపారం), బీ-2 (పర్యాటకం) వీసాల జారీకి శాశ్వత వీసా బాండ్ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చింది. దీనికింద ఆ దేశాల పర్యాటకులు 20 వేల డాలర్ల బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. యుఎస్ వీసా బాండ్ ప్రోగ్రామ్ తొలుత పైలట్ కార్యక్రమంగా ప్రారంభమైంది. ఇప్పుడు యుఎస్ ప్రభుత్వం దీనికి కొన్ని మార్పులు చేసి, విస్తృత స్థాయిలో అమల్లోకి తీసుకువస్తోంది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. 50 నిర్దేశిత దేశాల నుంచి వ్యాపారం, పర్యాటకం వంటి తాత్కాలిక పనుల కోసం వచ్చే సందర్శకులు కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఈ నెల 3 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ ప్రోగ్రామ్ వల్ల వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోయేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని అధికారులు గుర్తించారు. దీంతో దీనిని శాశ్వతంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఫెడరల్ రిజిస్టర్ నోటీసు ప్రకారం పైలట్ ప్రోగ్రామ్ కింద ఎంపిక చేసిన దరఖాస్తుదారులు బాండ్ రూపంలో డిపాజిట్ చేసే మొత్తం 5,000డాలర్లు, 10 వేల డాలర్లు, గరిష్ఠ మొత్తం 15 వేల డాలర్లుగా ఉంది. తుది నిబంధనల్లో 5,000 డాలర్ల ఆప్షన్‌ను తొలగించారు. గరిష్ఠ మొత్తాన్ని 20 వేల డాలర్లకు పెంచారు.

**ఈ నిబంధనలు ఎవరికంటే?:** వీసా ఓవర్ స్టే రేటు ఎక్కువగా ఉన్న 50 దేశాల పౌరులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఈ జాబితాలో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలు ఉన్నాయి. భారత్ పేరు లేకపోవడం ఊరటనిచ్చే విషయం. ఈ బాండ్ పరిధిలోకి వచ్చే ప్రయాణికులు కేవలం కమర్షియల్ విమానాల్లోనే అమెరికాకు రాకపోకలు సాగించాలి. ఇక, వీసా తిరస్కరణకు గురైన సందర్భంలో, నిర్దేశిత గడువులోగా అమెరికాలో పనులు ముగించుకొని వెళ్లిన సమయంలో ఈ బాండ్ మొత్తం రీఫండ్ అవుతుంది. వీసా గడువు దాటినా అక్కడే ఉంటే ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఫ్రీజ్ చేస్తుంది.

## కేంద్రం వద్ద 2,530 కి.మీ. రేంజ్ క్షిపణి

### 6, 7 తేదీల్లో పరీక్షించే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:**హిందూ మహాసముద్రంలో భారత్ మరో లాంగ్ రేంజ్ క్షిపణి ప్రయోగానికి రంగం సిద్ధంచేస్తోంది. ఈ నెల 6, 7 తేదీల్లో ఈ టెస్ట్ జరిగే అవకాశం ఉంది. దాదాపు 2,530 కిలోమీటర్ల పరిధిని లక్ష్యంగా చేసుకుని ఈ పరీక్ష జరగనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి భారత అధికారులు ఇప్పటికే గగనతలం, సముద్ర మార్గాలకు వర్తించేలా నోటమ్ (నోటీస్ టు ఎయిర్‌మెన్) హెచ్చరికలను సైతం జారీ చేశారు. ఈ తాజా పరిణామం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భద్రతా నియమాల ప్రకారం ఏదైనా క్షిపణిని పరీక్షించే సమయంలో ఆ ప్రాంతంలో ప్రయాణించే పౌర విమానాలు, రవాణా నౌకల భద్రత కోసం ఇలాంటి నోటీసులను జారీ చేస్తుంటారు. ఈ నిర్దేశిత కారిడార్ సాధారణంగా ఒడిశా తీరంలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపంతో ముడిపడి ఉంటుంది. డిఆర్డీఒ, స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఈ పరీక్షలను సమన్వయం చేయనున్నాయి. రక్షణమంత్రిత్వ శాఖ దీన్ని పర్యవేక్షిస్తుంది. ఇది లాంగ్ రేంజ్ మిస్సైల్. అగ్నిసిరీస్‌కు చెందినది గానీ, జలాంతర్గామి నుంచి ప్రయోగించే కె-4 బాలిస్టిక్ క్షిపణి అధునాతన వెర్షన్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. భారత్



వద్ద ఇప్పటికే 5,000 కిలోమీటర్ల వ్యూహాత్మక పరిధి గల అగ్ని 5 వంటి అత్యాధునిక క్షిపణులు అందుబాటులో ఉన్నాయి. సముద్ర ఆధారిత అణు నిరోధక సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో ఈ తాజా పరిధి చాలా కీలకం కానుంది. హిందూ మహాసముద్ర ప్రాంతం భౌగోళికంగా భారత్ రక్షణకు అత్యంత వ్యూహాత్మకమైనది పొరుగునే ఉన్న చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే సవాళ్లను తిప్పికొట్టడానికి ఈ లాంగ్ రేంజ్ క్షిపణులు రక్షణ కవచంలా పనిచేస్తాయి. భూమి, ఆకాశం, జల మార్గాల నుండి పరస్పర దాడులను అడ్డుకోగల న్యూక్లియర్ ట్రయాడ్ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే తాజా మిస్సైల్ టెస్ట్ నిర్వహించనుంది.



## కాషాయ వస్త్రాలతో పార్లమెంట్ వద్ద నిరసన

### రాహుల్ గాంధీ సహా ముగ్గురు ఎంపిలపై కేసు

**వారణాసి,ఆగస్టు 1:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్వాదీ పార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్, స్వతంత్ర ఎంపీ పప్పు యాదవ్లపై వారణాసిలోని కోత్వాలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. కాషాయ వస్త్రాలు ధరించి పార్లమెంట్లో నిర్వహించిన నిరసన ద్వారా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారనే ఆరోపణలపై ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సాధువుల బృందం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. సాధువులు, సన్యాసులకు ప్రతీకగా భావించే కాషాయదుస్తులను రాజకీయ నిరసన కోసం ఉపయోగించడం ద్వారా పవిత్రమైన మత చిహ్నాలను అవమానించారని, దీనివల్ల హిందూ సమాజం మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల దొంగతనం జరిగిందంటూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, అవధేశ్ ప్రసాద్, పప్పు యాదవ్తో పాటు పలువురు ప్రతిపక్ష సభ్యులు కాషాయ ధరించి నినాదాలు చేశారు. పార్లమెంట్లో రామ్ మందిర విరాళాల దొంగతనం నాటిక ఈ నిరసనలో స్వతంత్ర ఎంపీ పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు, హుండీ పెట్టెలతో కూర్చుని ఉండటం రాహుల్‌గాంధీ తదితరులు ఆ హుండీల్లో విరాళాలు వేయడం, తర్వాత పప్పుయాదవ్ ఆ విరాళాలను తీసుకుని వెళ్లడం వంటి ప్రదర్శన సాధువులకు ఆగ్రహం రప్పించింది.

## పేపర్ లీకేజిల కట్టడి బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026 పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు



తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్రతిపక్షాలు వ్యాఖ్యానించాయి. పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాతబిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తి గతంగా రూ.10లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానావిధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. గతంలో గరిష్ఠంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూలేదు. కొత్తబిల్లు ప్రకారం ఈకేసుల విచారణనురెండునెలల్లో పూర్తి చేయాలి.

## మోడీజీ ఇదే నామొదటి చివరి తప్పకూడా.. క్షమించండి ప్లీజ్..

### 15ఏళ్ల బాలిక వేడుకోలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో సీజేపీ నిరసన ప్రదర్శన వేళ కొందరు యువత ప్రధాని మోడీని తిట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఓ వీడియో రిలీజ్ చేశారు. పిల్లలను క్షమిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే తాజాగా ఆన్‌లైన్‌లో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఓ అమ్మాయి ప్రధాని మోడీకి క్షమాపణలు చెప్పింది. గీతల టీషర్ట్ వేసుకున్న ఆ అమ్మాయి చేతులు జోడించి మాట్లాడింది. తన వయసు 15 ఏళ్ల మాత్రమే అని, కానీ జంతర్ మంతర్‌లో అక్కడున్న వారిని చూసి.. మోడీని తిట్టినట్లు ఆ అమ్మాయి పేర్కొన్నది. ప్రధాని మోడీ గురించి అనవసరంగా చెడు మాటలు మాట్లాడినట్లు ఆమె పేర్కొన్నది. కానీ పోలీసుల తమ ఎఫ్ఐఆర్‌లో ఆ అమ్మాయి వయసు 25ఏళ్లుగా రాసినట్లు తెలిసింది. ఇదే తన మొదటి, చివరి తప్పు అని ఆ వీడియోలో అమ్మాయి పేర్కొన్నది. యావత్ దేశానికి క్షమాపణలు చెబుతున్నానని, సిగ్గుపడుతున్నానని, తనను తాను చూసుకోలేకపోతున్నానని, ప్లీజ్ నన్ను క్షమించండి అంటూ ఆ అమ్మాయి తెలిపింది. నోయిడా పోలీసు స్టేషన్‌లో ఆ అమ్మాయిపై కేసు బుక్ చేసినట్లు వెల్లడైంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నోయిడా పోలీసులు ఆ తర్వాత కేసును పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. అ అమ్మాయి తొలుత ఓ వీడియోలో చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోడీని అగౌరవపరిచినట్లుగా ఉందని తెలిసింది. శాంతిని భంగపరిచే రీతిలో ఆ వీడియో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ సెల్ఫీ వీడియలో మాట్లాడుతూ తనను దూషించిన వారిని క్షమిస్తున్నట్లు చెప్పారు. అయితే వారికి శిక్ష విధించడానికి బదులుగా మార్గనిర్దేశం చేయాలన్నారు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకునే అవకాశాన్ని యువతకు కల్పించాలన్నారు. తనను, తన తల్లిని దూషించడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు.

## 'ఆమ్లె'కు భరణం పొందే హక్కు లేదు: సుప్రీం

### ప్రైవేట్ డిటెక్టివ్‌ల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయండి

### పార్లమెంట్, లా కమిషన్‌కు ధర్మాసనం సూచన

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** వ్యభిచారంలో జీవిస్తున్నట్లు రుజువైన భార్యకు చట్టప్రకారం మధ్యంతర లేదా తుది భరణం పొందే హక్కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో, గోప్యత, రహస్యంగా చూడటం, ఎలక్ట్రానిక్ రికార్డుల ప్రామాణికత, జవాబుదారీతనం లేకపోవడం వంటి ఆందోళనలను ప్రస్తావిస్తూ, ఇటువంటి కేసులలో ఆధారాలు సేకరించే ప్రైవేట్ డిటెక్టివ్‌లను నియంత్రించడానికి ఒక చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. భరణం వివాదాలు, వైవాహిక వ్యాజ్యాలలో నిఘా వాడకాన్ని గణనీయంగా ప్రభావితం చేయగల ఒక తీర్పులో, జస్టిస్‌లు సంజయ్ కరోల్, విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం, వ్యభిచారం ఆరోపణలు ఉన్నంత మాత్రాన భార్యకు భరణం పొందే అర్హత పోదని, అయితే భరణం విచారణ ముగిసే వరకు ట్రయల్ కోర్టులు అటువంటి పిటిషన్లపై నిర్ణయాన్ని వాయిదా వేయలేవని తీర్పు ఇచ్చింది. అదే సమయంలో, వైవాహిక వివాదాలలో ఫొటోలు, వీడియోలను సేకరించడానికి ప్రైవేట్ పరిశోధకులపై పెరుగుతున్న ఆధారపడటం తీవ్రమైన చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తిందని, వీటిని పార్లమెంట్, లా కమిషన్ పరిశీలించాలని కోర్టు పేర్కొంది. తన భార్య వ్యభిచారంలో జీవిస్తోందని, అందువల్ల క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి)లోని సెక్షన్ 125(4) కింద భరణం కోరేందుకు ఆమెకు అర్హత లేదని వాదించినప్పటికీ, తన నుండి విడిపోయిన భార్యకు మధ్యంతర భరణం మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఒక వ్యక్తి దాఖలు చేసిన అప్పీలులో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. హైకోర్టు ఉత్తర్వును పక్కన పెట్టి, ఈ విషయాన్ని ట్రయల్ కోర్టుకు తిరిగి పంపుతూ, సెక్షన్ 125(4)లో ఉన్న చట్టపరమైన నిబంధన మధ్యంతర, తుది భరణం రెండింటికీ వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. సెక్షన్ 125(4) కింద భర్త దాఖలు చేసిన దరఖాస్తును పరిశీలించడానికి నిరాకరించడం, భరణం కేసు తుది పరిష్కారం వరకు ఆ అంశాన్ని వాయిదా వేయడం ద్వారా ట్రయల్ కోర్ట్ పొరపాటు చేసిందని ధర్మాసనం పేర్కొంది. అలాగే ప్రైవేట్ దర్యాప్తు సంస్థలు, ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరించిన సాక్ష్యాల విని యోగాన్ని నియంత్రించే తగిన విధానాన్ని రూపొందించడాన్ని పరిశీలించాల్సిందిగా కోరుతూ, తన తీర్పు ప్రతిని కేంద్ర న్యాయ శాఖకు, భారత న్యాయ కమిషన్‌కు పంపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.



## పహల్గావ్ తరహాలోనే కుల్గావ్‌లో వలస కార్మికులపై ఉగ్రకాల్పులు

### హిందువులని నిర్ధారించి మరీ కాల్పులు: ఇద్దరు వలసజీవులు మృతి

**శ్రీనగర్,ఆగస్టు 1:** జమ్మూకాశ్మీర్‌లోని కుల్గామ్‌లో జరిగిన ఘటన కూడా ఇప్పుడు పహల్గామ్ మాదిరిగానే జరగడం ఇప్పుడు ఆరాష్ట్రంలో మరింత ఉద్రిక్తతలకు తావిచ్చింది. జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో వలస కార్మికులపై జరిగిన ఉగ్రదాడికి సంబంధించిన సంచలన వివరాలు వెలుగులోకి వచ్చాయి. కెల్లం ప్రాంతంలోని ఓ ఇటుక బట్టీ దగ్గర పనిచేస్తున్న వలస కార్మికుల పేర్లు, గుర్తింపును ఉగ్రవాదులు ముందుగా అడిగినట్లు సమాచారం. అనంతరం వారిలో హిందువులైన ఇద్దరు కార్మికులను ప్రత్యేకంగా వేరు చేసి అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఇద్దరు వలస కార్మికులు మృతి చెందారు. మత గుర్తింపు ఆధారంగా ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని ఉండవచ్చని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదులు కార్మికుల గుర్తింపును ఎలా నిర్ధారించారు, దాడికి ముందు ఏం జరిగిందనే అంశాలపై భద్రతా సంస్థలు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నాయి. కుల్గాం జిల్లాలోని కెల్లం ప్రాంతంలో ఉన్న ఇటుక బట్టీపై ఉగ్రవాదులు దాడి చేశారు. అక్కడ పని చేస్తున్న ఇద్దరు స్థానికేతర కార్మికులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరైన దీపక్ రాత్రే ఆస్పత్రికి తరలించేలోపే గాయాల తీవ్రతతో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మరో కార్మికుడు బోపిందర్‌ను తొలుత అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.

## వచ్చినవారు వచ్చినట్లే వెనక్కి..

### స్పెయిన్ పరిస్థితులు చూసి 45వేల మంది వలసజీవులు మొరాకోకు

**మ్యాడ్రిడ్,ఆగస్టు 1:** మొరాకో నుంచి స్పెయిన్‌లోకి అక్రమంగా చొరబడ్డ వలసదారులు గంటల వ్యవధిలోనే సొంత దేశానికి తిరుగుముఖం పట్టారు. రెండురోజులుగా స్పెయిన్‌లోకి అడుగుపెట్టిన 60వేల మందిలో దాదాపు 45వేల మందికిపైగా తిరిగి మొరాకో వెళ్లిపోయినట్లు అంచనా. మొరాకో నుంచి సముద్ర మార్గం ద్వారా స్పెయిన్ ఆధీనంలో ఉన్న సెయూటాకు గురువారం ఒక్కసారిగా వేలాది మంది వలసదారులు పోటెత్తారు. చిన్న చిన్న పడవల్లో, ఈదుకుంటూ స్పెయిన్ చేరుకున్నారు. దాదాపు 60వేల మందికిపైగా ఒక్కరోజే అక్రమంగా వచ్చి ఉంటారని అంచనా. సముద్ర తీరం నుంచి, సరిహద్దు భాగం నుంచి పర్వత ప్రాంతమైన సరిహద్దులోకి వేలాదిమంది వస్తున్న దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారాయి. సముద్రంలో ఈదుకుంటూ వస్తుండగా 57 మంది మొరాకో వాసులు మరణించి ఉంటారని అంచనా. అయితే, తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వలసదారుల్ని స్పెయిన్ అడ్డుకుంది. సరిహద్దులో స్పెయిన్ భద్రతా బలగాలు వీరిని అడ్డుకున్నాయి. వలసదారులపై వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్‌తో పాటు కాల్పులు కూడా జరిపారు. ఈ క్రమంలో పలువురికి గాయాలు కాగా కొందరు తొక్కిసలాట కారణంగా మరణించారు.

భద్రతా బలగాలు అడ్డుకోవడంతో వేలాదిమంది వలసదారులు తిరిగి మొరాకో వెళ్లిపోయారు. ఈ క్రమంలో చాలా మంది సముద్రంలో మునిగి చనిపోయినట్లు తెలుస్తోంది. సెయుటా నగరం ఎంట్రన్స్ వద్దే వీరిలో చాలా మందిని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. సరిహద్దులో భారీగా సైనిక వాహనాల్ని కూడా స్పెయిన్ ప్రభుత్వం మోహరించింది. వలసదారుల్ని అడ్డుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోంది. సరిహద్దుకు కొద్ది దూరం నుంచి ఆ ప్రాంతాల్ని పర్యవేక్షిస్తోంది. భద్రతా బలగాల్ని తప్పించుకుని కొందరు వలసదారులు దేశం లోపలికి ప్రవేశించారు. అయితే, వారికి అక్కడ ఆశ్రయం, ఆహారం, నీరు కూడా లభించలేదు. తాను ఐదు గంటలు ఈదుకుంటూ స్పెయిన్ వచ్చానని, కానీ, తనపై అక్కడి సైన్యం దారుణంగా దాడి చేసిందని ఒక వలసదారుడు తెలిపాడు.

కొందరు గురువారం రాత్రంతా వీధుల్లోనే ఉన్నారు. అక్కడి సైన్యం, భద్రతా దళాల్ని చూసి భయపడిపోయారు. దీంతో వచ్చినవాళ్లు వచ్చినట్లే గంటల వ్యవధిలోనే తిరిగి మొరాకోకు వెళ్లిపోయారు. 60వేల మందిలో దాదాపు 45వేల మంది వలసదారులు శుక్రవారం తిరిగి వెళ్లిపోయారు.

ఈ వలసదారులు సెయూటా నగర జనాభాలో 70 శాతం వరకు ఉన్నారు. ఈ స్థాయిలో వలసదారులు రావడంతో స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చాలా మంది యువకులు వీధుల్లో హంగామా చేస్తూ కనిపించారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వీరిని అడ్డుకుని తిరిగి వారి దేశానికి పంపిస్తోంది.


# సంక్షిప్త వార్తలు

## అమెరికాలో కూలిన ఎఫ్-35 బి స్టెల్త్ ఫైటర్ విమానం



**శాన్‌డియాగో, ఆగస్టు 1:**అమెరికాలోని కాలిఫోర్నియాలో ఎఫ్-35బి స్టీల్త్ ఫైటర్ విమానం కూలింది. ఈ ఘటనలో పైలట్ సురక్షితంగా ఉన్నట్లు తెలిసింది. శాన్ డియాగోలోని మిరామర్ ఎయిర్‌బేస్ వద్ద ఈఘటన జరిగింది. యుద్ధ విమానం నేలరాలడానికి ముందే దాంట్లో ఉన్న పైలట్ పారాచూట్ సాయంతో బయటకు వచ్చేశాడు. ప్రస్తుతం అతనికి సమీప ఆస్పత్రిలో చికిత్స జరుగుతున్నట్లు అమెరికా మెరైన్ కార్ప్స్ తెలిపారు. విమానం కూలిన ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ, మంటలు వ్యాపిస్తున్న దృశ్యాలు విడియోకు చిక్కాయి.

## కీవ్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడి: 9 మంది మృతి



**కీవ్, ఆగస్టు 1:** రష్యా మళ్లీ విరుచుకుపడింది. ఉక్రెయిన్‌రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. శనివారం ఉదయం ఆ దాడి జరిగింది. ఆ దాడిలో 9మంది మృతి చెందగా, 22 మంది గాయపడినట్లు తెలుస్తోంది. సోలో మియానస్కి జిల్లాలో ఉన్న 5 అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్ దెబ్బ తిన్నది. ఆ బిల్డింగ్‌లో ఉన్న 35 మందిని తరలించారు. డర్నిస్టికి జిల్లాలో జరిగిన దాడి వల్ల ఏడుగురు మృతి చెందగా, మరో 14 మంది గాయపడ్డారు. ఈ అటాక్ వల్ల ఇళ్లు కూలి మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు.

## జైషే ఉగ్రవాది ప్రియురాలి అరెస్టు



**కోల్‌కతా,ఆగస్టు 1:** పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడి కోసం కుట్ర పన్నారనే ఆరోపణలపై అనుమానిత జైష్ ఉగ్రవాది ప్రియురాలిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకునే హనీట్రాప్ నెట్‌వర్క్‌లో ఆమె భాగమని అనుమానిస్తున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడికి జైష్ ఎ మొహమ్మద్ కార్యకర్త హమీమ్ మండల్ ప్రణాళిక రచిస్తున్నట్లు బెంగాల్ పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పూర్బ బర్ధమాన్‌లో అతడ్ని అరెస్ట్ చేశారు.

## అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ అవార్డు



**పూణె,ఆగస్టు 1:** జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్‌కు శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేశారు. పుణెలో బాలగంగాధర్ తిలక్ 106వ వర్థంతి సందర్భంగా అవార్డును అందజేశారు. లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్ మాట్లాడుతూ దేశ భద్రతకు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌కు, బోర్డర్ సెక్యూర్టీకి పాల్పడుతున్న అజిత్ దోవల్‌కు అందజేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేపాల్ పర్వతారోహకుడు హిమపాతంలో చిక్కుకుని మృతి



**ఖాట్మండు,ఆగస్టు 1:**నేపాల్‌కు చెందిన ప్రముఖ పర్వతారోహకుడు నిర్మల్ నిమ్స్ దాయ్‌పుర్జా (43)మరణించాడు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ పరిధి కారాకోరం రేంజ్‌లోని, బ్రాడ్‌పీక్‌వద్ద హిమపాతం కారణంగా అతడు మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. నిర్మల్ పుర్జా తోపాటు మరో తొమ్మిదిమంది కలిసి బ్రాడ్ పీక్ పర్వతారోహణకు బయల్దేరారు. మొత్తం 10 సభ్యులున్న ఈ బృందానికి పుర్జానే నాయకత్వం వహిస్తున్నాడు. పర్వతంపై హిమపాతం సంభవించింది. మంచు పర్వతం కూలిపోవడం, మంచులో కూరుకుపోవడం వల్ల వీళ్లు అందులో చిక్కుకుపోయారు. దీంతో మూడురోజుల నుంచి వీరి నుంచి ఎలాంటి కమ్యూనికేషన్ లేదు.

## ఇథనాల్ బ్లెండింగ్ లేకుంటే లీటర్ రూ.125కు పెరిగేది..

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** ఇథనాల్ బ్లెండింగ్ విధానాన్ని కేంద్రం మరోసారి సమర్థించుకుంది. ముడి చమురు బ్యారెల్ ధర 135డాలర్లకు చేరిన రోజుల్లో ఇథనాల్ బ్లెండింగ్ లేకపోయి ఉంటే న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.125కు చేరేదని పెట్రోలియం మంత్రిత్వ ప్రకటించింది. ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా అప్పట్లో ప్రజలు లీటరుకు రూ.94.77మాత్రమే చెల్లించారని తెలిపింది. లీటర్ పెట్రోల్ లో 20శాతం వరకూ ఇథనాల్ కలపడంతో ధరల భారంనుంచి ప్రజలకు రక్షణ లభించిందని పేర్కొంది.

# అర్హత కలిగిన వయోజనులు ఓటుహక్కు కోల్పోవద్దు



శనివారం గాంధీభవన్‌లో హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఓటరు సవరణ ప్రక్రియపై సమీక్ష చేస్తున్న మల్లు రవి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్

## 'సర్'పై మంత్రులు పొన్నం, అజారుద్దీన్, పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లు రవి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** అర్హత కలిగిన వయోజనులు ఓటుహక్కు కోల్పోకుండా నియోజకవర్గ ఇన్‌చార్జులు, బిఎల్ఎలు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పిలుపు నిచ్చారు. శనివారం గాంధీ భవన్‌లో హైదరా బాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజక వర్గాల్లో ఓటరు సవరణ ప్రక్రియపై పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి మల్లు రవి అధ్యక్షతన సమీక్ష జరిగింది. అందులో హైదరాబాద్ మంత్రి అజారుద్దీన్, పోటీ చేసిన అభ్యర్థులు, ఇతర ముఖ్య నేతలు ఓటరు సవరణపై బాధ్యతగా పాల్గొం టున్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పక్షాన కుటుంబ గుర్తింపు కార్డు ప్రభుత్వం జాప్యం లేకుండా ప్రారంభిం చిందనీ, ఇతర ఆధార పత్రాలు మూపెట్టి ఎన్యూమరేషన్ ఫారాలు నింపాలనీ ఆయన సూచించారు. కార్యకర్తల భాగస్వామ్యం తో అధికారులతో సహకరిస్తూ ఎన్నికల కమిషన్ చర్యలకు ప్రతిస్పందిస్తూ అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు పోకుండా జాగ్రత్త గా వ్యవహరించాలని కోరారు.కొన్ని రాజకీయ పార్టీల ఉద్దేశ్యంలో ఓటు తొలగించాలని భావిస్తూ ఉండచ్చు అలాంటి వాటిని అవకాశం ఇవ్వకుండా లౌకిక ఓటర్లను జాబితాలో చేరేలా చూసుకోవాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక పార్టీ అని అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు పోకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తుందనీ అన్నారు. హైదరాబాద్ లో నేతలంతా ఐక్యంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఓటు హక్కులకు భంగం కలగకుండా ఉండడానికి అప్రమత్తతో వ్యవహరించాలనికోరారు.ఓటరు సవరణ ప్రక్రియ లో హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో మరింత వేగం పుంజుకోవాలని చెప్పారు. నియోజకవర్గ ఇంచార్జి లు ఎప్పటికప్పుడు బిఎల్ఎ ల సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా పోకుండా జాగ్రత్తగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు..ఆగస్టు 10 వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి ఆన్లైన్ అయ్యేలా చూసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. గుర్తించిన అనుమానిత ఓటర్ల తో మాట్లాడి వారి ఓటు ఎక్కడ ఫైనల్ చేసుకుంటారో చూసుకునేలా చర్యలు తీసుకోవాలనీ అన్నారు.




విద్వత్సభ సంహిత దశాబ్ది దీపిక ప్రత్యేక సంచికను ప్రారంభిస్తున్న అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామిజీ, ఎం.హనుమంతరావు, చంద్రశేఖరశర్మ, వెంకటరమణశర్మ తదితరులు

## ఆగమ సలహాదారులుగా సిద్ధాంతుల సేవల వినియోగానికి కృషి

### దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు

తెలంగాణ దశమ విద్వత్సభను ప్రారంభించిన

పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 1, ప్రభాతవార్త :** వేదం, జ్యోతిషం, పంచాం గం, సిద్ధాంతం, ఆగమం, ధర్మశాస్త్ర సంప్రదాయాల పరిరక్షణకు విశేషంగా కృషిచేస్తున్న రెండురోజుల తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలు శనివారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. పుష్పగిరి జగద్గురు శంకరాచార్య అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామిజీ జ్యోతిప్రజ్వలనచేసి మహోత్సవాలను ప్రారం భించారు. తెలంగాణ విద్వత్సభ అధ్యక్షుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, కోశాధికారి మరుమాముల వెంకటరమణశర్మలు విద్వత్సభ పరిచయ ప్రస్తావనను వివరించారు. ఈ సందర్భంగా స్వామిజీ కరకమలాలమీదుగా జ్యోతిష, పంచాంగ, సిద్ధాంత, ఆగమ, ధర్మశాస్త్ర అంశాలపై విద్వన్మూర్తుల పరిశోధనాత్మక వ్యాసాలతో రూపొందించిన విద్వత్సభ సంహిత దశాబ్ది దీపిక తెలంగాణ విద్వత్సభ విశిష్ట సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ అనుగ్రహభాషణలో శాస్త్ర ప్రమాణాలతో పండుగలు, వ్రతాలు, ఉత్సవాల తేదీలను నిర్ణయించడం సమాజంలో సందేహాలను తొలగిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని అనేకమంది సిద్ధాంతులు, ఆగమ ధర్మశాస్త్ర పండితులు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలకు స్వచ్ఛందంగా సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని, ఆలయ ఉత్సవాలు, ప్రతిష్ఠలు, సంప్రోక్షణలు, పూజా విధానాలు, ఆగమ సంప్రదాయాలు, పండుగల నిర్వహణ వంటి అంశాలలో శాస్త్రబద్ధమైన సలహాలు అందించేందుకు వీరిని ఆగమ సలహాదారులు, ఆస్థాన సిద్ధాంతులుగా ఆలయాలవారీగా నియ మించాలని స్వామిజీ ప్రభుత్వానికి సూచించగా దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు సానుకూలంగా స్పందిస్తూ ఈ ప్రతిపాదనను తప్పక పరిశీలిస్తామని హామీనిచ్చారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, దేవాదాయశాఖ కమిషనర్ ఎం.హనుమంత రావు, ముఖ్యమంత్రి ప్రజావాణి నోడల్ అధికారి కె.విద్యాసాగర్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పెద్దసంఖ్యలో విద్వాంసులు పాల్గొన్నారు.

## ఆదాయంలో సరికొత్త ఆల్‌టైమ్ రికార్డు

### ఒక్క జులైలోనే రూ.77,865 కోట్లు వసూళ్లు

22 శాతం వృద్ధితో దేశంలోనే రెండో స్థానంలో తెలంగాణ

వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రఘునందన్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఆదాయంలో సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును సృష్టించింది. జులై నెలలో రూ 77,865 కోట్ల రాబడిని సాధించి గత రికార్డులను అధిగమించింది. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎమ్. రఘునందన్‌రావు శనివారం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఒక్క నెలలో వచ్చిన గరిష్ఠ ఆదాయంగా కొత్త చరిత్ర నమోదు చేసిందన్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదైన రూ.77,598 కోట్ల రికార్డును చెరిపేసిందని చెప్పారు. జులై 2025లో వచ్చిన వసూళ్లతో పోలిస్తే, ఈసారి అదనంగా రూ.1,241 కోట్లు సమకూరినట్లు వెల్లడించారు. ఈ ఆదాయంలో కేవలం జీఎస్టీ రూపంలోనే రూ.4,452 కోట్లు వచ్చిందని వివరించారు. గతేడాది ఇదే జులై నెలతో (73,638 కోట్లు)తో పోలిస్తే జీఎస్టీ వృద్ధిలో ఏకంగా 22 పెరుగుదల కనిపిస్తోంది. దేశంలోనే జీఎస్టీ వృద్ధి రేటు విషయంలో హర్యానా తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచినట్లు ఆయన తెలియజేశారు. అదే అఖిల భారత స్థాయిలో సగటు వృద్ధి 10 శాతం మాత్రమే ఉంది. ఇందుకు భిన్నంగా తెలంగాణలో వృద్ధి రేటు భారీగా పెరగడం వాణిజ్య పన్నుల శాఖల్లో చేపట్టిన సంస్కరణ వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. అలాగే జూలై నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సరైనా లేకుండానే బోగస్ బిల్లులతో రూ.300 కోట్ల మేర ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ పొందేందుకు యత్నించిన 165 మంది. పన్ను చెల్లింపుదారులను గుర్తించి, వారి రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేయడం వంటి చట్టపరమైన చర్యలు చేపట్టామన్నారు. నకిలీలు పన్ను చెల్లించే వారిని గౌరవిస్తూనే, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేసే వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్థిక కార్యకలాపాలు పెరగడం, కొత్త పెట్టుబడుల రావడం, కార్యకలాపాల్లో అధునాతన సాంకేతికత అమలు చేయడం, పన్ను ఎగవేతలను అరికట్టడం వల్ల ఈ రికార్డు సాధ్యమైందని తెలిపారు.

## అయోధ్య విరాళాల దోపిడీపై బిజెపిని ఎండగట్టాలి

### విహెచ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** అయోధ్య రామాలయం విరాళాల చోరీపై విహెచ్



ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో శనివారం వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. భక్తులు ఇచ్చిన విరాళాలు ఏ విధంగా చోరీ జరిగిన తీరును నాటకం రూపంలో నిరసన వ్యక్తం చేశారు. కాషాయం దుస్తులు వేసుకొన్న ఒక వ్యక్తి విరాళాలు నిండిన హుండీలో పరాల్లో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన తీరుపై ఈ నాటక ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ ఆలయాల్లో భక్తుల విరా ళాలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన చెందారు. అయోధ్య రామాలయం విరాళాల చోరీతో భక్తుల మనోభా వాలు దెబ్బతిన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఆవరణలో విరాళాల చోరీపై రాహుల్ గాంధీ పప్పు యాదవ్ ప్రదర్శన అద్భుతంగా ఉందని తెలిపారు. పార్లమెంట్‌లో పప్పు యాదవ్ అయోధ్య లో జరిగిన దొంగతనం చేసిన డ్రామా సన్నివేశాలు ప్రజలకు బాగా అర్ధం అయ్యాయనీ తెలిపారు.పార్లమెంట్ స్పీకర్ ఓం బీర్ల నాటకాన్ని వ్యతిరేకించారని ప్రజల సమస్యలను పార్లమెంటు లో చర్చ జరగలేదనీ అందుకే ఇక్కడ జరిగిన సన్నివేశాలు పార్లమెంట్ వెలుపల ఆవిష్కృత మవుతున్నాయని అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా అయోధ్య విరాళాల పై భక్తులు ప్రశ్నించాలని కోరారు. ప్రతీ గుడి ముందు భక్తులు మోసపోకుండా కూర్చోవాలని పిలుపునిచ్చారు.రాముని కి అన్యాయం జరిగిందని అయినా మోదీ, అమిత్ షా మాట్లాడటంలేదని విమర్శించారు.విరాళాల చోరీ అంశంపై కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తేందుకు గ్రామ గ్రామాన తిరుగుతా అని తెలిపారు. సిట్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పరిధిలో ఉంటుందని దాన్ని నమ్మలేము సిట్ పై మాకు నమ్మకం లేదనీ సిబిఐ ఎంక్వైర్ కావాలనీ డిమాండ్‌చేశారు.అయోధ్య రాముని గుడి లో అన్ని రకాలుగా దొంగతనాలు జరిగాయని చెప్పారు. అయోధ్యలో వేసిన విరాళాలు లెక్క చెప్పడం లేదనీ రాముడి పేరుతో బిజెపి చేస్తున్న దోపిడీని ప్రజల్లో లోతుగా తీసుకెళ్లాలనీ అన్నారు.



మస్కట్ నుంచి క్షేమంగా సగ్రామానికి చేరిన శంకర్

## మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో మస్కట్ నుండి క్షేమంగా స్వగ్రామానికి శంకర్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామానికి చెందిన ఉప్పుల శంకర్ ఉపాధి కోసం మస్కట్ వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో సురక్షితంగా స్వగ్రామానికి చేరుకున్నాడు. గత జూలై 6న హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నిర్మాణ సంస్థలో ఉద్యోగం కల్పిస్తామని చెప్పి శంకర్‌ను మస్కట్‌కు పంపించారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత నిర్మాణ పనికి బదులుగా ప్యాకింగ్ పనిలో చేర్చారని, సరైన వసతి, ఆహారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు శంకర్ తెలిపాడు. అనంతరం కంపెనీ నుంచి బయటకు వచ్చి గాబ్రా ప్రాంతంలో ఉన్న తెలుగువారి ఆశ్రయం పొందాడు. తన పరిస్థితిని గ్రామానికి చెందిన మిత్రుడు, కాంగ్రెస్ నాయకుడు శివకు తెలియజేయగా, ఆయన ద్వారా హుస్నాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్న రాజు, నాయకులు బంక చందు, వి. వెంకటరమణ, అక్కు శ్రీనివాస్‌లు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు అందించారు. ఎంబసీ అధికారులు శంకర్‌ను కలిసి వివరాలు సేకరించి, కంపెనీతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేయించి స్వదేశానికి పంపించే ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో శంకర్ జూలై 31న క్షేమంగా స్వగ్రామానికి చేరుకున్నాడు. స్వగ్రామానికి చేరుకున్న అనంతరం శంకర్ మాట్లాడుతూ, తనను సురక్షితంగా భారత్‌కు తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



ఐఎస్‌డబ్ల్యు అదనపుఎస్పి ప్రకాశ్‌రావు పదవీవిరమణ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానిస్తున్న ఓఎస్‌డి కమలాసన్‌రెడ్డి

## ఐఎస్‌డబ్ల్యు అదనపుఎస్పి ప్రకాశ్‌రావు పదవీవిరమణ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో కీలకమైన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యు)లో సుదీర్ఘకాలంపాటు పనిచేసిన అదనపు ఎస్పి ప్రకాశ్‌రావు శనివారం పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యు ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి ఆయనను సన్మానించారు. అనంతరం కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఎస్‌డబ్ల్యు వంటి కీలకమైన విభాగంలో ప్రకాశ్‌రావు చాలాకాలంపాటు పనిచేసి సమర్థవంతంగా సేవలందించారని కొనియాడారు. విధినిర్వహణలో ప్రకాశ్‌రావు ఎంతో అంకితభావంతో ఉండేవారని ఆయన కొనియాడారు. ఎన్నో క్లిష్ట సందర్భాల్లో ఆయన ధైర్యంగా ఉన్నారని ఓఎస్‌డి తెలిపారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ కలిగిన అధికారుల్లో ప్రకాశ్‌రావు ఒకరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పి చక్రవర్తిసహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ షెడ్యూల్ త్వరలోనే విడుదల

## నీట్‌లో తెలంగాణ నుంచి అర్హత సాధించిన వారి జాబితా రిలీజ్ చేసిన హెల్త్ వర్సిటీ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2026కి సంబంధించి తెలంగాణ స్టేట్ ర్యాంకులను కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ శనివారం ప్రకటించింది. నీట్‌లో అర్హత సాధించిన వారికి రాష్ట్రంలో వారు సాధించిన ర్యాంకులను హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. 2026-27 విద్యా సంవత్సరం కోసం నీట్ యుజి-2026లో అర్హత సాధించిన తెలంగాణ అభ్యర్థుల ర్యాంకుల వారీ జాబితాను విడుదల చేసినట్టు హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. యూనివర్సిటీ వెబ్ సైట్‌లో అభ్యర్థులు తమ రాష్ట్ర ర్యాంక్‌ను సరిచూసుకోవచ్చని, జాబితాను వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన కౌన్సెలింగ్, ప్రవేశ ప్రక్రియలో పాల్గొననున్న వైద్య విద్యార్థులందరికీ వైద్య, ఆరోగ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఎక్స్ వేదిక ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి నీట్‌కి హాజరైన వారిలో అర్హత సాధించిన 38వేల మందికి స్టేట్ ర్యాంకులను హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. నీట్ యూజీ-2026లో అర్హత సాధించిన వేలాది మంది విద్యార్థులు ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దేశవ్యాప్తంగా 15 శాతం అఖిల భారత కోటా (ఏఐక్యూ) సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) త్వరలో ప్రకటించనుంది. ఆ తరువాత తెలంగాణలో 85 శాతం రాష్ట్ర కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్ యూహెచ్ఎస్) నోటిఫికేషన్ జారీ చేయనుంది. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్, కేంద్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను కలిపి ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 10 వేలకుపైగా ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉండనున్నాయి.

## వర్సిటీల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి

### జెఎన్‌టియు రిజిస్టర్‌గా ప్రొ.జయలక్ష్మిని కొనసాగించాలి

పిసిసి చీఫ్ మహేష్‌కు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వినతి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యూనివర్సిటీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించేలా చూడాలని, జేఎన్‌టియు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జయలక్ష్మినే కొనసాగించాలని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం హైదరాబాదులోని మహేష్ కుమార్ గౌడ్ నివాసంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బీసీ ప్రతినిధుల బృందం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేకించి విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్స్‌లర్, రిజిస్టర్, రెక్టార్, డైరెక్టర్, ప్రిన్సిపల్ పోస్టుల నియామకాలలో జనాభా దామాషా ప్రకారం 60 శాతం పోస్టులను బీసీలకు కేటాయించాలని మహేష్ కుమార్ గౌడ్‌కు జాజుల శ్రీనివాస్ గౌడ్ వినతి పత్రం సమరినపంచారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ .. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన జరిగిన తర్వాత కులాల లెక్కల దామాషా ప్రకారం అన్ని రంగాలలో వాటా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ, అవి అమలుకు నోచుకోవడం లేదన్నారు. పైగా అక్కడో ఇక్కడో అవకాశాలు దొరికిన బీసీలను ఎలాంటి కారణాలు లేకుండా తొలగించాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.

## ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

### టిపియుఎస్ ధర్నాలో ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంకు లక్ష్మణ్‌తో పాటు బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్.రెడ్డి, మల్క కొమురయ్య, అంజిరెడ్డిలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయుల సమ స్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని ఆరోపించారు. పదవీ విరమణ పొందిన ఉపా ధ్యాయులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించక పోవటంతో అనేక ఆర్థిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు నిర్లక్ష్యం చేసిన తమిళనాడు, కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ప్రభు త్వాలకు ఉపాధ్యాయులు బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా ఉద్యోగ ఉపాధ్యా యులను విస్మరిస్తున్న రేవంత్ ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి ఏర్ప డుతుందని హెచ్చరిం చారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సం ఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కల పల్లి పెంటయ్య, సెక్రటరీ జనరల్ కానుగంటి హన్మంతరావు, కోశాధికారి భాస్కర్, డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, పర్వతం సంధ్యారాణి, తదితరులు పాల్గొనగా, వేలాది మంది ఉపాధ్యాయులు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చారు.




ధర్నాలో డిమాండ్ల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న టిపియుఎస్ నేతలు

## ఇంటర్ అడ్మిషన్ల గడువు 15 వరకు పెంపు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూని యర్ కాలేజీల్లో 2026-27 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్స రంలో చేరడానికి గడువును మరోసారి పొడిగించారు. ఈ నెల 15 వరకు అడ్మిషన్ల స్వీకరణకు తుది గడువుగా ఇంటర్ బోర్డు ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో జనరల్, వొకేషనల్ విభాగాలలో రెండేళ్ల ఇంటర్మీ డియట్ కోర్సును అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, కోపరేటీవ్, టి.జి. రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్, బి.సి. సంక్షేమ రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, కె.జి.బి.వి, టి.జి. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు, కాంపోజిట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ 2026-27 విద్యా సం వత్సరానికి ఇంటర్ అడ్మిషన్లకు ఈ నెల 15 వరకు అవకాశం కల్పించాలని ఇంటర్ బోర్డు సెక్రటరీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతలో భాగంగా మే 8 నుంచి 31 వరకు దరఖాస్తులను స్వీకరిం చారు. తరగతులను జూన్ 1 నుంచి ప్రారంభించారు. మొదటి విడత అడ్మి షన్ల ప్రక్రియను జూన్ 3)తో ముగించారు. జులై 1 నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను 31 వరకు పొడిగించారు. ఇపుడు మరోసారి అడ్మిషన్ల గడువును పొడిగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. అడ్మిషన్ల సందర్భంగా ప్రిన్సిపాళ్లు ఇంటర్నెట్ మార్క్స్ మెమోల ఆధారంగా తాత్కాలిక ప్రవేశాలు కల్పించడానికి అనుమతి ఇచ్చారు. మొదటివిడతలో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 82వేల మంది చేరినట్టు తెలిసింది.

## పోటీ పరీక్షలపై మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదు

### మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనీల్

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** పోటీ పరీక్షలపై మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని, ఆత్మహత్య చేసుకొన్న ప్రవళిక కుటుంబాన్ని అవహేళన చేసింది కెటిఆరే అని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనీల్ అన్నారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్య



మంత్రి కావాలంటే పోటీ పరీక్షలు రాయాలా? ఇంటర్వ్యూకు అటెండ్ అయితేనే సిఎం అవ్వాలా అని ప్రశ్నించారు. పోటీ పరీక్షల గురించి మాట్లాడే కనీస అర్హత కెటిఆర్ కు ఉందా? నీ హాయాంలో పేపర్ లీక్‌లకు నువ్వు బాధ్యత ఎందుకు వహించ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక కుంటుంబాన్ని అవహేళన చేసింది కెటిఆర్ కాదా. నీ సొంత చెల్లి చేస్తున్న ఆరోపణలకు సమాచారం చెప్పు కెటిఆర్ అని సవాల్ విసిరారు..బాసర ఐఐటీ క్యాంపస్ ను సర్వనాశనం చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆరోపించారు. ఇంజి నీరింగ్ విద్య స్కిల్స్‌లో మన విద్యార్థులు వెనకబడ్డారని మాత్రమే సీఎం అన్నారనీ అన్నారు. విద్యా వ్యవస్థను బిఆర్ఎస్ నిర్వీర్యం చేసిందనీ మేము సంస్కరణలు తీసుకొస్తుంటే విమర్శలా అని ఆవేదన చెందారు. విద్యార్థులకు చేసిన అన్యాయానికి కెటిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పాఠశాల విద్యలో లక్ష్యాల సాధనకు జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** 2026-27 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యా శాఖలో అనుకున్న లక్ష్యాలను సాధించడం కోసం జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లాలకు నియమించ బడిన ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఆయా జిల్లాలను పర్యటించి, పరిశీలన జరిపి తగిన నివేదికలను ఎప్పటికప్పుడు విద్యా శాఖ కార్యదర్శికి సర్పించాలని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యా శాఖ కార్యదర్శి జులై 25న ఎస్‌సీఈఆర్‌టీలో పాఠశాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు నిర్దేశిత కాలపరిమితిలోగా లక్షిత ఫలితాలను సాధించేందుకు క్షేత్రస్థాయిలో పాఠశాల విద్యాశాఖ కింద ఉన్న అన్ని కార్యకలాపాల అమలును క్షేత్రస్థాయి అధికారులతో కలిసి క్రమం తప్పకుండా పర్యవేక్షించడానికి, సమీక్షించడానికి జిల్లాలకు ప్రత్యేక అధికా రులను నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

అధికా రులు క్రమం తప్పకుండా జిల్లాలను క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షలు జరిపి అందుకు తగిన నివేదికలను ఎప్పటికప్పుడు విద్యాశాఖ కార్యదర్శికి సమర్పించాలని సూచించారు. పాఠశాల విద్యలోని అడిషనల్ డైరక్టర్ల స్థాయి నుంచి జేడీలు, ఆర్‌జేడీల వరకు పలువురి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

**జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులు**

హైదరాబాద్ -ఎం. రాధా రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి- రమణ కుమార్, మహబూబాబాద్-ఎస్. విజయలక్ష్మి బాయి, మహబూబ్‌నగర్, వనపర్తి-ఎస్. శ్రీనివాస చారి, సంగారెడ్డి- జి. రమేష్, రంగారెడ్డి - కె. లింగయ్య, యాదాద్రి భువనగిరి -కె. సత్యనారాయణ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి - శ్రీనివాస్ రెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి - పి. రాజీవ్, వికారాబాద్, నారాయణపేట్ -ఎం. సోమిరెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ -పి. మదన్ మోహన్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ - ఎ. ఉషారాణి, జనగాం, సూర్యాపేట, నల్గొండ -బి. వెంకట నరసమ్మ, ములుగు, హనుమకొండ -జనార్ధన్ రావు, నిర్మల్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల -నాంపల్లి రాజేష్, కరీంనగర్, జగిత్యాల, సిద్ధిపేట- పి. రేవతి రెడ్డి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్ -మీరాజుల్లా ఖాన్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రత్యేక అధికారులు విద్యార్థుల నమోదు, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు, డ్రాప్‌బాక్స్ విద్యార్థుల స్థితి, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, ఏఎక్స్ఎల్ ల్యాబ్స్, ప్రీప్రైమరీ విద్య, ఉపాధ్యాయ శిక్షణ, ఎఫ్ఆర్ఎస్, అపార్ అండ్ ఆధార్, పీఎంశ్రీ కార్యక్రమాలు, భవిత కేంద్రాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, అల్పాహారం, పాల పంపిణీ, సెంట్రలైజ్డ్ కిచెన్లు, డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలు, తెలంగాణ ఓపెన్ స్కూల్స్, ఉల్లాస్ (వయోజన విద్య), సమగ్ర శిక్ష సివిల్ వర్క్‌లను ప్రత్యేక అధికారులు తమ జిల్లాల్లో క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి, పురోగతి నివేదికలను సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




## కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు పతకాల పంట

### బాక్సింగ్‌లో ఆరు స్వర్ణాలు

### తాజాగా సాక్షిచౌదరి, అరుంధతిచౌదరిలకు స్వర్ణం

**గ్లాస్గో, ఆగస్టు 1:** కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నారు. పదో రోజు పోటీల్లో బాక్సింగ్‌లో ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా, సాక్షి చౌదరి స్వర్ణ పతకాలను సాధించి భారత్‌కు ఘన విజయాలను అందించారు. తాజాగా 72 కిలోల విభాగంలో అరుంధతి చౌదరి స్వర్ణపతకం సాధించారు. 60 కిలోల విభాగంలో సచిన్ శివాచ్ స్వర్ణం గెలుచుకున్నాడు. పురుషుల ఎఫ్57 షాట్‌పుట్ విభాగంలో భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. సోమన్ రాణా స్వర్ణ పతకం గెలుచుకోగా, శుభం జుయల్ రజత పతకాన్ని సొంతం చేసుకొని భారత్‌కు ఒకటి-రెండు స్థానాలను అందించారు. అథ్లెటిక్స్‌లో పురుషుల ట్రిపుల్ జంప్ విభాగంలో ప్రవీణ్ చిత్రవేల్ రజత పతకం సాధించగా, సెల్వ ప్రభు తిరుమరన్ కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ విజయాలతో ఇప్పటివరకు కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 36 పతకాలు తన ఖాతాలో వేసుకుంది. వీటిలో 12 స్వర్ణాలు, 16 రజతాలు, 8 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇంకా బాక్సింగ్‌లో పలువురు భారత బాక్సర్లు ఫైనల్స్‌లో బరిలోకి దిగనుండగా, అథ్లెటిక్స్‌లోనూ భారత క్రీడాకారులు పోటీపడనున్నారు. దీంతో భారత్ పతకాల సంఖ్యను మరింత పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాక్షిచౌదరి బాక్సింగ్‌లో భారత్‌కు మూడవ స్వర్ణాన్ని అందించగా, ఉన్నతి శర్మ జూడోలో కాంస్యం గెలుచుకున్నారు. అంతకు ముందు, ప్రీతి పవార్ మరియు జైస్మిన్ లంబోరియా బాక్సింగ్ ఈవెంట్లలో స్వర్ణాలు గెలుచుకున్నారు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ మరియు సెల్వ ప్రభు వరుసగా రజత, కాంస్య పతకాలను కూడా గెలుచుకున్నారు. పురుషుల షాట్ పుట్ ఎఫ్ 57లో సోమన్ రాణా స్వర్ణం గెలుచుకోగా, శుభం జుయల్ రజతం సాధించాడు.

## ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డిపై

## చర్యలకు డిఓపిటికి పోలీసు అకాడమి అధికారుల లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై చర్యలకు జాతీయ పోలీసు అకాడమి అధికారులు డిఓపిటి (కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ)కి లేఖ రాసినట్లు తెలిసింది. సహచర మహిళా ట్రైనీ అధకారిని లైంగికంగా వేధించడం మొదలుకొని , ఆ తరువాత అతనిపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు వరకు దారితీసిన పరిస్థితులు, అనంతరం అతను అజ్ఞాతంలో వెళ్లడం, దీని పిదప అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించడం వరకు అన్ని వివరాలను ఈ లేఖలో అకాడమి అధికారులు పొందుపరచినట్లు తెలిసి ంది. ఉదయ్ కృష్ణారెడ్డిపై గత నెల 18వ తేదీన లైంగిక వేధింపుల కేసు నమోదు కాగా అదే రోజున అతన్ని అకాడమి నుంచి సస్పెండ్ చేశా రు. మరుసటి రోజున అతను బోరబండ మోతీనగర్‌లో తన స్నేహితుడి ఇంట్లో అతిగా మద్యం తాగి అనారోగ్యానికి గురవగా వెంటనే ఆసుప త్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. దీని తరువాత అతను ఉన్నట్లుండి అజ్ఞాతంలో వెళ్లాడు. అతని కోసం పోలీసులు గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇదే సమయంలో తాను ఎక్కడికి పారిపోలేదని, తన సొంత ఊరుకు వచ్చానని ఉదయ్ కృష్ణారెడ్డి ప్రకాశం జిల్లాలో గత నెల 29వ తేదీన నాడు మీడియాతో మాట్లాడాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అతన్ని మిర్యాలగూడ వద్ద అరెస్టు చేసి 30వ తేదీన పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించి కేసుకు సంబంధించిన వివరాలను రాబట్టారు. అనంతరం స్థానిక కోర్టులో హాజరు పరిచి రెండు వారాల రిమాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఉదయ్ కృష్ణారెడ్డి లాప్‌టాప్‌ను పోలీసు లు స్వాధీనం చేసుకోగా సెల్‌ఫోన్ లభించలేదు. అతను దీనిని దాచి వుంచడం లేదా ధ్వంసం చేసి వుండడం చేసి వుంటాడని పోలీసులు భావి స్తున్నారు. దీని కోసం ఆరా తీస్తున్నారు. ఈ వివరాలను పోలీసు అకాడమి అధికారులు సిటీ పోలీసుల నుంచి అందుకున్నారు. అనంతరం అత నిపై డిఓపిటికి లేఖ ద్వారా తెలిపారని తెలిసింది. ఉదయ్ కృష్ణారెడ్డి గురించి పోలీసు అకాడమి అధికారులు ఇప్పటికే ఒకసారి డిఓపిటికి లేఖ రాశారు. అందులో అతని విపరీత ప్రవర్తన, దురుసుతనం, మహిళల పట్ల అనుచిత వైఖరి గురించి వివరించారని సమాచారం. తాజా లేఖలో అతని గురించి ఇప్పటి వరకు వున్న అన్ని వివరాలను వివరించినట్లు తెలిసింది. ఈ లేఖను పరిశీలించిన తరువాత ఉదయ్ కృష్ణారెడ్డిపై డిఓపి టి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి వుంది.




ఐసిఎఆర్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

## నూనెగింజల పంటల సాగుకు కృషి

### ఘనంగా ఐసిఎఆర్ సంస్థ 50వ వ్యవస్థాపక దినోత్సవం

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 1, ప్రభాతవార్త:** రైతుల అభివృద్ధికి భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ సహకారం ఉంటుందని ఆముదం, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల పంటల సాగు విస్తరణ కోసం ఎంతో ప్రోత్సాహం అందిస్తుందని పలువురు అధికారులు పేర్కొన్నారు. భారత వ్యవసయ పరిశోధన మండలి(ఐసిఎఆర్) ఆధ్వర్యంలోని రాజేంద్రనగర్ ఐసిఎఆర్-భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ (ఐసిఎఆర్-ఐఐఓఆర్) 50వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం సంస్థ డైరెక్టర్ డా. ఆర్. కె. మాథుర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఐసిఎఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ డైరెక్టర్ డా. రమణ్ మీనాక్షి సుందరం ,గౌరవ అతిథిగా ఐకార్, న్యూఢిల్లీ సహాయ మహానిర్దేశకులు (నూనెగింజలు, పప్పుధాన్యాలు, డా. ఎస్. కె ఝా హాజరైయ్యారు. సంస్థ డైరెక్టర్ డా. ఆర్. కె. మాథూర్ సంస్థ గత ఐదు దశాబ్దాల ప్రయాణాన్ని సాధించిన ముఖ్యవిజయాలను వివరించారు. ఐసిఎఆర్-ఐఐఓఆర్ అభివృద్ధి చేసిన పంట రకాలు, సంకరజాతులు, బయోపాలిమర్ ఆధారిత బహుళస్థర విత్తన పూత సాంకేతికత, కృత్రిమ మేదస్సు ఆధారిత సలహా సేవలు వంటి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలను వివరించారు. ఈ సందర్భంగా ఐసిఎఆర్ భారతీయ ఆయిల్ ఫామ్ పరిశోధన సంస్థ పేదవేగి డైరెక్టర్ డా. కె. సురేష్ ,జిఐఎస్ ఆధారిత బహుల ప్రమాణాల విశ్లేషణ ద్వారా పంటల అనుకూలత అంచనా అనే అంశంపై వ్యవస్థాపక దినోత్సవ స్మారకోపన్యాసం అందించారు. నూనెగింజల సాగు విస్తరణకు అనువైన ప్రాంతాల గుర్తింపులో ఆధునిక సాంకేతికతల వినియోగాన్ని ఆయన వివరించారు. గౌరవ అతిథి డా. ఎస్. కె. ఝా సంస్థ సాధించిన విశిష్ట పరిశోధనా విజయాలను ప్రశంసిస్తూ, దేశ నూనెగింజల పరిశోధనకు మార్గ నిర్దేశక సంస్థగా భవిష్య త్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథి డా. రమణ్ మీనాక్షి సుందరం సంస్థ 50వ వ్యవస్థాపక దినోత్సవానన్ని అభినందిస్తూ, దేశంలో అగ్రగామి నూనెగింజల పరిశోధనా సంస్థగా ఎదిగిన ప్రయాణాన్ని ప్రశంసించారు.

## తల్లి పాలే శిశువుకు తొలి టీకా

### తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

### మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

**హైదరాబాద్, అగస్టు 1, ప్రభాతవార్త:** పుట్టిన వెంటనే వచ్చే పాలు శిశువుకు తొలి రోగ నిరోధక టీకాలా పనిచేస్తాయని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి సీతక్క తెలిపారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కన్నారు. అంతేకాకుండా ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు. శనివారం నుండి ప్రారంభమవుతున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రకటనలో తల్లి పాల వారోత్సవాలను ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని సూచించారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలన్నారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని చెప్పారు.

రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని సూచించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాదని చెప్పారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## పేపర్ ప్యాకేజింగ్ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అండ

### పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి

### జాతీయ పేపర్ దినోత్సవం సందర్భంగా కాగితం పరిశ్రమపై సదస్సు

**హైదరాబాద్(నాంపల్లి), ఆగస్టు 1, ప్రభాతవార్త :** భారత తయారీరంగాలో కాగిత పరిశ్రమ కీలకమైన స్థానాన్ని ఆక్రమించిందనిఇ, ప్రపంచస్థాయి పోటీతత్వాన్ని కొనసాగించాలంటే పరిశ్రమ ఆవిష్కరణలు, సుస్థిరత, సాంకేతిక పరోగతిని సాధించాఆలని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి అన్నారు. రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసీఐలోని కె.ఎల్.ఎన్. ప్రసాద్ ఆడిటోరియంలో శనివారం ఉదయం ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేష్, తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కాగిత దినోత్సవ సదస్సును నిఖిల్ చక్రవర్తి ప్రారంభించి ప్రసంగించారు. పర్యావరణహిత ప్యాకేజింగ్, రీసైక్లింగ్ విధానాలపై దృష్టిసారిస్తే ఈ రంగంలో అపార అవకాశాలున్నా యన్నారు. రాష్ట్రంలో 2వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన హిందూస్థాన్ యూనిలీవర్స్ సంస్థ ఇక్కడి ప్యాకేజింగ్ సామర్థ్యంపై ప్రత్యేకంగా పరిశీలించడం ఈ రంగ ప్రాముఖ్యతను, భారీ పెట్టుబడులను ఆకర్షించే సత్తాను చాటుతోపందని ఆయన పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, రైట్ టు డూయింగ్ బిజినెస్ అనే నూతన భావనతలతో పర్యావరణ ప్రభావం తక్కువగా ఉండే గ్రీన్, వైట్ కేటగిరీ పరిశ్రమలు ముందుగా తమ కార్యకలాపాలు ప్రారంభించి తర్వాత అనుమతులు తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోందని నిఖిల్ వెల్లడించారు. టిపిఎంఎ అధ్యక్షుడు డా. నరేంద్ర పర్చూరి తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలకే కాకుండా వాణిజ్యం, వ్యాపార సంస్థలకు అనుకూల విధానాలతో అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కాగిత పరిశ్రమ పురోగతికి, మరిన్ని పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ మద్దతు, సహకారం కొనసాగుతుందని భరోసానిచ్చారు. పేపర్, పేపర్‌బోర్డు ప్యాకేజింగ్ ఉత్పత్తులపై ప్రస్తుతమున్న 18శాతం జీఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని ఎఫ్‌పీటీఏ అధ్యక్షుడు టి.కిషన్‌సింగ్ కేంద్రాన్ని కోరారు. మారుతున్న మార్కెట్ అవసరాలు, డిజిటల్ పరివర్తన, సుస్థి రత లక్ష్యాలకు అనుగుణంగా పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు పన్ను తగ్గింపు అవసరమన్నారు. ఎఫ్‌టిసీసీఐ అధ్యక్షుడు కె.కె.మహేశ్వరి తెలంగాణ, ఏపిలు దేశంలోనే కాగిత ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచా యని, కాగిత పరిశ్రమ అభివృద్ధికి, పరిశ్రమ ప్రయో జనాల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్ప ష్టం చేశారు.




సదస్సులో ప్రసంగిస్తున్న నిఖిల్‌చక్రవర్తి, కిషన్‌సింగ్, కె.కె.మహేశ్వరి, అభిషేక్ తదితరులు

## ఇపిఎఫ్ఒకు రూ.1,816 కోట్ల నష్టం కేసు

### అనిల్ అంబానీపై సిబిఐ ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ మాజీ చైర్మన్‌తో పాటు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర వ్యక్తులపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈపీఎఫ్‌వో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్యలు చేపట్టింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ప్రకారం, నిందితుల చర్యల వల్ల ఈపీఎఫ్‌వోకు రూ.1,007.55 కోట్ల ప్రత్యక్ష ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా రూ.808.67 కోట్ల వడ్డీ భారం కూడా ఏర్పడినట్లు పేర్కొంది. ఈ కేసులో క్రిమినల్ కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అవినీతి తదితర సెక్షన్ల కింద సీబీఐ కేసు నమోదు చేసింది. ఫిర్యాదు ప్రకారం, 2013-14 సంవత్సరాల్లో రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ భద్రత కలిగిన నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు జారీ చేసింది. ఈ డిబెంచర్లలో ఈపీఎఫ్‌వో మొత్తం రూ.2,500 కోట్లను నాలుగు పోర్ట్‌ఫోలియో మేనేజర్ల ద్వారా పెట్టుబడిగా పెట్టింది. వీటిలో రిలయన్స్ క్యాపిటల్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కూడా ఒకటి. ఈ ఎన్‌సీడీలు 2023, 2024 సంవత్సరాల్లో మెచ్యూరిటీపొందాల్సి ఉంది. అయితే నిందితులు మోసపూరిత లావాదేవీలు నిర్వహించి, నిధులను దారి మళ్లించారని ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో రిలయన్స్ క్యాపిటల్ ఎన్‌సీడీలను గడువులోపు రిడీమ్ చేయలేకపోయిందని, ఫలితంగా ఈపీఎఫ్‌వోకు మొత్తం రూ.1,816.22 కోట్ల నష్టం సంభవించినట్లు సీబీఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులతో సహా సంబంధం ఉన్న వారందరి పాత్రను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. పెట్టుబడి నిధులు చివరకు ఎక్కడికి మళ్లించబడ్డాయనే అంశాన్ని కూడా సీబీఐ పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, రిలయన్స్ ఏడీఏ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ టెలికాం సంస్థలకు సంబంధించిన కేసుల్లో ఇప్పటికే వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఇప్పటివరకు నాలుగు చార్జిషీట్లు దాఖలు చేయగా, ఏడుగురిని అరెస్ట్ చేసింది. ఈ కేసుల దర్యాప్తు సుప్రీం కోర్టు పర్యవేక్షణలో కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది. ఈ కేసుపై అనిల్ అంబానీ స్పందిస్తూ, సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్‌కు సంబంధించినదేనని తెలిపారు. తాను 2005 నుంచి 2021 నవంబర్ వరకు మాత్రమే సంస్థలో నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బోర్డు చైర్మన్‌గా పనిచేశానని పేర్కొన్నారు. అనంతరం సంస్థ బోర్డును రద్దు చేసి అడ్మినిస్ట్రేటర్‌ను నియమించిందని గుర్తుచేశారు. తనపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నానని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని అనిల్ అంబానీ స్పష్టం చేశారు. చట్టపరంగా తనకు అందుబాటులో ఉన్న అన్ని హక్కులను వినియోగించుకుంటానని ఆయన పేర్కొన్నారు.




## ఔట్ సోర్సింగ్, చిరు ఉద్యోగులకు 1న వేతనాలు

### ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో, ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయంతో కష్టాలను అనుభవించిన ఒప్పంద అధ్యాపకులకు ప్రతి నెల ఒకటినే ప్రజా ప్రభుత్వం జీతాలు అందివ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థలు మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు ఏ ఉద్యోగి ప్రతినెలా ఒకటినే జీతాలు అందుకోలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ సీఎం చేయని సాహసోపేత నిర్ణయాన్ని తీసుకుని తమకు ఎనలేని సహాయం చేశారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒప్పంద, పొరుగు సేవలు, చిరుద్యోగుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

**బెంగళూరు, ఆగస్టు 1:** కర్ణాటకలో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మంత్రివర్గ విస్తరణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 3వ తేదీన సోమవారం సాయంత్రం 4 గంటలకు నూతన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు కానుంది. ఈ విస్తరణకు కాంగ్రెస్ అధి ష్ఠానం తుది ఆమోదం తెలప డంతో బెంగళూరు రాజ్‌భవన్ లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధికారు లను సైతం ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం డీకే శివకుమార్ కేబినెట్‌లో 20 మంత్రి పదవు లు ఖాళీగా ఉంటోన్నాయి. వాటిల్లో 18 స్థానాలను ఈ విడతలోనే భర్తీ చేయాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరూ వేర్వేరుగా పంపిన మంత్రుల జాబితాలను కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలించింది. తుది జాబితాకు ఓ రూపాన్ని ఇచ్చింది. ఆదివారం నాటికి ఈ ఫైనల్ లిస్ట్ ముఖ్యమంత్రి చేతికి చేరుతుందని అంటున్నారు. వివిధ సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమతుల్యం చేస్తూ ఈసారి కేబినెట్ కూర్పు ఉండబోతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన దావణగెరె ఎమ్మెల్యే ఎస్ఎస్ మల్లికార్జున్, వక్కలిగ వర్గానికి చెందిన నాగమంగళ ఎమ్మెల్యే ఎన్ చలువ రాయస్వామి, హోస్కోటెకు ప్రాతినిథ్యాన్ని వహిస్తోన్న శరత్ బచ్చెగౌడ పేర్లు దాదాపుగా ఖరారయ్యాయి.



## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి బిఎస్సీ సీట్లు రెట్టింపు

### ఈ యేడాది 2,000 సీట్ల భర్తీ

### భారీగా తగ్గిన ప్రత్యేక కోటా రుసుములు

### ఉపకులపతి అల్దాస్ జానయ్య వెల్లడి

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 1, ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని 13 కళాశాలల్లో బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, ఇతర డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. తెలంగాణా ఎప్‌సెట్ 2026లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆగస్టు 11 వ తేదీ వరకు దరఖాస్తు రుసుము చెల్లించి ఆగస్టు 12 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయవచ్చని ఆయన సూచిం చారు. తాను ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టిన ఈ రెండేళ్ళలో కొత్త కళాశాలల ఏర్పాటు, సీట్ల పెంపు, రుసుముల తగ్గింపుల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జానయ్య తెలిపారు. 2023-24లో బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ సీట్లు 1012 ఉండగా 2026-27 విద్యా సంవత్సరానికి సుమారు 2,000 అయ్యాయని పేర్కొన్నారు. 2023-24 లో ప్రత్యేక కోటా సీట్ల ఫీజు ఏక కాలం లో పది లక్షల రూపాయల చెల్లింపుతో పాటు ఒక్కో ఏడాదికి ఒక లక్ష రూపాయలు చెల్లించాల్సి ఉండేదని తెలిపారు. ఈ రుసుములని గణనీయం గా తగ్గించి 2026-27 కి ఒక్కో సెమిస్టర్ కి రుసుమును కేవలం రూ.75,000 గా నిర్ణయిం చామన్నారు.

**19వ ర్యాంక్‌తోపాటు అన్ని గుర్తింపులు ఉన్న అగ్రి వర్సిటీ**

దేశంలోని 80 వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాల్లో 2026లో పిజెటి ఎయూ 19వ ర్యాంక్‌లో నిలిచిందని జాన య్య తెలిపారు. అంతేకాకుండా 1964లో దేశం లోనే రెండో వ్యవసాయ విశ్వవిద్యాలయంగా స్థాపి తం అయిన ఈ విశ్వవిద్యాలయం నాటి నుంచి నేటి వరకూ ఐకార్, యూజీసి నిర్ధారించిన నాణ్య త, ప్రమాణాలు కలిగి ఉందన్నారు. ఈ విశ్వ విద్యాలయానికి, దీని పరిధి లోని అన్ని కళాశా లలకు, కోర్సులన్నిటికి ఐకార్ అక్రిడేషన్ ఉందన్నారు.

## అత్యంత వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం

### 1,990 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ దర్శకుడు రాజమౌళి

**హైదరాబాద్ (పటాన్‌చెరు), ఆగస్టు 1, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన 17వ స్నాతకోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెం దిన 1990 మంది విద్యార్థులకు (1532 మంది అండర్ గ్రాడ్యుయేట్, 372 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 86 మంది పీహెచ్.డీ. స్కాలర్లు) పట్టాలు ప్రదానం చేశారు. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గీతం అధ్యక్షుడు విశాఖపట్నం లోక్ సభ సభ్యుడు ఎం.శ్రీభరత్ అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా మహాత్మా గాంధీ విగ్రహానికి, గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా, చేనేత రంగంలో విశేష కృషి, భారతదేశపు గొప్ప వస్త్ర వారసత్వాన్ని పరిరక్షి ంచడంలో అందించిన సేవలకు గుర్తింపుగా, భారతీయ చేనేత కళాకారుడు గజం గోవర్ధనకు గీతం గౌరవ డాక్టరేట్ (డీ.లిట్) ప్రదానం చేసింది. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 17 బంగారు పతకాలను అందజేశారు. బీ.టెక్.లోని అన్ని విభాగాలలో టాపర్ గా నిలవడంతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు సాధించిన డిగుదాడి ప్రణవ్ రాహుల్ ప్రెసిడెంట్ పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలను అందుకున్నారు. అలాగే, పరిశోధన, ఆవిష్కరణల రంగంలో గణనీయమైన కృషి చేసిన 86 మంది పరిశోధక విద్యార్థుల (పీహెచ్.డీ స్కాలర్లు)కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేసింది. అత్యుత్తమ పరిశోధన విజయాలకు గాను, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (అర్థశాస్త్ర విభాగం) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ అర్షద్ అన్సారీ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (రసాయన శాస్త్ర విభాగం) ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్రబాబులకు ఉత్తమ పరిశోధకుడు (బెస్ట్ రీసెర్చర్) అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి స్నాతకులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి తత్వాన్ని గుర్తుచేస్తూ పట్టభద్రులను ఉత్తేజ పరిచారు. అధ్యక్షోపన్యాసంలో, శ్రీభరత్ పట్టభద్రులైన విద్యార్థులు అభినందిస్తూ, విజయానికి ఏడు మార్గదర్శక సూత్రాలను వివరిస్తూ రాజమౌళి సందేశాన్ని పునరుద్ఘాటించారు. పెద్ద కలలు కనండి, మిమ్మల్ని మీరు నమ్మండి, గొప్ప వ్యక్తులతో కలిసి ఉండండి. మీ లక్ష్యాల పట్ల అభిరుచితో నిబద్ధతతో ఉండండి. నిరంతరం నేర్చుకుంటూ, ఎదుగుతూ ఉండండి. వినయంగా ఉండండి, ఇచ్చిన మాటను ఎల్లప్పుడూ నిలబెట్టుకోండి అని సలహా ఇచ్చారు. వార్షిక నివేదికను సమర్పిస్తూ, హైదరాబాదులో అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, గీతం సాధించిన విజయాలను వివరించారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలలో శ్రేష్ఠత ద్వారా సామాజిక బాధ్యత గల నాయకులను తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతను పునరుద్ఘాటించారు.






మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

## భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయాలి

### కడెం ప్రాజెక్టును పరిశీలించిన మంత్రుల బృందం

**నిర్మల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** భవిష్యత్తు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా నిల్వ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షి ంచేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కూడిన మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది. ప్రాజెక్టు వద్ద అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం, ప్రస్తుత ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, గేట్ల ద్వారా విడుదల చేస్తున్న నీటి వివరాలను మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణకు శాస్త్రీయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, పూడిక సమస్యలపై మంత్రులకు వివరించారు. సుమారు 7.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో దాదాపు 50 శాతం వరకు పూడిక పేరుకుపోయినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని, ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి హుండీ ఆదాయం రూ.134 కోట్లు

**తిరుమల, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డీకాసులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి వరుసగా జులై మాసంలోనూ కానుకల రూపంలో హుండీ ఆదాయం రూ.134 కోట్లకు పైగానే నమోదైంది. దేశవిదేశాల్లోని భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి సాధారణ రోజుల్లోనూ తిరుమలకు భారీగా తరలి వస్తున్నారు. తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి నగదు, నగలు సమర్పించుకోవడం కనిపిస్తోంది. ఇందుకు నిదర్శనంగా గత నెలకు సంబంధించి హుండీ ఆదాయం గమనిస్తే రోజువారీగా దాదాపు రూ.4 కోట్లు పైమాటగానే చేకూరింది. భక్తుల రద్దీతో బాటు మొక్కుబడుల రూపంలో కానుకలు హుండీకి భారీగానే చేరాయి. జులైలో వరుసగా 21న రూ.5.18 కోట్లు, 5న రూ.5.05 కోట్లు, 13న రూ.5.03 కోట్లు, 30న రూ.4.81 కోట్లు, 31న రూ.4.46 కోట్లు, అలాగే 17న ఆణివార ఆస్థానం రోజున రూ.5.31 కోట్లు వరుసగా హుండీకి రాబడి చేకూరింది. ఇక మిగిలిన రోజుల్లో సరాసరి రూ.4.50 కోట్ల వరకు ఆదాయం రావడం విశేషం. గత నెలలో సరాసరి 24.50లక్షలకు పైగానే భక్తులకు స్వామివారి దర్శనం చేసుకున్నారు.



## శ్రీవారి పుష్కరిణి మూసివేత

- సెప్టెంబర్ 10న తిరిగి పునఃప్రారంభం

**తిరుమల, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో దేవదేవుని ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న పవిత్రపుష్కరిణి మరమ్మతులు, శుద్ధి పనులు చేపట్టేందుకు నెలరోజులపాటు పుష్కరిణిని తిరుమల తిరుపతి దేవస్థానం మూసివేసింది. సాధారణంగా ప్రతి ఏడాది ఏడుకొండల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులు పాటు పుష్కరిణి మూసివేసి నీటిని పూర్తిగా తొలగిస్తారు. పుష్కరిణిలోపల ఉన్న పైపులైన్ల మరమ్మతులు, పుష్కరిణి సివిల్ పనులు చేపడతారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. అంతకంటే ముందే పుష్కరిణి మరమ్మతులు, శుద్ధి చేసే పనులు చేపట్టేలా టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగం అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఆగస్టు 1వ తేదీ నుండి 31వతేదీ వరకు నెలరోజుల పాటు పూర్తిగా స్వామివారి పుష్కరిణి మూసివేస్తారు.
నెల రోజులు పుష్కరిణి హారతి ఉండదు. భక్తులను కూడా అనుమతించరు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు పుష్కరిణిలో స్నానాలకు అనుమతించరు. భక్తులకు స్నానాల కోసం వరాహస్వామి ఆలయం సమీపంలోనే స్నానఘట్టాలు, నీటికొళాయిలు ఏర్పాటు జరిగింది. నెలరోజులు పుష్కరిణిలో నీటిని తొలగించి చిన్నచిన్న మరమ్మతులను పూర్తిచేస్తారు. పుష్కరిణి మరమ్మతుల్లో భాగంగా మొదటి పదిరోజులు నీటిని తొలగిస్తారు. ఆ తరువాత పదిరోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే చేపడతారు. చివరి పదిరోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు.



## తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజ లందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. శనివారం బిజెపి జాతీయ కార్యదర్శి రితురాజ్ సిన్హా, తమిళనాడు మంత్రి వినోద్, ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎమ్మెల్సీ పద్మశ్రీ ఉదయాస్తమాన సేవలో క్రీడాకారిణి పివి సింధు కుటుంబంతో వేర్వేరుగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సు లందుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమల ఆలయంలో 23నుండి శ్రీవారి పవిత్రోత్సవాలు

**తిరుమల, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పలు రకాల ఉత్సవాలు, కైంకర్యాలు, సేవల వల్ల తెలిసీతెలియక జరిగిన పొరబాట్లను సరిదిద్దుకునేందుకు ఉత్సవమూర్తులకు నిర్వహించే పవిత్రోత్సవాలు ఈ ఏడాది వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 23నుండి 25వరకు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించేలా నిర్ణయించారు. ఆగస్టు 22న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సేవలో పాల్గొనాలని భావించే భక్తులకు ఈ నె 21వ తేదీన గురవారం ప్రత్యేకంగా టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేయనుంది. ఆ టికెట్‌ను ఇద్దరు గృహస్థ భక్తులకు కలిపి రూ.5 వేలు చెల్లించి కొనుగోలు చేయవచ్చు. టికెట్లు పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడు రోజులు శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామికి జరిగే స్నపన తిరుమంజనంలో, చివరి రోజున పూర్ణాహుతిలో పాల్గొనే అవకాశం కల్పించారు. పవిత్రోత్సవాల టిక్కెట్లు పొంది సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో ఆయా రోజుల్లో ఉదయం 7గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలి. భక్తులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపితే ఆలయం లోపలకు అనుమతిస్తారు. ఈ ఏడాది వినూత్నంగా భక్తులకు వరుసగా మూడు రోజులు తిరుమలేశుని దర్శించుకునే అవకాశం కలగడంతో పెద్దసంఖ్యలో భక్తులు సద్వినియోగం చేసుకుంటారని టిటిడి అంచనా వేస్తోంది.

## నిందితుడు అరెస్ట్

- రూ.7 లక్షల విలువైన బంగారు నగలు, నగదు స్వాధీనం



**తిరుమల, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో ఇటీవల జరిగిన గొలుసు అపహరణ, గృహ చోరీ ఘటనలను పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, ఘర్షణ పడిన బాలుడిని జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి సుమారు రూ.7లక్షల విలువైన బంగారు నగలు, ఒక గిల్ట్ చైన్ రూ.500లు నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ ఘటనలపై తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల పోలీసులు వేగంగా దర్యాప్తు చేశారు. తమిళనాడు తిరువళ్లూరు జిల్లాకు చెందిన ఎన్.సురేష్ కుమార్ (25)ను అరెస్ట్ చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన 16యేళ్ల బాలుడిని జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు ఎన్.సురేష్ కుమార్ గతంలో కూడా పలు నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు.



మట్టికుండలతో స్వర్ణముఖి పవిత్ర జలాలను ఊరేగింపుగా తెస్తున్న ఆలయాధికారులు, పాలకులు, అర్చకులు, వేదపండితులు

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో సహస్రఘట్టాభిషేకం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం లోకకళ్యాణార్థం సహస్రఘట్టాభిషేకం నిర్వహించారు. కరువు కాటకాలు, ఎవరికైనా ప్రాణాపాయస్థితిలో ఉన్నపుడు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సక్రమంగా వర్షాలు కురవక వేసవితో జనం తల్లడిల్లుతున్న తరుణంలో వేదపండితులు, అర్చకుల సూచనలతో ఆలయాధికారులు మృత్యుంజయునికి సహస్రఘట్టాభిషేకం నిర్వహించారు. శనివారం ఉదయం స్వర్ణముఖి నది నుంచి రుత్వికులు మట్టికుండల్లో నీటిని మోసుకొని వచ్చి మృత్యుంయ లింగానికి అభిషేకించారు. మృత్యుంజయస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పసుపు గంధంతో ముస్తాబు చేసారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను వరుణ దేవుని స్తుతిస్తుండగా ఆలయ అభిషేక ప్రధాన గురుకుల్ డాక్టర్ స్వామినాదన్ గురుకుల్ హోమాలు నిర్వహించారు. కలశ స్థాపన గావించి పూజలు జరిపారు. పూర్ణాహుతి తరువాత మృత్యుంజయ స్వామి ఆలయ ద్వారాన్ని మట్టిగోడతో మూసివేసారు. స్వర్ణముఖి నుంచి తెచ్చిన జలాలతో లింగాన్ని ఆలయ పై కప్పు నుంచి నింపారు. ఈ గోడ నాని కరుగుతుండగా వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తారనే నమ్మకం ఉంది. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, లక్ష్మమ్మ, డిప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ శ్రీనివాసులు రాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ పాల్గొన్నారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**విజయవాడ, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ పాతబస్తీ (వన్‌టౌన్) పరిధిలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. బంగారం దుకాణంలో చోరీకి పాల్పడ్డ ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. దుకాణంలో పనిచేసే వారే రాజస్థాన్‌కు చెందిన గణపత్‌సింగ్, ఇంద్రసింగ్, దిలీప్‌సింగ్ దొంగతనం చేసినట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.14.35 లక్షలు, 302 గ్రాముల బంగారం, 685 గ్రాముల వెండి ఆభరణాలు విజయవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## కుప్పం హాకింగ్స్ విద్యార్థుల అద్భుతం

- బయోమెట్రిక్ సాఫ్ట్‌వేర్ విధానంతో ఓటింగ్ ప్రాజెక్ట్



ప్రాజెక్ట్ వివరాలు వెల్లడిస్తున్న స్కూల్ చైర్మన్ హాఫీజ్

**కుప్పం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** కుప్పంలోని హాకింగ్స్ స్కూల్ విద్యార్థులు ఓ అద్భుతానికి శ్రీకారం చుట్టారు. బయోమెట్రిక్ సాఫ్ట్‌వేర్ విధానంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించే ప్రాజెక్టును విజయవంతంగా ప్రదర్శించారు. తద్వారా బోగస్ ఓట్లు నియంత్రించడంతో పాటు ఎవరి ఓటు హక్కువారు పొందే అవకాశం ఉందని నిరూపించారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు టా ్యబ్‌లతో డెమో ప్రాజెక్టును ప్రదర్శించి మన్ననలు పొందారు. ఈ ప్రాజెక్టులో భాగంగా తొలుత ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులైన విదా ్యర్థుల వివరాలు పొందుపరుస్తారు. ఆయా అభ్యర్థులకు ఓట్లు వేసే ఇతర విద్యార్థుల బయోమెట్రిక్ నమూనాలను ముందేసేకరించి ట్యాబ్‌లో నిక్షిప్తం చేస్తారు. అనంతరం విద్యార్థులు ఓటు వేసే సమయంలో ట్యాబ్‌లో బయోమెట్రిక్ తీసుకుని ఓటు వేసే విధానంను అనుసరించారు. ఇక్కడ వేసిన విద్యార్థే మరో ఓటు వేసేందుకు అవకాశం ఉండదు. దీన్ని ట్యాబ్ తిరస్కరిస్తుంది. ఇలా విద్యార్థులు ఈ ప్రాజెక్టును ఆలోచనాత్మక ంగా రూపొందించారు. ఈసందర్భంగా హాకింగ్స్ స్కూల్ చైర్మన్ ఎస్‌డి హాఫీజ్ మాట్లాడుతూ 'నీ ఓటు.. నీ భ ద్రత్ల అనే నినాదంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ విధానం అమలు చేస్తే ఎన్నికల సమయంలో దొంగ ఓట్లకు చెక్ పెట్టవచ్చని పేర్కొన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ల వివరాలు బయోమెట్రిక్ విధానంకు లింక్ చేసి విజయవంతంగా ఓటింగ్ ప్రక్రియను చేపట్టవచ్చన్నారు. ఈ ప్రాజెక్టును కేంద్ర ఎన్నికల కమీషన్ దృష్టికి సైతం తాము తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ విధానం అమలు చేయాలంటే ఎన్నికల ముందు ఓటర్ల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు చేపట్టిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీధి దీపాల నిర్వహణలో అలసత్వం వద్దు

### విద్యుత్ పొదుపు అందరి బాధ్యత: ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో వీధి దీపాల నిర్వహణలో అలసత్వాన్ని విడనాడాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. తొమ్మిది జిల్లాల్లోని కార్పొరేషన్లు/ మునిసిపాలిటీల పరిధిలో వీధి దీపాల విద్యుత్ సర్వీసులు, 13,568, పంచాయితీల పరిధిలో 41,918 సర్వీసులున్నాయని తెలిపారు. వీధి దీపాల నిర్వహణకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసినప్పటికీ పలు ప్రాంతాల్లో నిర్వహణా లోపం కారణంగా పగటిపూట వీధిదీపాలు వెలుగుతూ విద్యుత్ వృధా అవుతోందన్నారు. వీధిదీపాల నిర్వహణ పూర్తిగా ఆయా ప్రాంతాల్లోని విద్యుత్‌శాఖ సిబ్బంది సమన్వయంతో ఈ సమస్యను అధిగమించాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణను క్రమబద్ధంగా చేపట్టాలని క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందికి సూచనలు జారీ చేస్తున్నా, అవి పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. వారితో విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పగటి పూట విద్యుత్ దీపాలు వెలుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు తమ బాధ్యతగా భావించినపుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కూడా నిరంతరం వీధి దీపాల నిర్వహణా తీరును పర్యవేక్షిస్తూ, విద్యుత్ వృధాను అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఈ అంశంలో నిరక్ష్యం వహించినట్లయితే సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎఎల్ఎమ్ కుటుంబానికి రూ.1.10కోటి బీమా



**తిరుపతి, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని చిత్తూరు రూరల్ డివిజన్, రెడ్డిగుంట సబ్‌డివిజన్ పరిధిలో విధుల నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన అసిస్టెంట్ లైన్ మ్యాన్ ఎన్.జ్ఞానశేఖర్ కుటుంబానికి రూ.1.10 కోటి ప్రమాద బీమా మొత్తాన్ని శనివారం అందించారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల తరపున ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి రూ.1.10 కోట్ల చెక్కును జ్ఞానశేఖర్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది విధి నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ శాలరీ ప్యాకేజి కింద మంజూరు చేసిన ప్రమాద బీమా సొమ్ముతో వారి కుటుంబానికి ఆర్థిక భద్రత చేకూరుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, జనరల్ మేనేజర్ ఎం.శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిచంద్ర, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్‌పి సతీష్ బాబు, రీజనల్ మేనేజర్లు పి. సురేష్‌బాబు, ఎంవిఎస్ ప్రవీణ్‌కుమార్, చీఫ్ మేనేజర్ జి. దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయండి: ఎంపి కేశినేని చిన్ని

**విజయవాడ, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** కొండపల్లి రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని విజయవాడ లోక్‌సభా నియోజకవర్గ సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని) సౌత్ కోస్టల్ రైల్వే జీఎం మాథుర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం కలిశారు. జీఎం మాథుర్‌ను కలిసి పలు కీలక అంశాలపై చర్చించామని తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని అడిగామని చెప్పారు. విజయవాడ చుట్టుపక్కల రైల్వే సమస్యల గురించి తెలిపామని అన్నారు. విజయవాడకు ట్రాఫిక్ సమస్య తీరేలా 8 ఆర్వోబీల ఏర్పాటు గురించి మాట్లాడామని తెలిపారు. ఎర్రకట్ట వంతెన పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు అతి ముఖ్యమని వివరించారు. గుణదల ఎల్సీ 8 కూడా చాలా అవసరమని తెలిపామని ఎంపీ శివనాథ్ అన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి టెండర్లు వేసినా ఎవరూ రాలేదని చెప్పారు. కేంద్ర రైల్వేమంత్రిని ఎంపీలందరం కలిసి విజయవాడను అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని కోరుతామని అన్నారు. విజయవాడ బెంగళూరు వయా గుత్తి రైల్వేలైన్ కావాలని కేంద్ర మంత్రిని తాము అడుగుతామని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

## కాణిపాకంలో టిడిపి, వైకాపా నాయకుల సత్యప్రమాణం

**కాణిపాకం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** కర్ణాటక ప్రజలను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు కించ పరుస్తూ మాట్లాడారని గత రెండు, మూడు రోజులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై చిత్తూరు తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి పార్టీలకు చెందిన నాయకులు శనివారం సత్యప్రమాణాలకు నిలమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సత్య ప్రమాణం చేశారు. కర్ణాటక ప్రజలను చిత్తూరు ఎమ్మెల్యే గురజల జగన్మోహన్ నాయుడు కించపరిచే విధంగా వైఎస్ఆర్‌సిపి తప్పుడు ప్రచారం చేస్తోందని తెలుగుదేశం నాయకులు చేస్తున్న ఆరోపణలకు వైఎస్ఆర్‌సిపికి ఎలాంటి సంబంధం లేదని వైకాపా నాయకులు శనివారం సత్యప్రమాణం చేశారు. ఈ మేరకు టిడిపి తరపున బిసి సంక్షేమ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి పి.షణ్ముగం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర మొదలియార్ సంఘ నాయకులు జ్ఞాన జగదీష్‌లు కాణిపాకంలో సత్యప్రమాణాలు చేశారు.
ఈ సందర్భంగా షణ్ముగం, జ్ఞాన జగదీష్‌లు వేరు వేరుగా పెద్ద ఎత్తున తమ మంది మార్బలంతో సాయంత్రం 4 గంటలకే కాణిపాకం ఆలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాణిపాకంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు చిత్తూరు వెస్ట్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ



కాణిపాకం ఆలయం వద్ద మోహరించిన టిడిపి వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలను అదుపుచేస్తున్న పోలీసులు

బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయంలోని ప్రధాన తలుపులు, గేట్లను మూసివేసి సాయంత్రం 5 గంటలకల్లా భక్తులను ఆలయం వెలుపలికి పంపివేశారు.
అనంతరం టిడిపి తరపున ప్రమాణం చేస్తున్న షణ్ముగం, వైఎస్ఆర్‌సిపి తరపున ప్రమాణం చేస్తున్న జ్ఞానజగదీష్‌లను పోలీసులకు ఆలయంలోనికి అనుమతించారు. అనంతరం వారు టిక్కెట్టు కొనుగోలు చేసి ఆలయ పుష్కరిణిలో మునిగి గణనాథుడి ఎదుట ఇరువురు సత్యప్రమాణం చేశారు. అనంతరం ఇరువురు వెలుపలికి రాగా ఇరు వర్గాలు దాడులు చేసుకోవడానికి దూసుకురావడంతో సుమారు 20 నిముషాల పాటు ఆలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిఐ శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో భారీగా మోహరించిన పోలీసులు ఇరు వర్గాలను అక్కడి నుండి పంపివేశారు.

## ఘంటసాల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు



**తిరుపతి, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరగాయకుడు, తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఘంటసాల విగ్రహాన్ని రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుభ్రం చేసి అనంతరం పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఘంటసాల అభిమాని బుజ్జమ్మని సత్కరించారు. ఘంటసాల తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని కొనియాడుతూ నగరంలోని భవానీనగర్ కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెవిఎన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పా పద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, శాంబోలు హరినాథ్, ఆదిస్వామి తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

**తిరుమల, ఆగస్టు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటి నుండి అలిగి వెళ్ళిన విద్యార్థిని పోలీసులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుమలలో ఉన్న విద్యార్థిని సురక్షితంగా పట్టుకుని చేర్చారు. మూడు రోజుల క్రితం తిరుపతికి సమీపంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న జయంత్ అదృశ్యమయ్యాడు. విద్యార్థి ఇంటి దగ్గరే ఫోన్ వదిలేసి వెళ్లడంతో సిసి ఫుటేజ్ ద్వారా వెదికారు. చివరగా అలిపిరి ప్రాంతంలోని సిసి కెమెరాలు కనబడటంతో తిరుమలలో గాలించారు. తిరుమలలో ఉన్న అతనిని పోలీసులు గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి తండ్రి వద్దకు చేర్చారు.

## కోనలో వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



**రాపూరు (నెల్లూరు), ఆగస్టు 1 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారికి ఉభయ దేవేరులతో కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, స్వామి వారికి భక్తులు సమర్పించిన 100 గోడుగులతో, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. భక్తులకు భోజన, వసతి సౌకర్యాలతోపాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ ఇఒ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. పాలవల్లి లక్ష్మీనారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి,వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

### శ్రీవారికి రూ.4,12,493 రాబడి

శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.4,12,493 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. నిత్యఅన్నదానానికి విరాళల రూపేణా రూ.91,728, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.24,750, నిత్య కళ్యాణం ద్వారా రూ.43,750, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.28,400, బ్రేక్ దర్శనం ద్వారా రూ.9,800, వసతి ద్వారా రూ.13,500 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

## దుర్గమ్మ సేవలో ఆస్ట్రేలియా మంత్రి బృందం



ఆస్ట్రేలియా మంత్రికి దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** శ్రీ కనకదుర్గమ్మని శనివారం ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ బృందం దర్శించుకున్నారు. వారికి ఆలయ పండితులు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్ దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదాలను శేషవస్త్రములు అందించారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు.

**భక్తిశ్రద్ధలతో ఆషాఢం సారె:** ఆషాఢం సారె తెచ్చిన భక్తజనం భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకి సమర్పించారు. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్రకీలాద్రికి 19వ రోజు శనివారం సాయంత్రం 5 గంటల వరకు 49 సారె బృందాలకు చెందిన 20342 మంది భక్తులు అమ్మకి సారె సమర్పించారు. వారు దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు. భక్తులందరికి క్యూలైన్లలో త్రాగడానికి మంచినీరు, ఉచిత భోజనం, ఉచిత ప్రసాద వితరణ అందేలా చర్యలు తీసుకున్నారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి వేద పరిరక్షణ ట్రస్ట్ విభాగమునకు హైదరాబాద్‌కు చెందిన పలగుమ్మి అఖిల్ విశ్వేస్, కుటుంబ సభ్యులు రూ.1,15,000 విరాళము శనివారం ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌కు అందించారు. గుంటూరుకు చెందిన పాబిశెట్టి లక్ష్మీనారాయణ రు.1లక్ష విరాళాన్ని శ్రీ దుర్గమ్మ ఆలయ అభివృద్ధి పథకమునకు అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, అమ్మ చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

**ఆదివారం ప్రోటోకాల్, విఐపి దర్శనాలు నిలిపివేత:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం పెద్దఎత్తున భక్తులు వచ్చే అవకాశముండడంతో ప్రోటోకాల్/ విఐపి దర్శనాలు నిలిపివేసినట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఆషాఢ మాసం ఉత్సవాలు సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల వివిధ ప్రాంతాల నుండి సారె సమర్పణకు భక్తులు వస్తున్నందున, ఈ నిర్ణయం తీసుకున్నామని ఇఒ తెలిపారు. అలాగే ఘాట్ రోడ్ వైపు ప్రవేట్ వాహనాల రాకపోకలు నియంత్రిస్తామని పేర్కొన్నారు. దేవస్థానం బస్సులు పూర్తి స్థాయిలో నడుపుతామని, లిఫ్ట్ మార్గం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగిస్తామని వివరించారు. మహా మండపం ర్యాంప్ మీదుగా భక్తులు కొండపైకి చేరుకోవాలని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డల తల్లులు రద్దీ లేని సమయమైన ఉదయం 8 లోపు, సాయంత్రం 3 నుండి 5 లోపు రావాలని ఇఒ విజ్ఞప్తి చేశారు.

# స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం..



స్నేహానికన్న మిన్న లోకాన లేదురా.. కడదాకా నీడలా నిను వీడిపోదురా... అంటూ కవులు రాసిన కవితాసుధ స్నేహానికి ఉన్న విశిష్టతను ఎన్ని విధాలుగా కొనియాడినా కూడా.. ఆ స్నేహబంధంలోని మధురానుభూతి వర్ణించడం శక్యం కానిది. స్నేహానికి ఉన్న గొప్పతనాన్ని ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన అనేక చలన చిత్రాలు ఘన విజయాలను సాధించి, కనకవర్షాన్ని కురిపించడానికి ప్రధాన కారణం సమాజంలో స్నేహ బంధంపై ఉన్న ఉన్నతమైన భావనే. కృష్ణ-కుచేలులు, కర్ణ-దుర్యోధనులు, అన్నదమ్ములైనా స్నేహితులుగా కడదాకా జీవితాన్ని సాగించిన రామ-లక్ష్మణులు మన పురాణ, ఇతిహాస పాత్రలలో స్నేహానికి నిలువెత్తు ఉదాహరణలు.




1930లో యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన హాల్‌మార్క్ గ్రీటింగ్ కార్డుల వ్యవస్థాపకుడు జాయిస్ సి. హాల్ మొదట సారిగా 'ఫ్రెండ్‌షిప్ డే' భావనను ప్రతిపాదించారు. అయితే, దీని వెనుక వ్యాపార దృక్పథం ఉండటంతో ఈ ప్రతిపాదన అంతగా ప్రాచుర్యం చెందలేదు. 1935వ సంవత్సరం ఆగస్టు మొదటి శనివారం రోజున అమెరికా ప్రభుత్వం చేతిలో హతమైన తన స్నేహితుడిని మర్చిపోలేని మరో స్నేహితుడు, ఆ తర్వాతి రోజైన ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడని ఒక ప్రచారంలో ఉన్న కథనం చెబుతుంది. దీనికి చలించిపోయిన అమెరికా ప్రభుత్వం ఆగస్టు మొదటి ఆదివారాన్ని 'ఇంటర్నేషనల్ ఫ్రెండ్షిప్ డే'గా ప్రకటించిందని కొందరు తెలిపారు. 1958లో పరాగ్వేకు చెందిన వైద్యుడు, మనస్తత్వవేత్త డాక్టర్ ఆర్టెమియో బ్రాచో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఆలోచనను ప్రతిపాదించిన తర్వాత 'ఫ్రెండ్‌షిప్' డే' జరుపుకునే సంప్రదాయం గణనీయంగా పెరిగిందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. నియమ నిబంధనలు, ప్రణాళికలు, ఎల్లలు లేనిదే...స్నేహం స్నేహం అనేది ఇలా ఉండాలి, అలా ఉండకూడదు అనే నిర్ధిష్టమైన నియమ నిబంధనలు, ప్రణాళికలు, అంచనాలు ఏమి స్నేహితుల మధ్య ఉండవు. స్నేహానికి వయసుతో, కులమతాలతో, స్థితిగతులతో, లింగభేదంతో, ఎల్లలతో సంబంధం ఉండదు. ఎవరి మధ్యనైనా స్నేహం చిగురించవచ్చు. అలా చిగురించిన స్నేహాన్ని ఎలాంటి వ్యత్యాసాలను, తారతమ్యాలను చూపించి మాన్పించలేము. ఒకసారి ఏర్పడ్డ స్నేహం చిన్నచిన్న కష్టాలు, కలతలు, అపార్థాలు వచ్చినా కూడా తిరిగి మరింత పటిష్ఠమై జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు కులమతాల తారతమ్యాలు, స్థితిగతుల వ్యత్యాసా లను చూపి స్నేహాన్ని వదులుకోమన్నా కూడా వదలకుండా కొనసాగించిన అనుభవాలు, జ్ఞాపకాలు మన మధ్యనే ఎన్నో ఉన్నాయి. స్నేహబంధం ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క బంధంలా తన రూపాన్ని మార్చుకుని ప్రవర్తించగల శక్తివంతమైనది. ఒకసారి గురువులా మారి మంచిని బోధించి మంచి మార్గాన్ని చూపిస్తుంది. మరొకసారి తల్లిదండ్రుల్లా మారి మంచి చెడులను విశ్లేషించి వివరంగా చెప్పి, మందలించి మన బాగోగులను చూస్తుంది. కష్ట సమయంలో కలత చెందిన మనసుకు ప్రశాంతతను కలిగించి ధైర్యాన్ని ఇచ్చే దివ్య ఔషధంగా మారుతుంది. మన సంతోషంలో నవ్వుగా మారి మనల్ని నవ్విస్తుంది. బాధలో దుఃఖంగా మారి మన దుఃఖంలో సగపాలు పంచుకుంటుంది. చివరికి ఎంత త్యాగానికైనా సిద్ధపడే మరువలేని అనుబంధంగా మారుతుంది ఈ స్నేహం.

కంటికి దూరమైనా మనసుకు దగ్గరుండేదే... స్నేహం.. బాల్యంలో, ప్రాథమిక విద్యలో, తెలిసీ తెలియని వయసులో ప్రారంభమైన స్నేహం కాటికి వెళ్లే వరకు మనతోనే నడుస్తుంది. మరి ఇన్ని సంవత్సరాల జీవిత ప్రయాణంలో మన కంటికి దగ్గరగా లేకపోయినా, మన మనసుకు దగ్గరగా ఉంటూ, అండగా ఉంటూ, మనకు ధైర్యం చెప్పేదే స్నేహం. బాధకైనా, సంతోషానికైనా, విషయం తెలిసిన వెంటనే, ఎంత దూరాన ఉన్నా కూడా సమయం చూడకుండా మన ముందుండే ఆత్మీయ బంధమే ఈ స్నేహం. బాల్యంలో పరిచయమైన స్నేహితులందరూ వృద్ధాప్య ఛాయలు వచ్చినా కూడా, ఎన్ని పనులున్నా ఆపు కుని "పూర్వ విద్యార్థుల స్నేహితుల కలయికలు" ఏర్పాటు చేసుకునే ఉన్నతమైన సంప్రదాయాన్ని సమాజంలో మనం తరచుగా చూస్తూనే ఉంటాం. అదే స్నేహానికి ఉన్న విడదీయ లేని అనుబంధం. అలాంటి కలయికలు సమాజానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి. మనసు విప్పి మాట్లాడుకునే ఆత్మీయ బంధమే... స్నేహం ఈ సృష్టిలో బాల్యం నుండి యుక్తవయసు వరకు ధైర్యంగా, ఆప్యాయంగా మనసులోని సంతోషాలను, బాధలను వ్యక్తపరచుకునే ఆత్మీయ బంధం అమ్మ. యుక్తవయసులో మన చుట్టూ కుటుంబ బంధాలు ఎన్ని ఉన్నా కూడా, మనం ఎవరికీ చెప్పుకోలేని బాధలను మొట్టమొదటిగా ధైర్యంగా, ఏమీ దాచుకోకుండా వ్యక్తపరచు కునే బంధం ఈ సృష్టిలో ఏదైనా ఉందంటే, అది తప్ప కుండా స్నేహమే అవుతుంది. మన సంతోషంలో సంతోషమై, బాధలో బాధై, మన అడుగులో అడుగై నడిచేదే ఈ స్నేహం.దేవుడు కుటుంబాన్ని సృష్టిస్తే... మనిషి స్నేహితుడిని సృష్టించుకున్నాడు. విశిష్టతను కలిగి ఉన్న ఈ స్నేహబంధానికి గుర్తుగా జరుపుకునే 'స్నేహితుల దినోత్సవం'.

**- ననుబోలు రాజశేఖర్**

**చిట్కా:**

★ మనం తినే ఆహారములో వీలైనంత ఎక్కువగా క్యారెట్ తీసుకుంటే కళ్ల జబ్బులను నివారించవచ్చు. ★ తలలో చుండ్రుపోయి మెదడు చల్లబడాలంటే తలస్నానంచేసే ముందు మంచి నిమ్మకాయలతో తలరుద్దు కొని అరగంట తర్వాత స్నానము చేయాలి. మైదా పిండి గోధుమ పిండికీ పురుగు పట్టకుండా ఉండాలంటే నాలుగు స్పూన్ల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి ★ ఇంట్లో కొడిగుడ్డును వ్రేలాడదీసిన యెడల ఆ ఇంటికి ఏ దోషాలు తగలక పోవడమేకాక సమస్త శుభములు కలుగును. □

# తలపై బోనం 'అమ్మ' ధ్యానం



ఆషాఢమాసం ఆరంభంతోనే అమ్మవారి ఆలయాలు శోభాయమానంగా ముస్తామవుతాయి. పూజలు, హోమాలు, అలంకారాలు, భక్తుల సందడితో ప్రతి ఆలయం కోలాహలంగా ఉంటుంది. ఇక ఈ మాసంలో చెప్పుకోదగినది హైదరాబాద్, సికింద్రాబాద్ బోనాలు ఉత్సవం. ఈ బోనాల ఉత్సవం అమ్మవారి ఆలయాలతో పాటు వీధి వీధిన ఎంతో వేడుకగా జరుగుతుంది. పంటపొలాలను రక్షించుకునేందుకు ఊరి ప్రజలంతా కలిసి సామూహికంగా జరుపుకునేది బోనాల పండుగ. ఈ పండుగను కొన్ని ప్రాంతా లలో పెద్ద పండుగ అని కూడా అంటారు.

ఊరి మధ్యలో ఉండే బొడ్రాయి ఊరికి నాభి స్థానంలో ఉంటుంది. ఊరి చివరలో పంటపొలాలకు వెళ్లే దారిలో పోచమ్మ, చెరువు గట్టు మీద కట్ట మైసమ్మ,పచ్చికబయళ్ల వద్ద ఉప్పలమ్మ ఆలయాలు ఉంటాయి. బోనాల ఊరేగింపు ఊరి మధ్యలో ఉండే బొడ్రాయి దగ్గర ప్రారంభమై, పోచమ్మ ఆలయానికి చేరుకుని కట్టమైసమ్మ ఆలయం దిశగా సాగిపోతుంది. ఇలా ఆ ఊరే గింపు డప్పుశబ్దాలు, పూనకాలతో గ్రామదేవత దగ్గరికి వెళుతుంది. అక్కడ బలి కార్యక్రమం ఉంటుంది. గ్రామదేవతలు శక్తి ఆరాధనకు ముందరి ఆదిమదేవతా రూపాలు. కాలక్రమేణా గ్రామదేవతకో స్పష్టమైన రూపాన్ని, భావాన్ని నిర్మించారు. ఆ భావజాలం బలపడుతూ దాని చుట్టూ అనేక క్రతువులు, నమ్మకాలు వచ్చి చేరాయి. అలా గ్రామదేవతల వ్యవస్థ బల పడింది. గ్రామదేవతకు సంబంధించిన ఆలయం ప్రాంగణంలో వేపచెట్టు ఉంటుంది. హైదరాబాద్‌లోని గోల్కొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో చెరువు ఉండేది. గ్రామదేవతలు కూడా ఉండేవారు. ఈ గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మ, కట్టమైసమ్మలను కలిపి చేసే పండుగే బోనాల పండుగ. ప్రస్తుతం మచ్చుకైనా చెరువులు కనిపించడం లేదు. గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. అయినా బోనాలు ఉత్సవాలు జరుగుతున్నాయి. మారుతున్న నగర జీవనంతో పాటు బోనాల పండుగ నిర్వహణ రీతులలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త కుండకు సున్నం పసుపు రాసి కుంకుమ తో బొట్టుపెడతారు. తెల్లని వస్త్రంలో నవధాన్యాలు పోసి చిన్న ముల్లెగా కట్టి ఆ గుడ్డ నాలుగు అంచులను పైకి ఒత్తిగా పేనుతారు. మట్టి మూతలో నూనె పోసి ఆ



వత్తిని అందులో పెడతారు. బోనం ఎత్తే ముందు వత్తిని వెలిగిస్తారు. కుండలో అమ్మవారి కోసం చేసిన ప్రత్యేక భోజనం పెడతారు. కింది కుండలో నీరు,పై ముంతలో నైవేద్యం ఉంటుంది. ఆ నీటితో అమ్మవారికి అభిషేకం చేసి, నైవేద్యాన్ని అర్పించి కల్లుతో సాక పెడతారు. కొందరు నైవేద్యంగా తీపి వంటకాలనే పెడుతున్నారు. బోనాలకు పెళ్లయి అత్తవారింట్లో ఉన్న కూతురిని, అల్లుడిని ఇంటికి ఆహ్వానిస్తారు. ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు వేపాకు మండలు అలంకరిస్తారు. ముంగిట్లో కల్లాపి చల్లి చక్కటి ముగ్గురు పెడతారు. ఎవరి తాహతును బట్టి వారు అమ్మవారికి కోడినో, పొట్టేలునో హారం ఇస్తారు. హారంగా ఇచ్చిన మాంసంతో కూర, బగారా అన్నం వండి అమ్మవారికి బోనంగా సమర్పి స్తారు. కల్లుతోగాని, సారాతోగాని సాక పెడతారు. కొత్తగా తల్లిదండ్రు లయిన దంపతులు అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. బోనాల ఊరేగింపులో కాళ్లకు ఘల్లుఘల్లు మనే గజ్జెలు, దవడలకు నిమ్మ పండ్లు, ఒళ్లంతా బండారు పూసుకుని వచ్చే పోతురాజుల నృత్యాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఒకప్పటి బైండ్ల పూజారి ప్రతిరూపమే ఈ పోతురాజు. గ్రామదేవతల సోదరుడు పోతురాజు. ఇక ఆడపడుచులు, కొత్తకోడళ్లు నూతన వస్త్రాలు ధరించి నగలు అలంకరించుకుని బోనం ఎత్తుకుంటారు. తలపై బోనాలతో గుంపులు గుంపులుగా బయలుదేరతారు. గుంపుకు ముందు డప్పులు, బ్యాండుమేళం ఉంటుంది. వీరితో పాటు పూనకంతో ఊగిపోతూ పోతురాజులు నృత్యం చేస్తుండగా, నెత్తిమీద బోనం పెట్టుకుని రెండు చేతుల్లో వేపమండలు పట్టుకుని కొందరు మహిళలు లయబద్ధంగా పూనకంతో ఊగిపోతూ ఊరేగింపుతో పాటు కదులుతుంటారు. ఈ సందడితో కలిసి యువకులు కూడా ఉత్సాహంగా తీన్‌మార్ డాన్సులు వేస్తుంటారు. ఇలా కోలాహలంగా సాగుతూ ఆలయానికి చేరుతారు. ఎల్లమ, పోచమ్మ ఆలయాలకు చేరుకుని బోనం సమర్పించిన అంతే ఉత్సాహంగా ఇళ్లకు చేరుకుని ఇంటిల్లిపాది పండుగ చేసుకుంటారు. □

# నువ్వుల లడ్డు విరగకుండా !



**ఈ లడ్డూలు చలిలో** ఆరోగ్యాన్నీ, రుచినీ ఇస్తాయి. వీటిల్లో క్యాల్షియం, ఐరన్, పొటాషి యం, పీచు ఉంటాయి. కాబట్టి పిల్లల ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి కోసం పావు కప్పు పల్లీలు, మూడోవంతు కప్పు తెల్ల నువ్వులు, పావు కప్పు కొబ్బరిపొడి, అర కప్పు బెల్లం తురుము, పావుచెంచా యాలకులపొడి, రెండు చెంచాల నెయ్యి తీసుకోవాలి. మందపాటి అడుగున్న కడాయిలో మొదట నువ్వులు , తర్వాత పల్లీలు దోరగా వేయించుకోవాలి. వాటిని చల్లారనిచ్చి.. ఈ లోపు కొబ్బరి పొడిని బంగారు రంగు వచ్చేంతవరకూ వేయించు కోవాలి. పల్లీల పొట్టు తీసి బరకగా మిక్సీ పట్టుకోవాలి. ఒక పాత్రలో యాలకుల పొడి, పల్లీల పొడి, నువ్వులు వేసి కలపాలి. స్టౌపై కడాయి పెట్టి దానిలో బెల్లం తురుము వేసి నాలుగు చెంచాల నీళ్ల పోసుకోవాలి. బెల్లం పూర్తిగా కరిగే సమయానికి నువ్వులు, పల్లీలు, కొబ్బరి, యాలకుల పొడి వేసుకొని బాగా కలపాలి. చేతికి నెయ్యి రాసుకుని పొయ్యిమీద పెట్టండి. పాకం ముదిరి చక్కని లడ్డూలు వేయించిన జీడిపప్పు పలుకులు కలిపినా కూడా కరకలాడుతూ రుచిగా ఉంటాయి. □

## తెర

# 'కొరియన్ కనకరాజు' ట్రైలర్ లాంచ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లాంచ్ చేసిన వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ, యూవీ క్రియేషన్స్ ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ 'కొరియన్ కనకరాజు' హైలీ ఎంటర్టైనింగ్ థ్రిల్లింగ్ ట్రైలర్‌మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరికొత్త అవతార్‌లో కనిపిస్తున్న 'కొరియన్ కనకరాజు' పై రోజు రోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో అదరగొట్టారు. అమాయకమైన రాయలసీమ యువకుడిగా, భయంకరమైన కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన వ్యక్తిగా ఆయన చూపించిన వేరియేషన్స్ హైలైట్‌గా నిలిచాయి. మనోజ్‌రెడ్డి కటసాని సినిమాటోగ్రఫీ రాయలసీమ, కొరియా లొకేషన్స్‌ను గ్రాండ్‌గా ప్రజెంట్ చేసింది. ఎస్. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సీన్‌కు అదిరిపోయే ఎనర్జీని తీసుకొచ్చింది. సత్య జి ఎడిటింగ్ ట్రైలర్‌ను ఫాస్ట్‌పేస్డ్‌గా, ఎంగేజింగ్‌గా నిలబెట్టింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లో ఉన్నతంగా కనిపిస్తున్నాయి. 'కొరియన్ కనకరాజు' ట్రైలర్... హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి వినోదాన్ని అందించే థియేట్రికల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ: ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఒక మంచి కామెడీ ఎంటర్‌టైనర్‌తో మిమ్మల్ని అలరించాలని ఈ సినిమా చేశాం. ఆగస్టు 7న థియేటర్లలో ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. మా టీమ్ అందరికీ థ్యాంక్యూ. ఈ సినిమా మా అందరికీ ఒక బ్యూటిఫుల్ జర్నీ. ప్రేక్షకులకు కూడా అదే స్థాయిలో మంచి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని ప్రయత్నించాం. రీతికా నాయక్ మాట్లాడుతూ: ట్రైలర్‌కు మీరు ఇచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమా షూటింగ్‌ను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. మీరు కూడా థియేటర్ లో అంతే ఫన్నీ ఎక్స్‌పీరియన్స్‌ను పొందుతారు. మా డైరెక్టర్ గారికి, ప్రొడ్యూసర్‌కి థ్యాంక్యూ.

# 'ది ప్యారడైజ్' టీజర్ ఆగస్టు 6న రిలీజ్



నేచురల్ స్టార్ నాని ప్రతిష్టాత్మక 'పాన్‌వరల్డ్' చిత్రం 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రతి ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పాటు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఒడెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో, ప్రతిష్టాత్మకంగా రూపొంది స్తున్నారు. SLV సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తు న్నారు.తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఆగస్టు 6న విడుదల చేయను న్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ అప్‌డేట్‌తో సినిమాపై నెలకొన్న ఆసక్తి మరింత పెరిగింది. 1 నిమిషం 35 సెకన్ల నిడివి గల ఈ టీజర్‌లో సినిమా వరల్డ్ తో పాటు కథలోని ఎమో షనల్ ఇంటెన్సిటీని చూపించబోతు న్నారు. మేకర్స్ ఎలాంటి సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నారో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. నాని రగ్గడ్ లుక్, రా విజువల్ వరల్డ్, దర్శకుడు శ్రీకాంత్ ఒడెల యూనిక్ స్టయిల్... ఇవన్నీ కలిసి ది ప్యారడైజ్ పై భారీ అంచనాలు క్రియేట్ చేశాయి.ఈ చిత్రంలో మోహన్ బాబు, కాయదు లోహార్, రాఘవ్ జుయాల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, సీహెచ్ సాయి సినిమాటోగ్రఫీ నిర్వహిస్తు న్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తు న్నారు.పాన్ వరల్డ్ సినిమాగా రూపొందు తున్న 'ది ప్యారడైజ్' తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# 'క్రేజీ కల్యాణం' సినిమా టీజర్ రిలీజ్



నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొంది స్తున్నారు. ఈ రోజు ఈ సినిమా టీజర్‌ను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ నందిని రెడ్డి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమం లోలిరిక్ రైటర్ గోరటి వెంకన్న మాట్లాడుతూ నాకున్న పరిమితులతో చూస్తే నేను సినిమాల్లో ఎక్కువ పాటలు రాసినట్లే లెక్క. ఇది చాలా మంచి సినిమా. ఎలాంటి అశ్లీలత లేకుండా హాయిగా అందరూ చూడొచ్చు. అనుపమ చక్కగా నటించింది. ఈ సినిమాలో ఎవరూ నటించినట్లు లేదు జీవిం చారు. రైటర్ శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ డైరెక్టర్ భద్రప్ప నాకు ఈ కథ చెప్పినప్పుడు ప్రతి పాత్రలో క్రేజీనెస్ ఉందని అనిపించింది. డీవోపీ శ్యామ్ దూపాటి మాట్లాడుతూ మా మూవీ టీజర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాం. నటుడు కిరీటి దామరాజు మాట్లాడుతూ ఈ సినిమాతో ఒక టాలెంటెడ్ టెక్నీషియన్‌గా మా డైరెక్టర్ భద్రప్ప టాలీవుడ్ కు రాబోతున్నారు. నటి మోనిక మాట్లా డుతూ ఈ టీమ్‌తో కలిసి వర్క్ చేయడం బ్యూటి ఫుల్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. ప్రేక్షకులకు కావాల్సినంత ఎంటర్ టైన్ మెంట్ మా మూవీలో ఉంటుంది. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ నందిని రెడ్డి రాకతో మా ఈవెంట్ ఇంకా పెద్ద ఈవెంట్ అయ్యింది. ఇలాంటి మంచి మూవీలో నాకు అవకాశం కల్పించిన డైరెక్టర్ భద్రప్పకి, ప్రొడ్యూసర్, ప్రొడ్యూసర్ జగన్మోహన్‌కి, మా వేణు ఊడుగులకి థ్యాంక్స్. హీరో అఖిల్ రాజ్ మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ టీజర్ లాంచ్ చేసి మమ్మల్ని ఎంకరేజ్ చేసిన నందిని రెడ్డికి థ్యాంక్స్ చెబుతున్నాం.ఈ టీజర్ లాగే సినిమా కూడా మీ అందరికీ బాగా నచ్చుతుం దని నమ్ము తున్నా. అనుపమని పక్కా తెలంగాణ క్యారెక్టర్‌లో చూడబో తున్నారు. డైరెక్టర్ భద్రప్ప గాజుల మాట్లా డుతూ మన ఇండస్ట్రీ బంగారం నందిని రెడ్డి మా మూవీ టీజర్ లాంఛ్‌కు పిలవగానే వచ్చారు. ఆమెకు థ్యాంక్స్ చెబుతున్నాం. నందిని చేతుల మీదుగా మా మూవీ టీజర్ లాంఛ్ కావడం సంతోషంగా ఉంది.

# నేను రెడీ' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ : హీరో హవీష్



యంగ్ హీరో హవీష్ కథానాయకుడిగా, కమర్షియల్ హిట్ చిత్రాల దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ' ఇప్పటికే టీజర్, ఇతర ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. హార్నిక్స్ ఇండియా లిలిశ బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్నారు. తొలి పాట 'కొంచెం కొంచెం' కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మెరుపులే మెరుపులే సాంగ్ లాంచ్ చేశారు. డైరెక్టర్ వివి వినాయక్ ఈ ఈవెంట్ కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో హవీష్ మాటాడుతూ: 'తప్పకుండా మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుందని నమ్ముతు న్నాను. ఈ ఈవెంట్‌కు వచ్చిన డైరెక్టర్ వి.వి. వినాయక్‌కి ధన్యవాదాలు. దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ: ఇక్కడి ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కేఎల్‌యూనివర్సిటీకి వస్తున్నప్పుడు నాకు రామోజీ ఫిల్మ్ సిటీకి వచ్చిన అనుభూతి కలిగింది. సత్యనారాయణ ని చూస్తుంటే రామోజీరావుని చూసినట్లే అనిపించింది. ఈ యూనివర్సిటీ ఎంత అద్భుతంగా ఉందో, సినిమా కూడా అంతే బాగుం టుందని నమ్ముతున్నాను. దర్శకుడు త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ: "హవీష్‌కి చాలా గ్యాప్ తర్వాత ఒక కథ నచ్చింది. అదే 'నేను రెడీ'. ఇది ఆయన రీఎంట్రీ మూవీలా, కాలర్ ఎత్తుకునే సినిమా అవుతుంది. త్వరలోనే ఈ సినిమా థియేటర్లలోకి వస్తుంది. ఈ సినిమాలో యష్‌మాస్టర్‌తో ఇంట్రడక్షన్ సాంగ్‌చేయించాం.'ధమాకా'లో రవితేజ పాట ఎంత పెద్ద హిట్ అయిందో, ఈ పాట కూడా అంత పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను.

# కార్తి, ఎస్ జె సూర్య 'సర్దార్ 2' టీజర్ రిలీజ్



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్ మెంట్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రాగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. 'శాంతం... శాంతం... శాంతమే ప్రశాంతం... ఒక పొడుపు కథ చెబుతాను... 'అంటూ ఎస్.జే. సూర్య పవర్‌ఫుల్ వాయిస్‌తో టీజర్ ప్రారంభమవు తుంది. 'ఇద్దరు గూఢచారులు... ఒకడు తండ్రి, ఒకడు కొడుకు... వాళ్ల టార్గెట్ నేనే. ఇప్పుడు గెలవబోయేది మంచి విలనా... చెడ్డ హీరోనా?' అంటూ ఎస్.జే. సూర్య చెప్పే డైలాగ్స్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఎస్.జే. సూర్య పాత్ర చుట్టూనే కథలో కాన్ఫ్లిక్ట్ ఉండబోతుందనే ఆసక్తిని మేకర్స్ క్రియేట్ చేశారు.టీజర్ లో ఖిసర్దార్ఖి ప్రపంచాన్ని భారీ స్థాయిలో ప్రజెంట్ చేశారు. విజువల్స్, యాక్షన్ సీన్స్ హాలీవుడ్ స్టైల్ ఫీల్‌ను తీసుకొస్తున్నాయి. కార్తి డబుల్ రోల్‌లో అదరగొట్టారు. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ మెస్మరైజ్ చేస్తోంది. ప్రతి షాట్‌ను స్టైలిష్‌గా డిజైన్ చేసిన తీరు టీజర్‌కు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ కూడా కీలక పాత్రల్లో కనిపించారు. సామ్ సీఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు అదనపు బలం చేకూర్చి, ప్రతి యాక్షన్ బ్లాక్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది.గ్రాండ్ విజువల్స్, రిచ్ సినిమాటోగ్రఫీ, అద్భుతమైన నిర్మాణ విలువలు సినిమాను అంతర్జాతీయ స్థాయి స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా నిలబెట్టేలా కనిపిస్తున్నాయి.

# 'చైనా పీస్' ఇక 'సీక్రెట్ సోల్జర్' సెప్టెంబర్‌లో రిలీజ్



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.ఇంతకుముందు 'చైనా పీస్' పేరుతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిత్రం, ఇప్పుడు 'సీక్రెట్ సోల్జర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) యూ/ఏ 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని 2026 సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్‌గా పనిచేశారు.

# కామన్వెల్త్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు

## బాక్సింగ్‌లో పవర్ చూపిన ప్రీతి, జైస్మిన్



ప్రీతి పవార్



జైస్మిన్

**న్యూఢిల్లీ:** 2026 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సర్లు పవర్ పంచ్ చూపి రెండు స్వర్ణ పతకాలను సాధించారు. శనివారం జరిగిన ఈ పోటీల్లో బాక్సింగ్ స్టార్ ప్రీతిపవార్ ఘన విజయం సాధించి దేశానికి తొలి స్వర్ణాన్ని, మరో స్టార్ జైస్మిన్ ఇంకో స్వర్ణాన్ని అందించారు. మహిళల 54 కేజీల బ్యాంకమ్వెయిట్ కేటగిరీ ఫైనల్లో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నాపై 5-0తో ఏకగ్రీవ నిర్ణయంతో ఘనవిజయం సాధించింది. 22 యేళ్ల ప్రీతి రింగ్లో మొదటి రౌండ్ నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కచ్చితమైన పంచ్‌లు విసురుతూ, వేగవంతమైన ఫుట్‌వర్క్‌తో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను తన గుప్పిట్లోకి తెచ్చుకుంది.

తొలి రౌండ్లోనే ఐదుగురు జడ్జిల నుంచి 10-8తో ఆధిపత్యం సాధించిన ఆమె, చివరి వరకు అదే జోరును కొనసాగించి ఏకపక్ష విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో ఒక్క రౌండ్ కూడా ఓడిపోకుండా ప్రీతి ఫైనలకు చేరుకోవడం విశేషం. తొలి రౌండ్లో స్కాట్లాండ్‌కు చెందిన నియామ్ హ్యూస్టన్ను, క్వార్టర్స్లో ఆస్ట్రేలియాకు చెందిన టీనా రహీమీని ఓడించిన ఆమె, సెమీఫైనల్లో జాంబియా బాక్సర్ కేథరిన్ మ్వాపేపై 5-0తో విజయం సాధించి గోల్డ్ మెడల్ బౌట్‌కు అర్హత సాధించింది. అలాగే ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన మైఖేలా వాల్ష్‌ను 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించి, భారత క్రీడాకారిణి జైస్మిన్ 57 కేజీల బాక్సింగ్ విభాగంలో రెండో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. జైస్మిన్ స్పష్టమైన పంచ్‌లతో మొదటి రౌండ్ నుంచే బౌట్‌ను తన నియంత్రణలోకి తీసుకుని, మూడు రౌండ్ల పాటు జరిగిన ఈ పోటీలో వాల్ష్‌పై నిరంతరం ఒత్తిడి కొనసాగించింది. ఐదుగురు న్యాయమూర్తుల్లో ముగ్గురు 29-28 స్కోరు, ఇద్దరు 30-27 స్కోరుతో తీర్పునిచ్చారు.

జైస్మిన్ అద్భుతమైన సంయమనాన్ని, వ్యూహాత్మక అవగాహనను ప్రదర్శించి వాల్ష్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టింది. పదునైన పంచ్‌లను విసరగలగడం, ప్రత్యర్థి ముందడుగులను అడ్డుకోగలగడం వంటి ఆమె సామర్థ్యమే అగ్రస్థానాన్ని దక్కించుకోవడంలో కీలక పాత్ర పోషించింది.





### కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్‌లో..

# సోమన్‌కు స్వర్ణం

## శుభమ్‌కు రజతం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ పారా అథ్లెటిక్స్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. శనివారం జరిగిన పురుషుల ఎఫ్57 షాట్‌పుట్ పోటీలో సోమన్ రాణా, శుభమ్ జుయల్ చిరస్మరణీయమైన స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ ఫలితంతో గ్లాస్గో గేమ్స్‌లో పారా అథ్లెటిక్స్‌లో భారతదేశం మూడవసారి డబుల్ పోడియం సాధించగా, ఈ వారం ప్రారంభంలో జరిగిన మహిళల ఎఫ్57 పోటీ తర్వాత షాట్ పుట్ ఈవెంట్లలో ఇది దేశానికి రెండవది. ప్రపంచ పతక విజేత సోమన్ రాణా, తొలి ప్రయత్నంలో 13.38 మీటర్ల త్రోతో తన ఆధిపత్యాన్ని చాటుకుని, రెండవ ప్రయత్నంలో దానిని 13.40 మీటర్లకు మెరుగుపరిచాడు. మిగిలిన నాలుగు త్రోలలో అతను ఆ మార్కును అధిగమించలేకపోయినప్పటికీ, అది అతనికి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకోవడానికి సరిపోయింది. ఈ విజయంతో భారతదేశానికి ఈ క్రీడల్లో పారా అథ్లెటిక్స్‌లో మూడవ స్వర్ణ పతకం కూడా లభించింది. అలాగే స్వదేశీయుడైన శుభమ్ జుయల్ పటిష్టమైన, నిలకడైన సిరీస్ ఆడి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జుయల్ 13.08 మీటర్లతో ప్రారంభించి, తన మూడవ ప్రయత్నంలో 13.27 మీటర్లకు మెరుగుపడ్డాడు. 13.16 మీటర్లు మరియు 12.88 మీటర్ల త్రోల తర్వాత, ఈ భారత ఆటగాడు తన చివరి ప్రయత్నంలో 13.28 మీటర్ల త్రోతో ఈపోటీలో తన అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. పురుషుల ఎఫ్57 ఫలితంతో, పారా క్రీడలపోటీలో భారత్ రికార్డు స్థాయిలో 7 పతకాలను (మూడు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్యాలు) సాధించి తన ప్రచారాన్ని ముగించింది.

### కామన్వెల్త్ ట్రిపుల్ జంప్‌లో..

# ప్రవీణ్ రజతం

## సెల్వ కాంస్యం







**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ పురుషుల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో భారత్ చిరస్మరణీయమైన డబుల్ పోడియంను సాధించింది. శనివారం జరిగిన పోటీ ఫైనల్‌లో జాతీయ రికార్డు హోల్డర్ ప్రవీణ్ చిత్రవేల్ రజత పతకాన్ని గెలుచుకోగా, యువ జంపర్ సెల్వ ప్రభు తిరుమరన్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రవీణ్ 16.58 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకోగా, సెల్వ 16.52 మీటర్ల సీజన్‌బెస్ట్ జంప్‌తో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రవీణ్, ఈ ఈవెంట్‌లో 16.05 మీటర్లతో ప్రారంభించి, ఆ తర్వాత 15.64 మీటర్లు, 16.31 మీటర్ల ప్రయత్నాలు చేసి, తన నాలుగో జంప్‌లో 16.58 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. అతని చివరి జంప్‌ను ఫౌల్‌గా ప్రకటించారు. ఈలోగా, సెల్వా 15.87 మీటర్లతో ప్రారంభించి, క్రమంగా మెరుగుపడి, తన తొలి మూడు ప్రయత్నాలలో 16.17 మీటర్లు మరియు 16.43 మీటర్లు నమోదు చేశాడు. నాలుగో రౌండ్‌లో ఫౌల్ అయిన తర్వాత, అతను తన ఐదవప్రయత్నంలో ఈ సీజన్‌లోనే అత్యుత్త మమైన 16.52 మీటర్లు సాధించి కాంస్య పతక స్థానానికి చేరుకున్నాడు.

# నేడే హైవోల్టేజ్ పోరు




## పాకిస్థాన్‌తో భారత్ ఢీ




**న్యూఢిల్లీ:** ఏషియన్ లెజెండ్స్ లీగ్ 2026 టోర్నీలో భాగంగా హైవోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 2వ తేదీ ఆదివారం నాడు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్, పాకిస్థాన్ సమరం జరగనుంది. ఇండియన్ రాయల్స్, పాకిస్థాన్ పాంథర్స్ జట్ల మధ్య జరిగే ఈ ఆరో మ్యాచ్ జాంబియాలోని లుసాకా నగరంలో ఉన్న లోటస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్‌లో జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఈ హైవోల్టేజ్ పోరు సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమ వుతుంది. ఇండియన్ రాయల్స్ జట్టు శిఖర్ ధావన్ కెప్టెన్సీలో దినేష్ కార్తీక్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్, యూసుఫ్ పఠాన్, అంబటి రాయుడు, రిషి ధావన్, స్టువర్ట్ బిన్ని వంటి స్టార్ స్థాయి ఆటగాళ్లతో ఎంతో బలంగా మైదానంలోకి దిగుతోంది. తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టైగర్స్ జట్టును 19 పరుగుల తేడాతో ఓడించి ఇండియన్ రాయల్స్ విజయంతో బోణీ కొట్టింది.

మరోవైపు మహమ్మద్ హఫీజ్ సారథ్యంలో ఉమర్ అక్మల్, షోయబ్ మాలిక్, వహాబ్ రియాజ్, సోహైల్ తన్వీర్, సైద్ అజ్మల్ వంటి వెటరన్ ఆటగాళ్లతో కూడిన పాకిస్థాన్ పాంథర్స్ జట్టు తమ మొదటి మ్యాచ్‌లో ఏషియన్ స్టార్స్ చేతిలో 85 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. దీంతో టీమిండియాతో జరగనున్న ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి టోర్నీలో తిరిగి పుంజుకోవాలని పాకిస్థాన్ జట్టు తీవ్రంగా శ్రమిస్తోంది. కాగా ఆసియా ఖండానికి చెందిన రిటైర్డ్ దిగ్గజ క్రికెటర్లు పాల్గొంటున్న ఏషియన్ లెజెండ్స్ లీగ్ సీజన్ 2 జూలై 30న ప్రారంభమై ఆగస్టు 10న ముగియనుంది.

ఈ టోర్నమెంట్లో మొత్తం 19 టి20 మ్యాచ్‌లు జరగనున్నాయి. గతేడాది జరిగిన తొలి సీజన్లో భారత్ ఫైనల్ చేరుకుని రన్నరప్‌గా నిలిచింది. మైదానంలో మళ్లీ పాత రోజులను గుర్తుచేస్తూ తలపడనున్న భారత్, పాకిస్థాన్ జట్ల పోరు ఈ లీగ్‌కే ప్రతిష్టాత్మకంగా నిలవనుండటంతో ఇరు దేశాల అభిమానులలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# తైపే ఓపెన్‌లో.. ఫైనల్‌కు తన్వీ



**న్యూఢిల్లీ:** తైపే ఓపెన్ 2026లో భారత క్రీడాకారిణి తన్వి శర్మ తన అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ, దూసుకెళ్లింది. శనివారం ఐదో సీడ్ అయిన హువాంగ్ యుహసున్‌పై వరుస గేమ్‌లలో తిరుగులేని విజయంతో మహిళల సింగిల్స్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ 34వ ర్యాంకర్, తైపే అరీనాలో కేవలం 33 నిమిషాల్లోనే హువాంగ్‌ను 21-17, 21-11 తేడాతో ఓడించి టైటిల్ పోరులో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన నాలుగో సీడ్ సుపనిదా కటెథాంగ్‌పై క్వార్టర్‌ఫైనల్‌లో కష్టపడి గెలిచిన మ్యాచ్‌లో, మధ్యలో ఊపు కోల్పోయి తిరిగి పుంజుకోవాల్సి వచ్చింది. దానికి భిన్నంగా, సెమీఫైనల్‌లో తన్వి ప్రశాంతమైన ప్రదర్శన కనబరిచింది. ఆమె ఆరంభం నుంచే ఆట వేగాన్ని తన నియంత్రణలో ఉంచుకుని హువాంగ్‌కు పుంజుకునే ఏ అవకాశాన్నీ ఇవ్వలేదు. మరో సెమీఫైనల్‌లో ఉన్నతి హుడా, గుయెన్ థుయ్ లిన్ చేతిలో ఓడిపోవడంతో టోర్నీ నుండి నిష్క్రమించింది. ఇక పురుషుల సింగిల్స్ పోరు క్వార్టర్ ఫైనల్స్‌లో ముగిసింది, ఇందులో కిరణ్ జార్జ్ జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ యుడై ఒకిమోటో చేతిలో 21-12, 21-10 తేడాతో ఓడిపోయాడు. అంతకుముందు, హెచ్ఎస్ ప్రణయ్ రౌండ్ ఆఫ్ 16లో నిష్క్రమించాడు. పురుషుల డబుల్స్ ఈవెంట్ తొలి రౌండ్‌లోనే భార్గవ్ రామ్ అరిగేల, విశ్వ తేజ్ గొబ్బూరులు నిష్క్రమించడంతో, ఈ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ ప్రయాణం కూడా ముగిసింది.



### వాణిజ్య ఎల్పీజి సిలిండర్

# ధర రూ.192 తగ్గింపు

## విమాన ఇంధన ధరలు లీటరుకు రూ.5 పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలు వినియోగించే 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.192 మేర తగ్గించింది. అదే సమయంలో విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలను లీటరుకు రూ.5 పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరలను ప్రకటించాయి.తాజా సవరణల ప్రకారం ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,930 నుంచి రూ.2,738కుతగ్గింది. మరోవైపు విమాన ఇంధనం ధర లీటరుకు రూ.110నుంచిరూ.115కు పెరిగింది. ఇది వరుసగా జూలై 1న కూడా సిలిండర్‌పై రూ.183.50 తగ్గింపు ప్రకటించారు. మరోవైపు జూలైలో తగ్గించిన ఎటిఎఫ్ ధరలను ఇప్పుడు అదే స్థాయిలో మళ్లీ పెంచడం గమనార్హం. ఫిబ్రవరి చివర్లో మధ్యప్రాచ్యంలో ప్రారంభమైన ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన ధరలు భారీగా పెరగడంతో జూన్ నెలలో కమర్షియల్ ఎల్పీజీ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఫిబ్రవరిలో రూ.1,740.50 ఉన్న 19 కిలోల సిలిండర్ ధర జూన్ నాటికి రూ.3,113.50కు చేరి మొత్తం రూ.1,373 పెరిగింది.

అయితే జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా ధరలు తగ్గడంతో వ్యాపార వర్గా లకు కొంత ఉపశమనం లభించింది. అదేవిధంగా 5 కిలోల మార్కెట్ ధర ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.808.50 నుంచి రూ.762కు తగ్గించారు.ప్రతి నెల మొదటి తేదీన అంతర్జాతీయ ఎల్పీజీ ధరలు, విదేశీ మారకపు విలువల ఆధారంగా ఈ ధరలను సవరించగా, రాష్ట్రాల వారీగా విధించే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా ధరల్లో స్వల్ప తేడాలు ఉండనున్నాయి.

### వొడాఫోన్ ఐడియాకు

# రూ.26.83 కోట్ల జరిమానా నోటీసు




**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు కేంద్ర టెలికాం శాఖ రూ.26.83 కోట్ల లిక్విడేటెడ్ డ్యామేజెస్ చెల్లించాలని నోటీసు జారీ చేసింది. 2022లో నిర్వహించిన స్పెక్ట్రం వేలంలో కేటాయించిన స్పెక్ట్రానికి సంబంధించి కనీస నెట్‌వర్క్ విస్తరణ బాధ్యతలను పాటించలేదనే ఆరోపణల నేపథ్యంలో ఈ నోటీసు జారీ చేసినట్లు సంస్థ శనివారం వెల్లడించింది.శుక్రవారం అందిన ఈ నోటీసును ప్రస్తుతం పరిశీలిస్తున్నామని, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష కొనసాగుతోందని వొడాఫోన్ ఐడియా బిఎస్ఇకి సమర్పించిన నివేదికలో పేర్కొంది. టెలికాం శాఖ జారీ చేసిన నోటీసులో, 2022 స్పెక్ట్రం వేలానికి సంబంధించిన స్పెక్ట్రం కేటాయింపుపై విధించిన కనీస నెట్‌వర్క్ విస్తరణ నిబంధనలను పాటించలేదనే ఆరోపణలతో రూ.26.83 కోట్ల లిక్విడేటెడ్ డ్యామేజెస్ చెల్లించాలని ఆదేశించినట్లు కంపెనీ తెలిపింది.ఈ ఉల్లంఘన 2022 స్పెక్ట్రం వేలానికి సంబంధించిన నోటీస్ ఇన్వైటింగ్ అప్లికేషన్స్‌లో పేర్కొన్న నెట్‌వర్క్ విస్తరణ నిబంధనలకు సంబంధించినదని, స్పెక్ట్రం కేటాయింపు అనంతరం ఆయా బాధ్యతలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. ఈ నోటీసు కారణంగా కంపెనీ కార్యకలాపాలపై లేదా ఆర్థిక పరిస్థితిపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేదని వొడాఫోన్ ఐడియా స్పష్టం చేసింది.ఈ అంశంపై నోటీసును పూర్తిగా పరిశీలించి, చట్టపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని కంపెనీ తన ప్రకటనలో తెలిపింది.

# మెగా కంపెనీల షేర్లకు లాభాలు తక్కువే

## జులై నెలపై మార్కెట్ నిపుణుల అంచనాలు




**ముంబయి,ఆగస్టు 1:** బిఎస్ఇ 500 సూచీలోని సగానికి పైగా కంపెనీల షేర్లు మార్కెట్ రాబడిని అధిగమించలేకపోయాయి. బిఎస్ఇలో నమోదైన మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 87 శాతం వాటా కలిగిన ఈ కంపెనీల్లో చాలా వరకు షేర్లు 1 శాతం కంటే తక్కువ లాభాన్నే నమోదు చేశాయి.జులైలో మొత్తం 280 షేర్లు 22 శాతం వరకు పతనమయ్యాయి. అదే సమయంలో బిఎస్ఇ సెన్సెక్స్, బిఎస్ఇ500, బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీలు 1 నుంచి 2 శాతం మధ్య లాభాలను నమోదు చేశాయి. బిఎస్ఇ స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 0.1 శాతం తగ్గింది.ఇక నిఫ్టీ50, నిఫ్టీ మిడ్‌క్యాప్100, నిఫ్టీ స్మాల్‌క్యాప్100, నిఫ్టీ500 సూచీలు జులైలో 1.4 శాతం నుంచి 2.1 శాతం వరకు పెరిగాయి.భారీగా నష్టపోయిన షేర్లుజులైలో మార్కెట్ విలువ 15 నుంచి 20 శాతం వరకు క్షీణించిన ప్రముఖ కంపెనీల్లో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, బంధన్ బ్యాంక్, థర్మాక్స్, తేజాస్ నెట్‌వర్క్స్, సుజ్లాన్ ఎనర్జీ, జీఈ వెర్నోవా టీ అండ్ డీ ఇండియా, సీమెన్స్ ఎనర్జీ ఇండియా, గుజరాత్ ఎనర్జీ ఉన్నాయి. ఈ నెలలో కల్యాణ్ జ్యువెలర్స్ ఇండియా షేరు ధర ఏకంగా 63 శాతం ఎగిసింది. ఈక్లెర్క్స్ సర్వీసెస్, సీఈ ఇన్ఫో సిస్టమ్స్, లోధా డెవలపర్స్, హెచ్ఈజీ, ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా), ఎల్‌టీఐఎం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్ షేర్లు 26 నుంచి 46 శాతం వరకు పెరిగాయి. మొదటి త్రైమాసిక ఫలితాలు అంచనాలకు మించి రావడం, గ్లోబల్ ఏఐ ట్రేడ్ అమ్మకాల నేపథ్యంలో ఐటీ రంగంలో మళ్లీ కొనుగోళ్లు పెరగడం వల్ల ఎంపిక చేసిన షేర్లు లాభపడ్డాయి. గతనెలలో రంగాల వారీగా చూస్తే బీఎస్ఈ ఐటీ సూచీ 16 శాతం పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కన్స్యూమర్ డ్యూరబుల్స్ 9.4 శాతం, రియాల్టీ 8.4 శాతం, ఆటో 5.9 శాతం లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, మెటల్ సూచీలు 1.6 నుంచి 3 శాతం వరకు పెరిగాయి. బలహీనంగా నిలిచిన రంగాల్లో బిఎస్ఇ క్యాపిటల్ గూడ్స్ సూచీ 7.1 శాతం, పవర్ సూచీ 6.4 శాతం క్షీణించి అత్యంత బలహీన రంగాలుగా నిలిచాయి.

బిఎస్ఇ టెలికమ్యూనికేషన్, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు కూడా 3 శాతం వరకు తగ్గాయి. తాజా ఎన్ఎస్‌డీఎల్ డేటాచూస్తే జులై 2026లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.15,412 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. గత నాలుగు నెలలుగా అమ్మకాల వైపు ఉన్న ఎఫ్‌పీఐలు ఈసారి కొనుగోళ్లకు మళ్లడం విశేషం. మరోవైపు దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.32,839 కోట్ల నికరంగా పెట్టుబడులు పెట్టారు.

# జిఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షలకోట్లు

## రిఫండ్లు రూ.30 వేల కోట్లకు పెరుగుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 1: కేంద్రం జూలై నెలకు సంబంధించిన గూడ్స్ జీఎస్టీవసూళ్ల వివరాలు వెల్లడించింది. జూలైలో రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు ప్రకటించింది. ఇందులో సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) వసూళ్లు రూ.39,835 కోట్లు, స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వసూళ్లు రూ.47,881 కోట్లుకాగా ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1.23 లక్షలుగా ఉన్నాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే గతేడాది ఇదే నెలకు సంబంధించి జీఎస్టీ వసూళ్లలో 15.4 శాతం పెరుగుదల ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కావడం ఇది రెండోసారి. చివరగా గత ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ వివరాల్ని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం, ఆగష్టు 1న విడుదల చేసింది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు.

జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, జూలైలో స్థూల (గ్రాస్) జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే నెలలో ఇవి రూ.1.83 లక్షల కోట్లు ఉండగా, ఈసారి సుమారు 15 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర (నెట్) జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది జూలైలో ఇవి రూ.1.57 లక్షల కోట్లు మాత్రమే ఉన్నాయి. నెలవారీ ప్రాతిపదికన కూడా జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. జూన్‌లో రూ.1.95 లక్షల కోట్లు ఉన్న గ్రాస్ జీఎస్టీ వసూళ్లు జూలైలో 8.4 శాతం పెరిగి రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. అదే విధంగా నెట్ జీఎస్టీ వసూళ్లు రూ.1.62 లక్షల కోట్ల నుంచి రూ.1.81 లక్షల కోట్లకు పెరిగి 11.6 శాతం వృద్ధి నమోదు చేశాయి.జూలైలో దిగుమతులకు సంబంధించిన జీఎస్టీ వసూళ్లు దేశీయ ఆదాయాన్ని మించి వేగంగా పెరిగాయి. దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన గ్రాస్ జీఎస్టీ ఆదాయం 10.1 శాతం పెరిగి రూ.1.45 లక్షల కోట్లకు చేరగా, దిగుమతులపై వసూలైన గ్రాస్ జీఎస్టీ 28.8 శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరింది.రిఫండ్‌లను మినహాయించిన తర్వాత దేశీయ నెట్ జీఎస్టీ ఆదాయం 10.5 శాతం పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరింది.

### 5.9 కోట్లకు పైగా ఆదాయపు పన్ను

# రిటర్నులు దాఖలు




**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** ప్రస్తుత అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి గతనెలాఖరునాటికి దేశవ్యాప్తంగా 5.9 కోట్లకు పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. గణాంకాలను పరిశీలిస్తే ఐటీఆర్1 (సహజ్) దాఖలు సంఖ్యలో స్వల్ప తగ్గుదల కనిపించింది. గత యేడాది ఇదే సమయానికి 3.3 కోట్ల ఐటీఆర్1లు దాఖలవగా, ఈసారి ఆ సంఖ్య 3.15 కోట్లకు పరిమితమైంది. మరోవైపు ఐటీఆర్2 దాఖలు సంఖ్య గత ఏడాదితో పోలిస్తే దాదాపు సమాన స్థాయిలోనే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ సోషల్‌మీడియాలో స్పందిస్తూ, పన్ను చెల్లింపుదారులందరికీ ధన్యవాదాలు. జూలై 31 నాటికి 2026 అసెస్‌మెంట్ ఇయర్‌కు 5.9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. మీ విశ్వాసం, సమయానికి పన్ను రిటర్నులు దాఖలు చేయడం భారత ఆర్థికాభివృద్ధికి శక్తినిస్తోందని పేర్కొంది. ఐటీఆర్1 దాఖలు సంఖ్య తగ్గడానికి కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు పరిమితి పెరగడం ఒక కారణమై ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దీంతో కొంతమంది పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేయాల్సిన అవసరం తగ్గినట్లు విశ్లేషిస్తున్నారు. ఐటీఆర్3 మరియు ఐటీఆర్4 దాఖలుకు గడువు ఆగస్టు 31 వరకు ఉండటంతో, రాబోయే వారాల్లో మొత్తం ఐటీఆర్ దాఖలుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఐటీఆర్1 (సహజ్) అనేది చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారుల కోసం రూపొందించిన సరళమైన రిటర్న్ ఫారం. వార్షిక ఆదాయం రూ.50 లక్షలవరకు, జీతం, ఒక ఇంటినుంచి వచ్చే ఆదాయం, రూ.5,000 వరకు వ్యవసాయ ఆదాయం ఉన్న భారతీయ నివాసితులు దీనిని ఉపయోగించవచ్చు. ఇక ఐటీఆర్2 మూలధన లాభాలు వంటి ఇతర వనరుల నుంచి ఆదాయం పొందే వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు దాఖలు చేసే రిటర్న్ ఫారం. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు ఐటీఆర్1, ఐటీఆర్2లను జూలై 31లోపు దాఖలు చేస్తే వడ్డీ లేదా ఆలస్య రుసుము లేకుండా రిటర్నులు సమర్పించే అవకాశం కల్పించబడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.